RNI.No. APTEL/2014/57702 Estd.: 2000 www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం




Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal

సంపుటి : 10 || సంచిక : 170 || గుంటూరు || మంగళవారం, డిసెంబర్ 03, 2024 || VOODAYAM Telugu Daily || వెల : రూ. 1.00 || పేజీలు : 12

# చంద్రబాబు పవన్ కళ్యాణ్ సుదీర్ఘ భేటీ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. సోమవారం మధ్యాహ్నం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్ కళ్యాణ్.. సుమారు రెండు గంటలపాటు చంద్రబాబుతో సమావేశమయ్యారు. చంద్రబాబు పవన్ కళ్యాణ్ భేటీలో కీలక అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ ఇటీవలే ఢిల్లీ పర్యటనకు వెళ్లి వచ్చారు. ఢిల్లీ పర్యటన పూర్తిచేసుకుని ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వచ్చిన పవన్ కళ్యాణ్.. కాకినాడ పోర్టులో బియ్యం అక్రమ రవాణాను బయటకు తీసుకువచ్చారు. చంద్రబాబుతో భేటీలో పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటన వివరాలతో పాటుగా.. కాకినాడలో బియ్యం అక్రమ రవాణా గురించి కూడా చర్చించినట్లు తెలిసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని మూడు రాజ్యసభ స్థానాలకు త్వరలోనే ఉప ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ 20వ తేదీ పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ కూడా విడుదల చేసింది. అసెంబ్లీలో ఎన్డీఏ కూటమికి ఉన్న సంఖ్యా బలాన్ని పరిగణనలోకి తీసుకుంటే మూడు స్థానాలు ఎన్డీఏ కూటమికే దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కూటమిలోని మూడు పార్టీలు ఎవరిని బరిలోకి దింపాలా అని ఆలోచిస్తున్నాయి. అలాగే ఏ పార్టీ ఎన్ని రాజ్యసభ సీట్లు తీసుకుంటుందనే విషయంపైనా ఆసక్తి నెలకొంది. టీడీపీ నుంచి బీద మస్తాన్‌రావు మరోసారి రాజ్యసభకు పోటీ చేస్తారని సమాచారం. అలాగే బీజేపీ నుంచి ఆర్. కృష్ణయ్యకు అవకాశం ఇస్తారని టాక్. మిగిలిన మూడో సీటును కూడా టీడీపీ కోరుతోందని సమాచారం.

ఈ నేపథ్యంలోనే రాజ్యసభ సీట్ల విషయంలో సీఎం చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ చర్చించినట్లు సమాచారం. జనసేన నుంచి పవన్ కళ్యాణ్ సోదరుడు నాగాబాబును రాజ్యసభకు పంపుతారనే వార్తల నడుమ ఈ భేటీ ఆసక్తికరంగా మారింది. ఈ విషయంలో బీజేపీ పెద్దలతో పవన్ కళ్యాణ్ ఇప్పటికే చర్చించినట్లు తెలిసింది. మరోవైపు డిసెంబర్ మూడో తేదీన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఏపీ కేబినెట్ భేటీ గురించి కూడా పవన్ కళ్యాణ్, చంద్రబాబు చర్చించినట్లు సమాచారం. మంత్రివర్గ భేటీలో ఏయే అంశాలను చర్చించాలనే దానిపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిసింది. అలాగే సోషల్ మీడియా కేసుల అంశం సైతం ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం .







# రామ్ గోపాల్ వర్మకు హైకోర్టు ఊరట!

- రామ్ గోపాల్ వర్మకు రిలీఫ్
- ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు
- తొందరపాటు చర్యలు వద్దని ఆదేశం

సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఊరట లభించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రామ్ గోపాల్ వర్మకు రిలీఫ్ లభించింది. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారనే ఆరోపణలపై.. రామ్ గోపాల్ వర్మ మీద ఆంధ్రప్రదేశ్?లో కేసులు నమోదయ్యాయి. రామ్ గోపాల్ వర్మ ట్వీట్ల కారణంగా తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ ఆంధ్రప్రదేశ్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఒంగోలు పోలీసులు విచారణకు రావాలంటూ ఆర్జీవీకి నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఈ కేసులకు సంబంధించి తనకు ముందస్తు బెయిల్ జారీ చేయాలంటూ రామ్ గోపాల్ వర్మ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వటంతో పాటుగా.. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా పోలీసులను ఆదేశించాలని హైకోర్టులో రామ్ గోపాల్ వర్మ పిటిషన్ వేశారు. ఆర్జీవీ పిటిషన్‌ను విచారించిన ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. రామ్ గోపాల్ వర్మపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. అప్పటి వరకూ అంటే నవంబర్ 9 వరకూ రామ్ గోపాల్ వర్మను అరెస్ట్ చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. మరోవైపు రామ్ గోపాల్ వర్మను విచారణకు రావాలంటూ నోటీసులు జారీ చేసిన ఒంగోలు పోలీసులు.. ఇటీవల హైదరాబాద్‌లోని ఆయన డెన్ వద్దకు కూడా వచ్చారు. ఆర్జీవీ విచారణకు హాజరుకాకపోవటం.. పోలీసులు హైదరాబాద్ రావటంతో ఆయనను అరెస్ట్ చేస్తారనే ప్రచారం జరిగింది. దీనికి తోడు రామ్ గోపాల్ వర్మ పోలీసులకు అందుబాటులో లేకుండా పోవటం.. ఆయన ఫోన్ స్విఛాఫ్ రావటంతో రామ్ గోపాల్ వర్మ పరారీలో ఉన్నారంటూ వార్తలు వచ్చాయి. కోయంబత్తూరులో ఉన్నారని.. ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారంటూ ప్రచారం జరిగింది. ఈ సమయంలోనే ఎక్స్ వేదికగా స్పందించిన రామ్ గోపాల్ వర్మ.. తాను ఎక్కడకూ పారిపోలేదంటూ సమాధానం ఇచ్చారు. పోలీసులు తనను అరెస్ట్ చేస్తారనేది ప్రచారం మాత్రమేనని.. ఇప్పటివరక్నూ ఆర్జీవీ డెన్‌లోకి పోలీసులు కాలు కూడా పెట్టలేదని రామ్ గోపాల్ వర్మ క్లారిటీ ఇచ్చారు.

# జగన్ ఆస్తుల కేసులో కొత్త మలుపు

- స్టే ఇవ్వడానికి నిరాకరించిన చీఫ్ జస్టిస్ బెంచ్
- బెయిల్ రద్దుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా
- ప్రశ్నల వర్షం కురిపించిన సుప్రీంకోర్టు

హైదరాబాద్ డిసెంబర్ 2 : వైసీపీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ హైకోర్టులో సోమవారం ఈ కేసులో A 2 నిందితుడు ఎంపీ విజయ్ సాయి రెడ్డిపై వేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా ఇచ్చిన నోటీసులపై విచారణ చేసింది. వ్యక్తిగత దుష్ప్రవర్తనపై విజయ్ సాయి రెడ్డి విచారించాలని ఇప్పటికే ఐసీఏఐ నోటీసులు ఇచ్చింది. ఎంపీ విజయ్ సాయి రెడ్డికి ఇచ్చిన నోటీసులు రద్దు చేస్తూ గతంలో సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విజయ సాయి రెడ్డికి , కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది M.S . ప్రసాద్ కోరారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు పై స్టే ఇవ్వడానికి చీఫ్ జస్టిస్ బెంచ్ నిరాకరించింది. ఐసీఏఐ వాదనలపై కౌంటర్ దాఖలు చేస్తామని విజయ్ సాయి రెడ్డి తరుపు న్యాయవాది తెలిపారు. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

**సుప్రీంకోర్టు ప్రశ్నల వర్షం..**

మరోవైపు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బెయిల్ రద్దుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. జగన్ బెయిల్‌ను రద్దు చేయడమే కాకుండా కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ గతంలో సుప్రీంలో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు (సోమవారం) విచారించింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ పురోగతి ఏ దశలో ఉందని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. సీబీఐ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టులో జగన్ అక్రమాస్తులపై దాఖలైన కేసుల వివరాలను పట్టిక రూపంలో ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. రోజు వారీ విచారణకు ఆదేశించినా ఎక్కడ ఆటంకం కలుగుతుందని ప్రశ్నించింది. ఏఏ కోర్టులలో ఏఏ కేసులు దాఖలయ్యాయి... వాటి విచారణ ఏ దశలో ఉందో తెలుపుతూ సమగ్రంగా పట్టిక రూపంలో ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అఫిడవిట్ రూపంలో ఇచ్చిన పట్టిక చూసిన తరువాత ఏం చేయాలో చెబుతామని జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను డిసెంబర్ 13కు సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

**రోజువారీ విచారణ జరపాలి.. రఘురామ**

కాగా.. గతంలో జగన్ ఏపీ సీఎంగా ఉన్నప్పుడు రఘురామకృష్ణ రాజు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జగన్ బెయిల్‌ను రద్దు చేయాలని, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, తెలంగాణ సీబీఐ కోర్టులో విచారణ మందకొడిగా సాగుతోందని, విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయడమే కాకుండా రోజువారీ విచారణ జరపాలని రఘురామ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సుప్రీంలో అనేక సార్లు విచారణ జరిగింది. సీజేఐగా జస్టిస్ సంజీవ్ కన్నా నియమితులైన తర్వాత ఆయన బెంచ్ ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. అయితే ఆయన బెంచ్‌లో మరో న్యాయమూర్తి అయిన సంజయ్ కుమార్ ఈ పిటిషన్‌ను నాట్ బిఫోర్ మీ అనడంతో వాయిదా పడింది.

దీంతో ఈరోజు జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. విచారణ సందర్భంగా సీబీఐ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టులో అనేక దశల్లో, అనేక పిటిషన్లు, ఎన్నో విచారణ జరుగుతుండటంతో గందరగోళ పరిస్థితి ఉందని.. అసలు ఎక్కడెక్కడ ఏఏ పిటిషన్‌లు విచారణలో ఉన్నాయి, సీబీఐ కోర్టులో ఇప్పటి వరకు ఎందుకు విచారణ జరగడం లేదు.. సీబీఐ కోర్టులో రోజువారీ విచారణ జరపాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఎందుకు విచారణ జరగడం లేదని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. డిశ్చార్జ్ పిటిషన్‌లకు సంబంధించిన విచారణ జరుగుతోందని అందుకే అక్కడ రోజువారీ విచారణకు ఆటంకం కలుగుతోందని జగన్ తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఎన్ని డిశ్చార్జ్ పిటిషన్‌లు వేశారని.. ఎందుకు ఇంత జాప్యం జరుగుతోందని ధర్మాసనం మరో ప్రశ్న వేసింది. అలాగే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు పాటించలేదని ప్రశ్నించడంతో పాటు సుప్రీంకోర్టులో జగన్ అక్రమాస్తులకు సంబంధించి పిటిషన్లు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని ప్రశ్నల వర్షం కురిపించింది. దీనిపై ఓ పట్టిక రూపంలో అఫిడవిట్‌లా ఇవ్వాలని.. దాన్ని చూసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు చెప్పినప్పటికీ విచారణ జరగడం లేదంటే దీనిపై ఓ కచ్చితమైన నిర్ణయం తీసుకోవాల్సిందే అని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయ పడింది. అయితే ఈ కేసును జనవరికి వాయిదా వేయాలని జగన్ మోహన్ రెడ్డి తరపు న్యాయవాది కోరగా.. అందుకు సుప్రీం నిరాకరిస్తూ డిసెంబర్ 13న విచారణ జరుపుతామంటూ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం వాయిదా వేసింది. జగన్‌కు సంబంధించిన అక్రమాస్తులకు సంబంధించి అన్ని కోర్టుల్లో దాఖలైన పిటిషన్ల వివరాలు తెలుసుకున్న తరువాత సమగ్రమైన నిర్ణయం తీసుకుంటామని సుప్రీం కోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది.




# ఏపీ ప్రభుత్వం మందుబాబులకు శుభవార్త

మద్యం షాపుల్లో ఎమ్మార్పీ రేట్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయంమద్యం విధానంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. లిక్కర్ షాపుల్లో మద్యం ఎమ్మార్పీ రేట్లకంటే అధికంగా విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో.. కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలకు పాల్పడితే ఊరుకునేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. లిక్కర్ షాపుల్లో ఎమ్మార్పీ ధరల కంటే అధిక రేట్లకు మద్యం విక్రయిస్తే జరిమానాలు విధించాలని నిర్ణయించింది. తొలిసారి ఎమ్మార్పీ ఉల్లంఘనకు పాల్పడితే ఆ వైన్ షాపు యజమానికి రూ.5 లక్షలు జరిమానా విధించనున్నారు. రెండోసారి కూడా ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు మద్యం విక్రయిస్తున్నారని తేలితే.. ఆ లిక్కర్ షాపు లైసెన్స్ రద్దుచేస్తారు. అలాగే బెల్టు షాపుల విషయంలోనూ ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. బెల్టు షాపులకు మద్యం విక్రయించే లిక్కర్ షాపులకు జరిమానా విధించనున్నారు. తొలిసారి ఈ తప్పు చేస్తే రూ. 5 లక్షలు జరిమానా విధిస్తారు. బెల్టు షాపులకు మద్యం విక్రయిస్తున్నట్లు రెండోసారి కూడా తేలితే.. సదరు మద్యం దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు జీవో జారీ చేసింది. బెల్టు షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఎం నారా చంద్రబాబు నాయుడు హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలకు, అలాగే ఎమ్మార్పీ ఉల్లంఘనలకు చెక్ పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఇటీవల మందుబాబులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పిన సంగతి తెలిసిందే. నాణ్యమైన మద్యం.. క్వార్టర్ వందలోపే అందుబాటులోకి తెస్తామని చెప్పిన ఏపీ ప్రభుత్వం ఆ దిశగా పలు బ్రాండ్ల మద్యం ధరలు తగ్గించింది. కొన్ని బ్రాండ్లు ఇప్పటికే క్వార్టర్ వందలోపు ఉన్నాయి. మరికొన్ని ప్రముఖ మద్యం బ్రాండ్ల రేట్లు కూడా ఇటీవల తగ్గించారు. రాయల్ ఛాలెంజ్ సెలెక్ట్ గోల్డ్ విస్కీ క్వార్టర్ గతంలో రూ.230 ఉండగా.. దానిని రూ.210లకు తగ్గించారు. అలాగే మాన్షన్ హౌస్ క్వార్టర్ ధర రూ.220 నుంచి రూ.190కి తగ్గింది. మరో బ్రాండ్ యాంటిక్విటీ విస్కీ ఫుల్ బాటిల్ ధరను 1600 రూపాయల నుంచి రూ.1400లకు తగ్గించారు. దీంతో మందుబాబులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

# అమరావతిలో కొత్త ఈఎస్ఐ ఆస్పత్రి

## స్థలాన్ని పరిశీలించిన అధికారులు

### ఇటీవలే 20 ఎకరాలు కేటాయింపు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కీలకమైన ఆస్పత్రి, మెడికల్ కాలేజీకి ముందడుగు పడింది. ఏపీ మంత్రివర్గ ఉపసంఘం ఇటీవల అమరావతిలో ఈఎస్ఐ ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఏర్పాటుకు 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. ఈ మేరకు నెక్కల్లు సమీపంలో సర్వే నంబరు 20లో ఈ–8 రహదారి పక్కన ఉన్న స్థలాన్ని ఈఎస్ఐ, సీఆర్డీఏ అధికారులు పరిశీలించారు. నేషనల్ హైవేకు అనుసంధానం, రాబోయే రోజుల్లో అభివృద్ధి చేసే విధానం, దగ్గరలో స్థలాలు కేటాయించిన సంస్థల వివరాలను సీఆర్డీఏ అధికారులు ఈఎస్ఐ అధికారులకు వివరించారు. ఈఎస్ఐ ఆస్పత్రికి స్థలం కేటాయించిన ప్రాంతానికి సమీపంలోనే అమరావతి రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతుందని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం రాజధాని సెంట్రల్ పాయింట్‌గా ఉంటుందన్నారు. అమరావతిలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి, వైద్య, నర్సింగ్, ఫార్మసీ కళాశాలలు నిర్మించాల్సి ఉన్నందున.. భవిష్యత్ అవసరాల కోసం మరో 20 ఎకరాలు కేటాయిస్తే బాగుంటుందనే అంశంపైనా చర్చించారు. ఈ స్థలాన్ని పరిశీలించిన వారిలో ఈ బీమా, వైద్య సేవల డైరెక్టర్ వీ ఆంజనేయ, ఈఎస్ఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, జాయింట్ డైరెక్టర్ జి.జగదీప్ గాంధీ, తహసీల్దారు రవిబాబు, సీఐఎస్ ప్లానింగ్ అధికారి రవితేజలు ఉన్నారు. ఈఎస్ఐకి నాన్ పొల్యూషన్ ఇండస్ట్రియల్ జోన్ పక్కన (బిజినెస్ పార్క్) 20 ఎకరాలను సీఆర్డీఏ కేటాయించింది. కృష్ణాయపాలెం నుంచి నెక్కల్లు వరకు రహదారి పక్కన ఈ ప్రాంతం ఉంది. త్వరలోనే ఆస్పత్రికి నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభించే అవకాశం ఉంది. కేంద్రం అమరావతిలో 500 పడకల ఈఎస్ఐ సెకండరీ కేర్ ఆసుపత్రితోపాటుగా 150 పడకల సూపర్ స్పెషాలిటీ పడకలతో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ఓకే చెప్పింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన ఈఎస్ఐ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి.. విభజన తర్వాత తెలంగాణకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ఏపీలో ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.. ఈ మేరకు అమరావతిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఈ ఆస్పత్రి నిర్మాణం, నిర్వహణను ఈఎస్ఐ కార్పొరేషన్‌కే అప్పగిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వ్యయం చేయాల్సిన పని ఉండదు. ఒకవేళ రాష్ట్రమే నిర్వహించాలనుకుంటే ఒప్పందం వ్యయంలో 1/8 వంతు భరించాల్సి ఉంటుంది. రాబోయే రోజుల్లో అమరావతికి కనెక్టివిటీ పెరగనుంది. నేషనల్ హైవేలు, రైలు మార్గాలు కూడా అందుబాటులోకి రాబోతున్నాయి. భవిష్యత్తులో ఐటీ కంపెనీలు, విద్యా సంస్థలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు కూడా వస్తాయి అంటున్నారు. ఆయా సంస్థల్లో ఉపాధి పొందే చిరుద్యోగులు ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు.. ఇలా పలు అంశాలను పరిశీలించి రాష్ట్ర స్థాయి ఆసుపత్రిని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



## సంపాదకీయం


### అన్ని విధాలా రాష్ట్రానికి నష్టం

సౌర విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన సామాగ్రిని ఉత్పత్తి చేసే సామర్థ్యమున్న కంపెనీలు టెండరు ప్రక్రియలో పాల్గొంటే, అలాంటి సామర్థ్యం లేని కంపెనీలు పేర్కొన్న ధరల కన్నా తక్కువ ధరలను పేర్కొనాలి. అదేవిధంగా, వేలాది మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరాకు టెండరులో పాల్గొనే కంపెనీలు అంత భారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకొల్పే అవకాశంతో (ఎకానమీ ఆఫ్ స్కేల్) తక్కువ ధరలను పేర్కొనాలి. అదానీ ఎనర్జీ విషయంలో అలా జరగలేదు. ఆనాడు పోటీ బిడ్డింగులలో అలాంటి సదుపాయంలేని కంపెనీలు తక్కువ సామర్థ్యానికే అదాని రేట్లకన్నా చాలా తక్కువగా రేట్లను పేర్కొనటం వల్ల కొన్ని విషయాలు స్పష్టం అవుతున్నాయి. అదాని చివరకు అంగీకరించిన యూనిట్‌కు రూ. 2.42 రేటు చాలా అధికం. సౌర విద్యుత్ ఫలకాలు, తదితర సామాగ్రిని ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న కంపెనీలు మాత్రమే బిడ్డింగులో పాల్గొనటానికి అర్హులని మోడి ప్రభుత్వం సెకీ బిడ్డింగ్ షరతులలో చేర్పించటం, నిజమైన పోటీ లేకుండా అదాని కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చటానికే. అలాంటి ఉత్పత్తి సామర్థ్యం ఉందా లేదా అనే దానితో నిమిత్తం లేకుండా, ఎవరు అతి తక్కువ రేటును బిడ్డింగులో పేర్కొంటే, ఆ కంపెనీనే ఎంపిక చేసి, సాపేక్షికంగా తక్కువ ధరలకే సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసే అవకాశం ఈ షరతుల తొత్తడంతో లేకుండా పోయింది. అజూర్ కంపెనీ 4000 మె.వా. విద్యుత్ విక్రయాలతో సుమారు 20 ఏళ్ళలో పన్ను చెల్లింపు తరువాత 2 బిలియన్ డాలర్ల గణనీయమైన లాభాలు లభిస్తాయని అంచనా వేసిందని అమెరికా కోర్టులో గౌతమ్ అదానికి, ఇతరులకు వ్యతిరేకంగా దాఖలైన అభిశంసన అభియోగ పత్రంలో (పేరా 45) పేర్కొన్నారు. సాధారణంగా, సౌర విద్యుత్ ప్రాజెక్టులకు ఈక్విటీపై 16 శాతం లాభం లెక్కగట్టేవారు. ఉత్పత్తిదారులకు లాభం ఎంత గణనీయంగా ఎక్కువగా ఉంటే, సౌర విద్యుత్ కొనుగోలుదారులకు చార్జీల భారం అంత అధికంగా ఉంటుంది. అదాని-సెకితో ఎపిడి స్కాముల ఒప్పందంలో జరిగింది ఇదే. టెండర్లు వేశాక 2019 డిసెంబరు 10న సెకి అదాని గ్రీన్‌కు, అజూర్‌కు లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్ఒఎ) ఇచ్చింది. టెండరులోని రిక్వెస్ట్ ఫర్ సెలెక్షన్ (ఆర్ఎఫ్ఎస్) నిబంధనల ప్రకారం ఎల్ఒఎ జారీ చేసిన 90 రోజులలోగా సెకి ఎంపికైన కంపెనీలతో పిపిఎలు చేసుకోవాలి. అయితే పిపిఎలు చేసుకొనేందుకు 18 నెలలకు పైగా ఆలస్యమైంది. ఎందుకంటే, వివిధ రాష్ట్రాల డిస్కాంలకు సెకి అదాని, అజూర్‌ల నుండి కొనుగోలు చేయడానికి అంగీకరించిన రేట్లకు పిఎస్ఎలు చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలను ఆ రేట్లు అధికంగా ఉన్నాయని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, డిస్కాములు అంగీకరించలేదు. ఆ తరువాత అదాని, అజూర్ కంపెనీలు వాటి అధికారుల ద్వారా 'భారీ ముడుపుల పథకం' నడిపాక, పిపిఎలు చేసుకొనేందుకు మార్గం సుగమమైంది. మె.వా.కు రూ. 25 లక్షల చొప్పున ముడుపులను లెక్కగట్టారని, ఆంధ్రప్రదేశ్ అధికారులకు రూ. 1750 కోట్ల మేరకు లంచాలు ఇస్తామని హామీ ఇచ్చారని లేదా చెల్లించారని, ఆ అధికారులలో ముఖ్యమంత్రి ఉన్నారని 2021 ఆగస్టులో అదాని గ్రీన్ రికార్డులలో ఎఫ్‌బిఐ దర్యాప్తు అధికారులు కనుగొన్నారని అమెరికా కోర్టులో సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) దాఖలు చేసిన అభియోగ పత్రంలో పేర్కొన్నారు. గౌతం అదాని, సాగర్ అదాని ముఖ్యమంత్రిని 2021 ఆగస్టులో, సెప్టెంబరులో వేర్వేరుగా కలిశారని, ప్రోత్సాహకాలతో సెకితో డిస్కాంలు పిఎస్ఎ చేసుకొనకపోవటాన్ని చర్చించారని అభియోగ పత్రంలో పేర్కొన్నారు (పేరాలు 29, 33, 34, 51, 53, 54). ఆ తరువాత రాష్ట్ర మంత్రి వర్గం సెకితో 7000 మె.వా. పిఎస్ఎ చేసుకునేందుకు ఆమోదం తెలిపింది. అధిక ధరలకు ఆ సౌర విద్యుత్ కొనుగోలుకు సెకీతో ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ప్రోత్సాహకాలు పని చేశాయని అభియోగ పత్రంలో వ్యాఖ్యానించారు. అదాని సౌర విద్యుత్‌ను రాష్ట్రంలో వ్యవసాయ అవసరాలకు సరఫరా చేయడానికే కొనుగోలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతమున్న మూడు డిస్కాములు లేదా కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామీణ వ్యవసాయ విద్యుత్ పంపిణీ కంపెనీ, ఈ విద్యుత్‌ను రాష్ట్ర మంతటా సరఫరా చేయాలి. ఆయా ప్రాంతాలలో వ్యవసాయ విద్యుత్ డిమాండు ఆధారంగా అవసరమైన ఉత్పత్తి సామర్థ్యంతో స్థానికంగా సౌర విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పితే అనేక ప్రయోజనాలుంటాయి. వాటి నుండి చుట్టుపక్కల స్థానిక ప్రాంతాలకు విద్యుత్ ప్రసారం, పంపిణీలకు పెట్టుబడుల అవసరాలు, చార్జీలు, ప్రసార, పంపిణీ నష్టాలు తక్కువగా ఉంటాయి. ఇలాంటి ఏర్పాటు అవసరమైన ఓల్టేజి నిర్వహణకు దోహదం చేస్తుంది. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. రాజస్థాన్‌లోని అదాని ప్రాజెక్టుల నుండి సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసే ఏర్పాటుతో రాష్ట్రం, వినియోగదారులు ఈ ప్రయోజనాలను కోల్పోయారు. అంతకు ముందు, రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ద్వారా 6000 మె.వా సౌర విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలిచింది ఇలాంటి ఏర్పాట్ల అవకాశాలతోనే. టెండర్ల షరతుల మార్పుపై వివాదాలతో, హైకోర్టు తీర్పుతో, తరువాత సెకీతో ఏర్పాటుతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చివరకు ఆ టెండర్లను రద్దు చేసుకుంది. కేంద్ర విద్యుత్ ప్రసార సంస్థ పిజిసిఐఎల్ రాజస్థాన్ నుండి అదాని విద్యుత్‌ను రాష్ట్ర సరిహద్దు వరకు ప్రసారం చేస్తుంది. అక్కడి నుండి ఆ విద్యుత్‌ను వ్యవసాయం నిమిత్తం రాష్ట్రమంతటా సరఫరా చేయాల్సినందున ప్రసార,

పంపిణీ నష్టాలు ఎక్కువ అవుతాయి. రాజస్థాన్ నుండి సౌర విద్యుత్ పొందటం వల్ల రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు భూమి కేటాయించాల్సిన అవసరం ఉండదని, దానిని ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చునని ఆనాడు అదాని-సెకితో ఒప్పందం వ్యవహారంలో ఉన్న అధికారులు వాదించారు. ప్రతి రాష్ట్రం అదే వైఖరి తీసుకుంటే, విద్యుత్ ప్రాజెక్టులు, ఆ మాటకు వస్తే ఇతర ప్రాజెక్టులు, పరిశ్రమల వంటి వాటి స్థాపనకు, ఉపాధి కల్పనకు, అభివృద్ధికి అవకాశాలు వుండవనేది స్పష్టం. ఇతర రాష్ట్రాల నుండి దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుందనేది స్పష్టం.

# చరిత్ర పొరల్లో దాగిన త్యాగధనుడు ఖుదీరాం

భారత స్వాతంత్ర్య పోరాటం ఒకనాటిది, ఒక ఏటిది, ఒక దశాబ్దపుది, శతాబ్దపుది కాదు. అంతకన్నా ఎక్కువ సమయం కొనసాగిన నేపథ్యం ఉంది. అనేక సాయుధ పోరాటాలు, అహింసా యుత పద్ధతిలో జరిగిన ఉద్య మాలు భారత స్వాతంత్ర్యో ద్యమంలో భాగాలు.స్వాతంత్ర్య సమర యోధులు ఉద్యమాలు అనగానే 1857 విప్లవం మరిచిపోని మంగల్ పాండే, తాత్యా తోపే, బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన నిర్భయమైన రాణి లక్ష్మీబాయి, కిట్టూరుకు చెందిన రాణి చెన్నమ్మ, రాణి గైడిన్లు, చంద్ర శేఖర్ ఆజాద్, రామ్ ప్రసాద్ బిస్మిల్, భగత్ సింగ్, సుఖ్దేవ్, రాజ్‌గురు, గురు రామ్ సింగ్, పాల్ రామసామి, రాజేంద్ర ప్రసాద్, పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, బాబా సాహెబ్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, మౌలానా ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్, వీర్ సావర్కర్ వంటి లెక్కలేనన్ని మంది నాయకులు, గొప్ప వ్యక్తిత్వా లన్నీ స్వాతంత్ర్య ఉద్యమానికి మార్గ దర్శకులు. అలా దేశమాత దాస్య విముక్తి గావించడం కోసం ఎందరో వీరాధివీరులు, మహ నీయులు తమ ప్రాణాలొడ్డి జీవితాలను అర్పించారు. అందులో చక్రవర్తులు, సాయుధ వీరులు, యువకులు... ఎందరో దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలనే త్యాగం చేశారు.భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో రక్తం మరిగే అంశాలు, రోమాలు నిక్క పొడుచు కునే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. స్వేచ్ఛా భారతా వని కోసం అశువులు బాసిన ఎంతో మంది త్యాగధనుల చరిత్ర ఇప్పటి తరాల యువతకు ఎంతో ఉద్వేగ భరితంగా, మరెంతో ఉద్విగ్నంగా పరిణ మిస్తుంటుంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పోరాట పటిమను, తెగువను, త్యాగాన్ని చూపించారు. ఎందరో తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారు. ఈ అసంఖ్యాక స్వాతంత్ర్యోద్యమాల కాలంలో ఎందరో అమరవీరులు ఉన్నారు. ఇందులో చరిత్ర చాలామందిని గ్రంథస్థం చేయలేక పోయింది. చేసినా కొందరిని చరిత్ర మరుగున పడేసింది. అలా చరిత్ర పొరల మాటున ఉన్న వారిలో యువ కిషోరం ఖుదీరాం ముఖ్యుడు. 18ఏళ్ల నూనూగు మీసాల యువ ఖుదీరాం బోస్ దేశం గర్వించదగ్గ త్యాగాన్ని మరిచినా, యాధృచ్ఛి కంగా విస్మరించినా, దేశ స్వాతంత్ర్య చరిత్ర పరిపూర్ణం కానట్టే. ఖుదీరాం బోస్ భారతీయ స్వాతంత్ర్య సమర వీరులలో మొదటి తరానికి చెందిన అతిపిన్న వయస్కుడు. భారత దేశ వాసులను వేధించిన బ్రిటిష్ అధికారిపై బాంబు వేసిన మొదటి సాహస వీరుడు ఖుదీరాం. ఆ కారణంగా అతనిని ఉరితీసే నాటికి అతని వయసు కేవలం 18 సంవత్సరాల 7 నెలల 11 రోజులు మాత్రమే. ఖుదీరాం పశ్చిమ బెంగాల్, మిద్నాపూర్ జిల్లా హబీబ్‌పూర్‌లో 1889 డిసెంబర్ 3న జన్మించాడు. చిన్ననాటి నుంచి స్వాతంత్ర్య కాంక్షతో రగిలి పోయేవాడు. మొదట్లో అథ్రా అనే విప్లవ సంస్థలో చేరాడు. తన నాయకత్వ లక్ష ణాలు, సాహసో పేతమైన స్ఫూర్తితో ఆ సంస్థలో అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఆయన టీచర్ సత్యేంవూదనాథ్ బోస్, భగవద్గీతలను స్ఫూర్తిగా తీసుకు న్నాడు. 1905లో బెంగాల్ విభజన అతడిలో బ్రిటిష్ ప్రభుత్వంపై మరింత కసి రేపింది. 16 ఏళ్ల వయసులోనే ప్రభుత్వ కార్యాల యాలు, పోలీస్ స్టేషన్‌లను బాంబులతో పేల్చి వేశాడు. 1907 ఆగస్టు 26న ఒక కేసు విచారణ సందర్భంగా ఎంతోమంది యువకులు కోర్టు ముందర ఆసక్తిగా గుమికూడి ఉన్నారు. పరిస్థితి శాంతి యుతంగా ఉన్నప్పటికీ ఉన్నట్లుండి పోలీసులు లాఠీలను ప్రయోగించారు. ఈ వ్యవహారాన్ని అక్కడే ఉండి చూస్తున్న సుశీల్ కుమార్ సేన్ అనే 15 ఏళ్ళ యువకుడు భరించలేక ఆవేశంతో ఒక ఇంగ్లీష్ అధికారి ముక్కుమీద ఒక్కగుద్దు గుద్దాడు. వెంటనే పోలీసులు ఆ యువకుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకెళ్లారు. ఈ కేసు విచారణ చేసిన జడ్జి కింగ్స్ ఫోర్డ్ అనే అధికారి చిన్నవాడన్న దయ లేకుండా సుశీల్ కుమార్ కు15 కొరడా దెబ్బలను శిక్ష విధించాడు. సాహస వంతుడైన ఆ యువకుడు ప్రతి కొరడా దెబ్బకు వందేమాతరం అని నినదించాడు.ఆ సంఘటన తరువాత స్వతంత్ర వీరులంతా కింగ్స్ ఫోర్డ్ కు గుణపాఠం చెప్పాలని నిర్ణయించు కున్నారు. మానవ రూపంలో ఉన్న మృగమైన ఫోర్డ్ లాంటి వారు ఉన్నంత వరకు దేశభక్త వీరులకు కష్టాలేనని భావించి అతనిని చంపడానికి నిశ్చయించు కున్నారు. 1908 ఏప్రిల్ మొదటి వారంలో జుగాంతర్ అనే విప్లవ సంస్థకి చెందిన విప్లవ వీరులు కొందరు కలకత్తాలో ఒక ఇంటిలో రహస్యంగా సమావేశమై కింగ్స్ ఫోర్ట్ ను అంతం చెయ్యడానికి ఒక ప్రణాళిక రూపొందించి, అమలు చేయ సంకల్పించారు. ఆ సమావేశంలో అరవింద ఘోష్ కూడా ఉన్నారు. ఖుదీరాం బోసునూ, ప్రఫుల్ల చాకి అనే మరో నవ యువకుడినీ ఈ పనికై నియమించారు. 1908 ఏప్రిల్ 30 రాత్రివేళ వీరిద్దరూ ముజఫర్ పూర్ లోని యురోపియన్ క్లబ్ కు ఒక బాంబు, రివాల్వర్ తీసుకొని వెళ్లారు. కింగ్స్ ఫోర్డ్ వాహనం క్లబ్ బయటకు రాగానే దానిపైకి బాంబును విసిరేసి ఇద్దరు పరిగెత్తి వెళ్లి పోయారు.అయితే ఖుదీరాం, ప్రఫుల్లచాకిలు గమనించని విషయం... ఆ వాహనంలో కింగ్స్ ఫోర్డ్ లేక పోవడం.. అతని భార్య, కుమార్తెలు మాత్రమే ఉండడం. వారు బలి కావడం. ఒక రైల్వే స్టేషన్‌లో టీ తాగుతుండగా ఖుదీరాం బోస్‌ను పోలీసులు పట్టుకో గలిగారు. ఖుదీరాంను నిర్బంధించి రెండు నెలల పాటు విచారణ చేశారు. ముజఫర్ పూర్ బాంబు కేసులో ఫోర్డ్ భార్య, కుమార్తెల మరణానికి కారకుడైన ఖుదీరాంకు మరణశిక్ష విధించారు.




1908 ఆగష్టు 11న ఈ శిక్ష అమలు పరచ బడింది. పెదవులపై చిరునవ్వు చెదరకుండా ఖుదీరాం మృత్యువును ఆహ్వా నించాడు. దేశం కోసం బలిదానం చేశాడు. బోస్ పట్టుబడిన రైల్వే స్టేషన్‌కు ఖుదీరాం బోస్ పూసా అని ఈ మధ్యే పేరు పెట్టారు.మాతృ భూమికోసం త్యాగం చెయ్యటం అందరికీ దొరికే అదృష్టం కాదు... అది నాకు లభించింది. అందుకు నేనెంతో గర్వ పడుతు న్నాను. అయితే నేను అనుకున్నది సాధించలేదు. క్రూరుడైన కింగ్స్ ఫోర్డ్ ను శిక్షించలేక పోయాను. అదే నా బాధ... అంటూ 1908 ఆగష్టు 19 ఉదయం ఒక చేతిలో భగవ ద్గీత పట్టుకుని, ఉరికంబం దగ్గరికి వెళుతూ, ఉరితాడు బిగించమని, తలారి ఉరితాడు బిగిస్తుండగా 'వందేమాతరం' అని తుదిశ్వాస విడిచి అమరుడైన దేశ భక్తుడు ఖుదీరాం.

75ఏళ్ళ స్వతంత్ర భారతం

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న వేళ...అలనాటి వీరుల, త్యాగధనుల జీవిత చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. త్యాగ మూర్తుల జీవిత కథలు, వారి జీవన పోరాటాలు, నేటి, రాబోయే తరాలకు జీవిత పాఠం నేర్ప గలగాలి. ఆ ప్రయత్నం ప్రతి దేశవాసీ చేయాలి. వారి త్యాగ పరంపరలను తర్వాతి తరానికి బోధిస్తేనే చైతన్యం కలిగి, వారిని నిరంతరం ఉత్తేజ పరచ డానికి గత చరిత్ర సాక్ష్యంగా నిలవాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల...

# దివ్యాంగుల్లో దైవత్వాన్ని దర్శించలేమా !



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

ఒక వ్యక్తి దీర్ఘ-కాలం పాటు శారీరక, మానసిక, మేధో లేదా స్పర్శ బలహీనతలు కలిగి సమాజంలో తమ సామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకోవడంలో విఫలం కావడాన్ని "దివ్యాంగులు, అంగవైకల్యం కల వారు లేదా వికలాంగులు" వర్గంగా చూస్తారు. ప్రపంచవ్యాప్తంగా 16 శాతం జనాభా వికలాంగులుగా జీవితాలను భారంగా గడుపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 80 శాతం దివ్యాంగులు అభివృద్ధి చెందిన దేశాల్లోనే ఉన్నారని, వీరిలో 46 శాతం వయోవృద్ధులు ఉన్నట్లు తెలుస్తున్నది. ప్రతి ఐదుగురితో ఒక్క మహిళ, ప్రతి 10 మందిలో ఒక పిల్లాడు అంగవైకల్య వలయంలో చిక్కుకుంటున్నారు. దివ్యాంగుల్లో సగం మందికి వైద్య సదుపాయాలు అందడం లేదని, 70 శాతం మందికి వీల్‌చైర్ అవసరం ఉందని, 90 శాతం మందికి వినికిడి పరికరాలు అందవలసి ఉందని తేలింది. పౌర సమాజంలో దివ్యాంగులు నిరాదరణ, వివక్ష, చిన్న చూపు, చీదరింపు, అగౌరవం లాంటివని ఎదుర్కొంటున్నారు. వీరికి అందవలసిన గుర్తింపు, గౌరవం, మానవ హక్కులు, ఉద్యోగ ఉపాధులు , నాయకత్వ అవకాశాలు అందడం లేదు. సమ్మిళిత సుస్థిర భవితకు దివ్యాంగులకు నాయకత్వ బాధ్యతలు: దివ్యాంగుల సమస్యలను అధ్యయనం చేసిన ఐరాస-డబ్ల్యూహెచ్ఓ ప్రతి ఏట 03 డిసెంబర్‌న ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం" జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. అంతర్జాత దినం - 2024 థీమ్‌గా "సమ్మిళిత సుస్థిర భవితకు దివ్యాంగులకు నాయకత్వ బాధ్యతలు అప్పగిద్దాం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. సామాన్య జనానికి సమానంగా దివ్యాంగులకు వైద్య ఆరోగ్య సంరక్షణ చర్యలు వేగం పుంజుకోవాలని, ఈ దిశగా ఐరాస పలు సూచనలు,

సలహా సహాయాలను అందించడానికి ముందుకు రావడం హర్షదాయకం. వికలాంగులను గౌరవించడం, విద్య అందించడం, సాధికారతను శక్తివంతం చేయడం, మానవ హక్కులను పరిరక్షించడం, దివ్యాంగ విజేతలను సన్మానించడం లాంటివి ఈ వేదికపై చర్చించడం కొనసాగుతున్నది. ప్రపంచ దివ్యాంగుల్లో 56 శాతం మహిళలు, 44 శాతం పురుషులు ఉన్నారు. దివ్యాంగుల్లో 69 శాతం వరకు గ్రామీణ జనాభా మాత్రమే ఉండడం గమనించారు. దివ్యాంగుల్లో విజేతలు :

భారత్‌లో దాదాపు 8 శాతం జనాభా వికాంగులుగా నమోదు అయ్యారు. దివ్యాంగుల్లో 21 రకాల వైకల్యాలు కనిపిస్తాయి. వీటిలో ముఖ్యమైనవిగా దృష్టి దోషం (అంధత్వం, మంద దృష్టి), వినికిడి లోపం (చెవుడు, వినికిడి మందగించడం), మాట్లాడలేక పోవడం (మూగతనం, మాటల్లో స్పష్టత కొరవడడం), నడక లోపం(లెప్రసీ చికిత్స పొందిన వారు, సెరిబ్రల్ పాల్సీ, మరగుజ్జు లోపం, కండరాల లోపం, ఆసిడ్ దాడి బాధితులు), మానసిక వైకల్యం, బహు అంగవైకల్యం, రక్త రుగ్మతలు(హిమోఫిలియా, తలసేమియా, సికిల్ సెల్ రుగ్మత), నరాల బలహీనత (మల్టిపుల్ స్లిరోసిస్, పార్కిన్‌సన్ వ్యాధి), ఇతర వైకల్యాలు వస్తాయి. దివ్యాంగుల్లో 20 శాతం నడక లోపం, 18.9 శాతం వినికిడి లోపం, 18.8 శాతం దృష్టి దోషం, 5.6 శాతం మానసిక వైకల్యం కలిగిన వారు ఉన్నారు. వైకల్యాన్ని జయించి విజేతలుగా నిలిచిన భారతీయ ప్రముఖుల్లో శాస్త్రీయ నాట్యకారిణి సుధా చంద్రన్ (నడక లోపం), సంగీత దర్శకుడు రవీంద్ర జైన్ (దృష్టి దోషం), టీవీ నిర్వాహకులు రామకృష్ణన్ (నడక లోపం), బ్యాడ్మింటన్ ఆటగాడు గిరీష్ శర్మ (నడక లోపం), క్రికెటర్ ప్రీతి శ్రీనివాసన్ (నడక లోపం), డాక్టర్ సత్యేంద్ర జైన్ (నడక లోపం), టెన్నిస్ క్రీడాకారుడు ప్రభు (నడక లోపం), స్కైడైవర్ విశ్వనాథన్ (నడక లోపం) పర్వతారోహకురాలు అరుణ సిన్హా (నడక లోపం)లాంటి పెద్దలు ఉన్నారు. వికలాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయాలు, ఉత్తమ జీవనశైలి అందించడం, అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వడం, ఉచిత విద్య, సామాజిక భద్రత, డిజిటల్ వనరుల అందుబాటు, సమాచార కల్పన, ఉచిత వైద్యం, దివ్యాంగుల హక్కుల సంరక్షణ,

ఉచిత న్యాయ సేవలు, ఉద్యోగాల్లో తగిన రిజర్వేషన్లు లాంటి చేయూతను ఇవ్వడం ప్రభుత్వ పౌర సమాజ సనీస బాధ్యత అని తెలుసు కోవాలి. దివ్యాంగుల్లో ఆనందాల వెలుగులు చూడాలి. వికలాంగుల సేవలు దేశాభివృద్ధికి తోడ్పడాలి. దివ్యాంగుల్లో దైవత్వాన్ని దర్శించాలి. మేం ఉన్నామనే భరోసాను ఇవ్వాలి. వికలాంగుల ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేయాలి. వారి వారి సామర్థ్యాలను బట్టి తగు అవకాశాలను కల్పించాలి. దివ్యాంగుల ముఖాలపై నవ్వుల పువ్వులు వికసించా విధం మానవ సమాజం స్పందంచాలి.


# పాఠ్యపుస్తకాల్లో తప్పులుంటే?

విద్యలో పాఠ్యప్రణాళిక (సిలబస్)ది, పాఠ్యపుస్తకాలది, మూల్యాంకనంది ప్రధానపాత్రలు. ఇవే విద్యకు ఆయువుపట్టు. మొదటిది పాఠ్యప్రణాళిక. విజ్ఞానము అపారము. అనంతము. విద్యార్థి ఈ అనంత విజ్ఞానాన్ని ఒక్కసారే ఒక మాత్రని మింగినట్టు సముపార్జించుట అసాధ్యము. ఒకొక్క దశలో/తరగతిలో ఈ అనంత విజ్ఞానము యొక్క ఒకొక్క భాగము నేర్చుకుని ముందుకు పోతాడు. తరువాతి తరగతిలో ఇంతకు ముందు నేర్చుకున్న విషయ పరిజ్ఞానం ఆధారంగా మరి కొంత భాగం నేర్చుకుని జ్ఞానసముపార్జనలో మరో ముందడుగు వేస్తాడు. పాఠ్యప్రణాళిక విద్యార్థి ఏ తరగతిలో ఏం నేర్చుకుంటాడు, ఎంత భాగం నేర్చుకుంటాడు అన్నది నిర్ణయిస్తుంది. వివిధ తరగతుల పాఠ్యప్రణాళికలు గొలుసుకట్టులా ఒకదానికొకటి అనుసంధానంగా ఉంటూ, విద్యార్థిని ఒక ప్రయోజకపౌరునిగా మానవజాతి ప్రస్థానంలో, ఒక ముఖ్య మైలురాయి స్థాపనలో, సాధనలో, అభివృద్ధి నిర్మాణంలో ఒక ముఖ్య పాత్రధారిగా తీర్చిదిద్దేటట్టు ఉండాలి. చాలా మంది జనులు మన పాఠ్యప్రణాళిక సమయం చెల్లిపోయినదిగా భావిస్తారు. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా, పాఠ్యప్రణాళిక ఉండటంలేదని, దాని వలనమన విద్యార్థులు సరైన ఉద్యోగ అవకాశాలు అంది పుచ్చుకోలేక పోతున్నారని గొంతు కలుపుతారు. కానీ అసలు కారణాలు వేరు. ప్రపంచంలో సాంకేతికత నిరంతరం పరివర్తనం చెందుతున్నది. సాఫ్ట్వేర్ మాత్రమే కాదు, హార్డ్వేర్ కూడా మార్పులు చెందుతున్నవి. కేవలం 2-3 దశాబ్దాల క్రితం వరకు బాగా ఉపయోగించబడిన ఫ్లాపీ డిస్క్ ఇప్పటి తరంలో చాలా మందికి తెలియదు. అంతగా నిరుపయోగం అయిపోయింది. వాటి స్థానాల్ని ఆక్రమించిన పెన్ డ్రైవులకు కూడా నూకలు చెల్లిపోతున్నాయి. క్రమంగా కనుమరుగవుతున్నాయి. పెన్ డ్రైవుల యు ఎస్ బీ పోర్టులు లేని లాప్టాప్లు సాధారణం అవుతున్నాయి. పరివర్తనం అన్నది ఒక్కటే నిరంతరం జరిగేది ఉండేది.నేను 1985లో డీ.ఆర్.డీ.ఓ. లో శాస్త్రవేత్తగా పని చేస్తున్నప్పుడు ఫోర్ట్రాన్ కంప్యూటర్ భాషను వాడాను. నేను, బి. ఇ, ఎం.ఇ. చేస్తున్నప్పుడు, చేసినప్పుడు నాకు కంప్యూటర్ ఎలా ఉంటుందో కూడా తెలియదు. పుస్తకాలలో చదవడం, బొమ్మలు చూడటం తప్ప. అయినా సరే, ఆ భాషలో చక్కగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ చేయగలిగాను. తరువాత అనేక ఇతర భాషలు నేర్చుకుని నా కార్యక్రమాలను విజయవంతంగా చేయడంలో కృతకృత్యుడనయ్యాను . వేగంగా మారుతున్న ఉద్యోగ ఆవశ్యకతలను విద్య పూరించాలనుకోవడం సరి కాదు. పాఠ్యప్రణాళిక ఆవశ్యకతల అనుగుణంగా మారిపోవాలనుకోవడం సమంజసం కాదు కూడా. అది అసాధ్యం. విద్య యొక్క ముఖ్య లక్ష్యం ఈ పరిస్థితిలో- వంట వస్తువులు తెచ్చి, వంట వార్చి, పళ్ళెంలో పెట్టి నోటికి అందివ్వడం కాదు. ఎలా ఆలోచించాలో, ఎలా పని చేయాలో, ఎలా తమ కాళ్లపై నిలబడి స్వశక్తితో బతకాలో నేర్పాలి. కొంత మంది మిడిమిడి జ్ఞానంతో

ఎక్కాల పట్టిక గుర్తు పెట్టుకోవడం అవసరమా, పైథాగరస్ సిద్ధాంతం అవసరం ఏమిటి అని వాదిస్తుంటారు. వాస్తవానికి, వారి బలహీనతలను అది కప్పిపుచ్చుకునే ప్రయత్నమే.ఇక రెండవది పాఠ్యపుస్తకం. చాలా ముఖ్య పాత్ర వహిస్తుంది. దాని ఉపయోగం అతి చేసి చెప్పడం అసాధ్యం.

ప్రతి శిశువుకు పుట్టుకతో జిజ్ఞాస ఉంటుంది. జిజ్ఞాస అంటే కొత్త విషయాలు తెలుసుకోవాలన్న కుతూహలం, కోరిక. ఆ జిజ్ఞాస ఉన్నంత వరకు చదువు ఇష్టంగా ఉంటుంది ఎందుకంటే చదువు బాహ్య ప్రపంచానికి గవాక్షం. ఆ గవాక్షం లోనుంచి తొంగి చూడాలని ఎవరికి కోరిక ఉండదు?విద్య చేయాల్సిన ఏకైక పని ఆ జిజ్ఞాసను సంరక్షించడం మరియు ఎగదొయ్యడం. పోటీ ప్రపంచంలో విజయకాంక్షను పెంచడం. ఇది నా స్వీయ అనుభవం. నా తల్లి పెద్దగా చదువుకోలేదు, కానీ తెలుగు చదవగలిగే పరిజ్ఞానం ఉండేది. తెలుగు అక్షరాలు గుణింతాలు నేర్పి విజయకాంక్షను రగులజేసి వదిలేసారు. అక్కడ నుంచి నేర్చుకోవడం అంతా కేవలం నా స్వయంకృషి మాత్రమే. ఉపాధ్యాయుల మీద కూడా నేను ఆధారపడలేదు. పుస్తకాల నుంచి నా అంతట నేను నేర్చుకున్నాను. పాఠశాల అధ్యాపకుల అవసరమే లేని నాకు ఇంకా ట్యూషన్లు, కోచింగ్లు ఎందుకు? నేను 1978లో పదవ తరగతిలో రాష్ట్ర స్థాయి స్థానం సంపాదించుకుని జాతీయ ప్రతిభా ఉపకారవేతనం అందుకున్నాను.

విద్యారంగంలో కూడా చీడ చేరుకుంది . పుస్తకాలలో తప్పులు ఉంటున్నాయి. సవరణ అవకాశం ఉన్నా, వేలెత్తి చూపి సరిదిద్దుకోమని సలహా ఇచ్చినా ఆ దిశలో ముందడుగు పడటం లేదు. కొన్ని పాఠ్య పుస్తకాలలో అయితే నిండా తప్పులే. తప్పులు దొర్లుతుంటాయి పూర్తిగా నివారించడం కష్టం. అయితే ప్రచురణకు ముందు దీక్షగా కేవలం తప్పులు వెదికి పట్టుకోవడానికి నిపుణులతో ఒక బృందం ఏర్పరచి తప్పులు తగ్గిస్తారు. దీనినే ప్రూఫ్ రీడింగ్ అంటారు. ఈ ప్రక్రియ నుంచి తప్పులు తప్పించుకుని ముద్రించిన పుస్తకాలలో చొరబడితే, వాటిని తెలియజేయమని విద్యార్థులను , ఉపాధ్యాయులను, పాఠకులను పుస్తక ముందు మాట ద్వారా వినమ్రంగా కోరుతారు. ఇప్పుడు ప్రచురణ కర్తలు, రచయితలు సవరణ జోలికి పోవటం లేదు. పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతర్జాలంలో లభించే వీడియోలలో తప్పులు ఉంటున్నాయి సంవత్సరాల తరబడి. పరీక్షాపత్రాలలో (పాఠశాల నుంచి ప్రవేశ మరియు ఉద్యోగ పోటీ పరీక్షలు వరకు) తప్పులు ఉంటున్నాయి. ఉపాధ్యాయులలో అసమర్థతలు ఉంటున్నాయి. బాలల్లో సరైన విషయ అవగాహనకు మూలాధారమైన ప్రశ్నించే గుణం, నిరుత్సాహపరచబడి అణచివేతకు గురి అవుతున్నది. పర్యవసానంగా వారిలో ఉండే సహజసిద్ధమైన కొత్త విషయాలు తెలుసుకుందాం, నేర్చుకుందాం అన్న ఆసక్తి, శ్రద్ధ లోపిస్తున్నాయి. ఈ మధ్య ఒక పదవ తరగతి విద్యార్థిని ఒక గణిత సమస్య నా వద్దకు తెచ్చింది. అది ఆమె పాఠ్యపుస్తకం లోనిది. ప్రశ్న అసంపూర్ణము, ఆ విధముగా లోపముతో నున్నది. తప్పు ప్రశ్న. ఆ పుస్తకం ప్రచురించిన వారికి దాని గురించి చెప్పి తదుపరి ప్రచురణలో ఆ తప్పుని సరిదిద్దుదామని వాళ్ళని సంప్రదిద్దామని చాలా ప్రయత్నాలు చేసాను. ఆ పుస్తకం వ్రాయడంలో/ (వ్రాయించడంలో) పాలు పంచుకున్న పెద్దల పేర్లు, వారు పని చేసే సంస్థల వివరాలు ఇచ్చారు పుస్తకం ముందు భాగంలో. కానీ వారిని సంప్రదించగలిగే వివరాలు అంటే దూరవాణి సంఖ్యలు, లేదా చిరునామాలు, ఈమెయిలు వివరాలు ఇవ్వలేదు. కొన్ని ప్రయత్నాల తరువాత ఒకరి సంస్థను దూరవాణి ద్వారా చేరుకున్నాను. అయన మాట్లాడే పరిస్థితి లేదు అని సమాధానం. సరే మిగతా వారి వివరాలు, అందుకు సంబంధించిన వారి వివరాలు అడిగాను. అవి తమకు తెలియదని సమాధానం. ఆ పుస్తకం ఎన్నో ప్రచురణలు నోచుకున్నది. ఆలా తప్పుతోనే కొనసాగుతున్నట్టున్నది.



సీతా రామ రాజు సనపల

# తక్షణమే పేస్కేల్ అమలు చేయాలి

## ఎస్ ఎస్ ఎ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇప్పి వెంకటేశం



అందోల్ , మెదక్ జిల్లా డిసెంబర్02(వుదయం ప్రతినిధి): అల్లాదుర్గం లో మండల వనరుల కార్యాలయం ఎదుట దీక్ష ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనిఎస్ ఎస్ ఎ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇప్పి వెంకటేశం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులకు క్రమబద్ధీకరణ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది కానీ నేటి వరకు మాకు పట్టించుకోవడం లేదంటూ ఇప్పటికైనా స్పందించి తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రీ ఎగేజ్ విధానం తొలగించాలి. తమకు 12 నెలల వేతనం ఇవ్వాలంటూ అలాగే జీవిత బీమా ఆరోగ్య భీమా 10 లక్షల రూపాయలు వరకు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ ఎ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇప్పి వెంకటేశం. జనరల్ సెక్రెటరీ బి బాలరాజ్ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య జిల్లా మెసెంజర్ బసన్న గారి రమేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి టి ఐ శంషాద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# కోటేశ్వర్రావు కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి తుమ్మల



దమ్మపేట (వుదయం ప్రతినిధి):ఖమ్మం నగరం రాపర్తి నగర్ కు చెందిన నూకవరపు కోటేశ్వరరావు వాణి దంపతుల కుమారుడు నూకవరపు సాయితేజ శుక్రవారం సాయంత్రం అమెరికా లోని చికాగో నగరంలో దుండగుల కాల్పుల్లో హత్యకు గురయ్యాడు..విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత జౌళి శాఖా మంత్రి వర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఈరోజు ఉదయం రాపర్తి నగర్ లోని నూకవరపు కోటేశ్వరరావు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ని తెలియచేశారు...ఇలాంటి సంఘటనలు దురదృష్టకరమని ఉన్నత చదువుల కొరకు అమెరికా వెళ్లిన సాయితేజ వెళ్లిన అతి కొద్ది కాలంలోనే మరణించడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. అదేవిధంగా అమెరికా లోని తానా ప్రతినిధులతో ఫోన్లో మాట్లాడి వీలైనంత తొందరగా పార్ధీవ దేహం ఇండియా కు వచ్చేవిధంగా కృషి చేయాలని తెలిపారు.

# ఘనంగా కాపు వన సమారాధన



దమ్మపేట డిసెంబర్02(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామంలో కాపు వన సమారాధన ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముందుగా కార్తీక మాసం చివరి రోజు అయిన ఆదివారం ఉసిరి చెట్టుకి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది తదనంతరం మహిళలు పిల్లలు ఆటలు పాటలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు ఈ సందర్భంగా కాపు పెద్దలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇదే విధంగా వన సమారాధన నిర్వహించుకోవాలని తద్వారా అన్ని కుటుంబాలు ఇక్కడ కలుసుకొని ఉత్సాహంగా గడపటం జరుగుతుందని వారు తెలియజేశారు నిత్యం టెన్షన్లతో గడిపే జీవితం సంవత్సరానికి ఒక్కరోజైనా ప్రశాంతంగా ఈ వన సమారాధనలో జరుపు కోవడంతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని వారన్నారు అదేవిధంగా కాపు కుటుంబాలన్నీ ఎకతాటిపై నిలిచి ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను వినియోగించుకొని కాపు కుటుంబ సభ్యులకు ఎటువంటి సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరించుకోవాల్సిందిగా వారు కోరారు ఈ కార్యక్రమంలో కాపు సోదరులు మహిళలు పిల్లలు పెద్దలు అందరూ పాల్గొనడం జరిగింది

# ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలి

## జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ,



నాగర్ కర్నూల్ డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి)అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చునని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం నాగర్ కర్నూల్ కలెక్టరేట్లో అవగాహన ర్యాలీలో ఎయిడ్స్ నియంత్రణపై ప్రతిజ్ఞ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం తో కలిపి కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొన్నారు. ఎయిడ్స్ నియంత్రణపై డిఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...... ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు భరోసా నివ్వడం ద్వారా వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపవచ్చన్నారు.ఇందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నిరోధించగలమన్నారు.ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉంటూ వ్యాధిని ఎండి కట్ట వేయాలని, ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ వెంకట దాస్, వైద్యులు, ఏఎన్ఎంలు, విద్యార్థులు డిఎంహెచ్వో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ మున్సిపాలిటీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానం



యాదాద్రి భువనగిరి /డిసెంబర్ 02 వుదయం పతినిధి :-మోత్కూర్ మున్సిపాలిటీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులుగా బింగి బిక్షపతి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మోత్కూర్ మున్సిపాలిటీ పద్మశాలి సంఘం అధ్యక్షులు కూరపాటి రాములు కార్యవర్గ సభ్యుల చేతుల మీదగా బింగి బిక్షపతి కి సన్మానం చేయడం జరిగినది ఇందులో ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షులు చిరందాసు ధనంజయ తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక సంఘం అధ్యక్షులు రాపోలు వీర మోహన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుంచు నాగభూషణం గార్ల అందరికీ మోత్కూర్ మున్సిపాలిటీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎలగందుల సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి పసునూరి యాదయ్య కోశాధికారి నోముల రమేష్ డైరెక్టర్లు, పసునూరి రమేష్ తాటి కర్ణాకరు ముషం శ్రీనివాస్ శ్రీరాముల ప్రసాదు ఏళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు...

# ప్రజా వాణి కి 53 దరఖాస్తులు,

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి ,

## జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



నాగర్ కర్నూల్ డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి) ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు చొరవచూపి దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి లో బాధితుల నుంచి 53 దరఖాస్తులు తీసుకొని దరఖాసుదారుల సమస్యలపై కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి శాఖలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.శాఖల వారిగా ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కే సీతారామారావు, దేవ సహాయం, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్ లు యూసుఫ్ అలీ, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలి సి పి ఐ ( ఎం ఎల్ )

## (మాస్ లైన్ అనుబంధ ప్రగతి శిల జాతీయ మహిళా సంఘము )



దమ్మపేట డిసెంబర్02(వుదయం ప్రతినిధి): దమ్మపేట మండలం, దమ్మపేట గ్రామంలో, సి పి ఐ ( ఎం ఎల్ )(మాస్ లైన్ )పార్టీ కార్యాలయంలో, గంగాధర. నాగమణి మాట్లాడుతు గత ప్రభుత్వంలో ప్రజలకు అన్యాయం జరిగిందని కొత్త ప్రభుత్వం వస్తే ప్రజలకు నాయ్యం జరుగుతుందని ఆశిస్తే ప్రజలకు మొండి చేయి చూపించే వైఖరి నెలకుంది. అని ఆమె అన్నారు , ప్రజల మీద ప్రేమ ఉన్నట్లా లేఖ నటిస్తూ ఒకరు ఒకరు తిట్టుకోవడం తప్ప ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని, దుయ్యబట్టారు, అశ్వరావుపేట నియోజకవర్గం శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఓట్ల అడిగేటప్పుడు ఎన్నో అబద్ధాలు వాగ్దానాలు ఇస్తూ నేను గెలిస్తే ఎక్కడైనా స్థలం లేని వారికి స్థలం ఇచ్చి ఇల్లు లేని వారికి ఇల్లు కట్టించి ఇస్తానని మొండి చేయి చూపించారు. అయ్యా ఎమ్మెల్యే గవర్నమెంట్ అంటే మీ సొంతం అనుకుంటున్నారా గవర్నమెంట్ అంటే ప్రజలని మర్చిపోయారా ప్రజలకు మీరేమైనా చేసేది ఏమైనా ఉందా దమ్మపేట పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పట్టించుకోవడం లేదు. మండల వ్యాప్తిగా డ్రైనేజీలు ఎంతో ఇబ్బందికరంగా ఉన్నాయి, అయ్యా మీరు ఈ పనులన్నీ వెంటనే ప్రారంభించాలి. మన జారే అన్నను గెలిపిస్తే మనకు మంచి చేస్తాడని గెలిపిస్తే కొన్ని గూడాలలో లైటింగ్ లేవు స్తంభాలు లేవు. మీకు మంచి చేయాలని అనిపిస్తే వెంటనే ఆ పనులన్నీ చేయించగలరు. మండల వ్యాప్తిగా సిసి రోడ్లు అరకొరకగా ఉన్నాయి. ఈ పనులన్నీ వెంటనే చేయాలని, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ అనుబంధ ప్రగతిశీల మహిళా సంఘం దమ్మపేట డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, గంగాధర నాగమణి. జింజనూరి ముక్తేశ్వరి. పవిత్ర. ఎస్కే ఆశ. ఇరుకుల్ల కుసుమాంజలి. రొక్కాల రత్నకుమారి. రుగం మాధవి. అన్నపురెడ్డి నాగదేవి. తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



లింగాల డిసెంబర్02(వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మారుమూల గ్రామాల్లో విద్య వైద్యం విద్యుత్ ఆయా శాఖలకు సంబంధించిన భవనాలు తదితర అంశాలపై తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. లింగాల మండల పరిధిలోని సూరాపూర్ గ్రామంలో అంగన్వాడి భవనానికి ఆయన శంకుస్థాపన చేయడం జరిగింది. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యపై మరింత ముందుకెళ్తూ నిరుద్యోగ సమస్యలను రాకుండా ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కిల్ ఇండియా యూనివర్సిటీలను ప్రారంభించడం జరిగిందని అన్నారు. విద్యార్థులు మరింత మెరుగైన విద్యను అభ్యసించి నైపుణ్యా దిశగా పయనం చేసేందుకు యూనివర్సిటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కళాశాలలో పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్యకరమైన సమతుల్యమైన ఆహారాన్ని అందించే దిశగా ఈ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని అన్నారు. హాస్టల్ వసతి గృహాల్లో నాణ్యమైన సరుకులను సేకరించి విద్యార్థులకు భోజనాన్ని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప భక్తులు ఇరుముడి పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని ,అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీస్ యాక్ట్.. వచ్చే నెల 1 వరకు ఆంక్షలు

జడ్చర్ల, డిసెంబర్02(వుదయం ప్రతినిధి): మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసులు ఆంక్షలు విధించారు. శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా అంతటా పోలీస్ యాక్ట్ 30ని అమలు చేస్తున్నారు. సోమవారం (డిసెంబర్ 2) నుంచి జనవరి 1 వరకు జిల్లా అంత ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. ఈ మేరకు జిల్లా ఎస్పీ డీ.జానకి తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలో ఎలాంటి బహిరంగ సమావేశాలు కానీ, ఊరేగింపులు, ధర్నాలు జరుపకూడదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు.

# నాణ్యత ప్రమాణాలు పాటించాలి

## మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి



రాయపర్తి డిసెంబర్ 2 (వుదయం ప్రతినిధి): సిసి రోడ్ల నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గణేష్ కుంట తండా గ్రామంలో ఎస్ డిఎఫ్ గ్రాంట్ నిధులతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులను తొర్రూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హమ్యా నాయక్ తో మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలి అని రవీందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు మునావత్ శ్రీను, మాజీ డైరెక్టర్ పెండ్లి మహేందర్ రెడ్డి, మండల నాయకులు రెంటాల గోవర్ధన్ రెడ్డి, మునావత్ రవి, మండలయూత్ నాయకులు బొమ్మెర కళ్యాణ్ గౌడ్, పిరని ప్రవీణ్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన విజయోత్సవ సంబరాలు లో పాల్గొన్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

## రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే పాయం



పినపాక నియోజకవర్గం డిసెంబర్02(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం గుట్ట మల్లారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరినకి నవీన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ప్రజా పాలన విజయోత్సవ సంబరాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమం మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిందని పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలను ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటున్నామనిఅన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని, భారతదేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులందరికీ 2 లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఏకైక పార్టీ మన కాంగ్రెస్ పార్టీ అనిపేర్కొన్నారు.మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్లకు ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ,కింటా సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్, మరి కొన్ని రోజులలో ఫ్యామిలీ కార్డు ఇలా అనేక పథకాలు ప్రజలకు అందజేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రివర్యులు భట్టి విక్రమార్క పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి శ్రీతుమ్మల నాగేశ్వరరావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా అయినా సంవత్సరకాలంలోనే పినపాక నియోజకవర్గంలో ఏడు మండలాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేశానని నియోజకవర్గ ప్రజల అండదండలతో పినపాక నియోజకవర్గన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజవర్గంగా తీర్చిదిద్దుతానని నియోజకవర్గంలో అనేక గ్రామాలలో ప్రజల సమక్షంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశాలు పెట్టి ప్రజల కష్టనష్టాలను తెలుసుకొని ప్రజల సమక్షంలోనే సమస్యలను పరిష్కరించామని అన్నారు

కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు అహర్నిశలు కష్టపడిన న కుటుంబంలో ఒకరైన కాంగ్రెస్ పార్టీ నాయకులను, మహిళ నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటానని తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమానికి మణుగూరు మండల నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటబోయిన నాగేశ్వరరావు ,నియోజకవర్గ సెక్రటరీ వీరం సుధాకర్ రెడ్డి ,మణుగూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిరినకి నవీన్ మణుగూరు టౌన్ అధ్యక్షులు శివ సైదులు సింగరేణి ఇటుక్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కృష్ణం రాజు , బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య ,మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,మహిళ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో ఛార్జ్ షీట్ విడుదల

### ప్రజా ఆశీర్వాదంతో గెలిచి ప్రజలను మోసం చేస్తావా
### రేవంత్ రెడ్డి పై మండిపడ్డ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



బాసర డిసెంబర్ 02 ( వుదయం ప్రతినిధి ) ప్రజా ఆశీర్వాదంతో ఎన్నికల్లో గెలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు మోసం చేస్తున్నారని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం బైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బిజెపి కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై ఛార్జ్ షీట్ ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టి బడుగు బలహీన వర్గాల వారికి మోసం చేశారన్నారు. మూసి ప్రక్షాళన అంటూ, ఆర్ఆర్ టాక్స్ పేరుతో రేవంత్ రెడ్డి వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. కాళేశ్వరం పేరుతో కెసిఆర్ అవినీతి చేస్తే హైడ్రా, మూసి ప్రక్షాళన పేరుతో రేవంత్ అవినీతికి పాల్పడుతున్నారన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అబద్ధాలతో కాలం వెళ్లదీస్తు నారన్నారు. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి సీటులో కూర్చుని అర్హత లేని లేదని తక్షణమే పదవి నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు. కొడంగల్ లో ఫార్మసిటీ పేరుతో గిరిజనులకు చెందిన 20 ఎకరాల భూమిని లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని, గుంట భూమి ఇవ్వకుండా చూస్తామని బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడతామన్నారు. రైతు రుణమాఫీ ఇప్పటివరకు మాఫీ చేయకుండా రైతులను మోసం చేశారని, రైతు భరోసా ఇప్పటికీ ఇవ్వలేదని, ఇందిరమ్మ ఇల్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహారాష్ట్రలో లాడ్ కి బహన్ పేరుతో మహిళలకు 1500 రూపాయలు ఇస్తే, మహాలక్ష్మి పథకంతో నేలకు 2,500 ఇస్తానన్న సీఎం మాటలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. మహిళల వద్దకు వెళితే కాంగ్రెస్ నేతలకు వారే గుణపాఠం చెప్తారన్నారు.

**మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పై మండిపడ్డ పటేల్**

ముధోల్ నియోజకవర్గం లో గుండెగాం వాసులు 18 సంవత్సరాలుగా పునరావాసం లేకుండా ఉంటే మాజీ ఎమ్మెల్యే విఠ ల్ రెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు . 10 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉండి స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీలో చేరిన విఠల్ రెడ్డి మాయ మాటలతో ప్రజలకు మోసం చేస్తున్నారన్నారు. బాసర ఆలయ అభివృద్ధికి 42 కోట్ల నిధులు తెచ్చామని మంత్రి సీతక్కముందు ఫోటోలకు ఫోజులు ఇచ్చి మాజీ ఎమ్మెల్యే చేతులు దులుపుకున్నారన్నారు. నెల రోజులు గడుస్తున్నా నిధుల జాడ లేదన్నారు. 2027లో పుష్కరాలు వస్తున్నాయని బాసర ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టి అభివృద్ధి చేయాల్సిందిగా సూచించారు. తాను శాసనసభలో నియోజకవర్గానికి చెందిన అనేక సమస్యలను ప్రస్తావించడం జరిగిందని, బాసర ట్రిబుల్ ఐటీ, గుండెగాం పునరావాసం, 28 ప్యాకేజీ పనుల విషయమై మాట్లాడమన్నారు. 28 ప్యాకేజీ పనులు పూర్తయితే నియోజకవర్గంలో 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

**ముధోల్ నియోజకవర్గానికి రానున్నవి మంచి రోజులు**

బిజెపి ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివక్ష చూపుతు, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, ఈ విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఫిర్యాదు చేయడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బిజెపి ఎమ్మెల్యేలు ఎంపీలు అంతా కలిసి 30 నిమిషాల పాటు ప్రధానమంత్రికి సమస్యలు వివరించడం జరిగిందన్నారు. వచ్చే బడ్జెట్ తర్వాత కేంద్ర ప్రభుత్వం బిజెపి ఎమ్మెల్యేలు ఉన్నచోట పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తుందన్నారు. ఇక్కడ బిజెపి ఎమ్మెల్యేల నియోజకవర్గల్లో చూపుతూ, ఢిల్లీలో ప్రధానికి, కేంద్ర మంత్రులను కలుస్తూ నిధుల కోసం వంగి దండాలు పెడుతున్నారన్నారు.

**ప్రభుత్వం వైఫల్యాలపై ఈనెల 5న భారీ బహిరంగ సభ**

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బిజెపి ఆధ్వర్యంలో నియోజకవర్గం అంతట నిరసనలు తెలిపి ఈనెల 5న ఎస్. ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద మొత్తంలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ రాజేష్ బాబు, జిల్లా సహా కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపల్లి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్దా, నారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి కోసం సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఝాన్సీ రెడ్డి



రాయపర్తి డిసెంబర్ 2( వుదయం ప్రతినిధి ):తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమం కోసం చేయూతను అందించాలని అదేవిధంగా పెండింగ్ లో ఉన్న పనులు రైతుల రుణ మాఫీ, కెనాల్ కాలువలు, పూర్తి రోడ్లు మరమత్తులు, నియోజకవర్గ మార్కెట్ ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఝాన్సీ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అడగగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఝాన్సీ రెడ్డి మేరకు కావాల్సిన నిధులు త్వరలో మంజూరు చేస్తున్నాను అని హామీ ఇచ్చారు.సీఎం రేవంత్ రెడ్డికి పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు రుణపడి ఉంటారని ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి) ప్రజలు వివిధ రకాల మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా 18 మంది బాధితుల నుంచి పిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను ఓపిగ్గా విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబధిత పోలీసు అధికారులను అదేశించారు. అలాగే ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అలసత్వం వహించవద్దని ఎస్పి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ౦6 గ్యారంటీలు - 66 మోసాలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బిజెపి మానకొండూర్ నియోజకవర్గ స్థాయి బైక్ ర్యాలీ



మానకొండూరు 02(వుదయం ప్రతినిధి):కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కేశవపట్నం మండలం కొత్తగట్టు నుండి కేశవపట్నం, తాడికల్, గట్టుదుద్దనపల్లి, చెంజర్ల, మానకొండూర్,మన్నెంపల్లి, ఇందిరానగర్, రామకృష్ణకాలనీ, తిమ్మాపూర్, ఎల్ఎండి కాలనీ, అలుగునూర్ చౌరస్తా వరకు బిజెపి మానకొండూర్ నియోజకవర్గ స్థాయి "బైక్ ర్యాలీని" నిర్వహించారు.

ఈ సందర్భంగా లిబిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి గారు మరియు కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి 12 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఇప్పుడు సంబరాలు ఎలా చేసుకుంటుందని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి ప్రజల నడ్డి విరుస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఎద్దేవ చేశారు. ప్రజలను 06 గ్యారెంటీలు, 66 మోసాలతో మోసం చేసిందని అన్నారు. వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే రానున్న రోజుల్లో బిజెపి తరపున మరిన్ని ఉద్యమాలు చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి , జిల్లా అధికార ప్రతినిధులు అలివేలు సమ్మిరెడ్డి, బొంతల కళ్యాణ్ చంద్ర, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు ఏలేటి చంద్రారెడ్డి, మానకొండూర్ మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్,కేశపట్నం మండల అధ్యక్షులు ఏనుగు అనిల్,గన్నేరువరం మండల అధ్యక్షులు నగునూరి శంకర్, బెజ్జంకి మండలం అధ్యక్షులు కొలిపాక రాజు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాస్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలి
### ఫిర్యాదుదారుల సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలి
**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నల్లగొండ డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి): ఫిర్యాదుదారులను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆమె ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ అనవసరంగా కాలయాపన చేయకుండా ఫిర్యాదుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా ఫిర్యాదులు పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె పునరుద్ధరించారు. కాగా ఈ సోమవారం (66) మంది పిర్యాదుదారులు వారి ఫిర్యాదును సమర్పించారు. ఎప్పటిలాగే ఈ సోమవారం సైతం వ్యక్తిగత ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. అందులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు, భూములకు సంబంధించిన అంశాలు ,తదితర ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిఆర్ఓ అమరేందర్,స్పెషల్ కలెక్టర్ నటరాజ్ ,జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణను అడ్డుకోవాలని చూడడం తగదు



డిసెంబర్ 2 (వుద యం ప్రతినిధి )వర్గీకరణను అడ్డుకోవాలని చూస్తున్నా పెద్దపల్లి ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కి తగదని అతనిని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి. మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు పోలే రాజు విమర్శించారు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలని అలాగే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కమిటీ కూడా వేసి ఈ అసెంబ్లీ సమావేశాలలోనే బిల్లుకు ఆమోదం తెలపడం జరుగుతుంది అని తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే నీచ రాజకీయాలకు దిగజారాడు. ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడే వారిని ఎంతటి వారినైనా మాదిగ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు మంత్రి పదవి రాలేదని . ఎస్సీ మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించవలసిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టి విన్నవించారు

## సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

మంథని, డిసెంబర్02(వుదయం ప్రతినిధి): సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. సోమవారం ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసంలో కాల్వశ్రీరాంపూర్ మండలం ఊశన్నపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ లో చేరగా, కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు గాజనవేన సదయ్య, నాయకులు మునీర్, ఈద సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్
### దావ వసంత సురేష్



జగిత్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 02( వుదయం ):బి అర్ ఎస్ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా సోమవారంపట్టణంలోని ధరూర్ క్యాంపు లో గల గురుకుల పాఠశాలను బీఆర్ఎస్ ప్రజా ప్రతి నిధులతో కలిసి జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ సందర్శించినారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ అక్కడ ఉన్న విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి సౌకర్యాలు మరియు సమస్యలు గురించి అడిగి తెలుసుకొని విద్యార్థులతో కలిసి పాఠశాల నుండి కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమానికి నడుచుకుంటూ వెళ్లి పాఠశాలలో ఉన్న సమస్యలను కలెక్టర్ కి తెలియజేసినారు.

దీనికి గాను కలెక్టర్ డి ఈ ఓ తో మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం వారు మాట్లాడుతూరాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అత్యంత దయనీయం పరిస్థితిలో ఉన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అరకొర నిధులు ఏర్పాటు చేస్తుందని,కనీసం నాణ్యమైన భోజనం పెట్టలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని అన్నారు. అన్ని వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యావంతులై తెలంగాణ ఖ్యాతిని లోకానికి చాటి చెప్పాలనె ధ్రుడ సంకల్పంతో కేసీఆర్ గురుకుల పాఠశాలలు ప్రారంభిస్తే ,వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని అన్నారు.కాస్మోటిక్ చార్జీలు పెంచారంటూ రాష్ట్రం లో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు,కానీ ఇక్కడ కనీసం సబ్బులు కూడా ఇవ్వలేదు అంటూ విద్యార్థులు తమ ఆవేదన వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉప అధ్యక్షులు వొల్లెం మల్లేశం , చింత గంగాధర్, వెంకటేశ్వర్ రావు , పడిగేల గంగారెడ్డి, చిట్ల రమణ, ప్రణయ్, భగవాన్, మనోజ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒలంపిక్ క్రీడలలో మెడల్స్ సాధించే దిశగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

**సీఎం క్రీడా కప్ పోటీలో ప్రతి క్రీడాకారులు పాల్గొనాలి**

**పోటీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి క్రీడాకారులను ప్రోత్సహించాలని, 2028 లో నిర్వహించనున్న ఒలింపిక్స్ లో రాష్ట్రం నుండి మెడల్స్ సాధించే దిశగా క్రీడాకారులను తయారు చేయాలి**

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నల్లగొండ డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి): ఒలంపిక్ క్రీడలలో మెడల్స్ సాధించే దిశగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎం క్రీడా కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.

ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా ఈనెల 7, 8 తేదీలలో గ్రామాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, హెడ్మాస్టర్, సీనియర్ ఆటగాడు కమిటీలో సభ్యులుగా ఉంటారని , అనంతరం మండల స్థాయికి వచ్చిన క్రీడాకారులతో ఈ నెల 10 నుండి 12 వరకు మండల స్థాయిలో సి ఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలు ప్రత్యేక అధికారి అధ్యక్షతన, ఎంపీడీవో కన్వీనర్ గా, తహసిల్దార్, ఎంఈఓ, స్కూల్ గేమ్ ఫెడరేషన్ తరపున ఒకరు సభ్యులుగా ఉంటారని చెప్పారు. మండల స్థాయి క్రీడా పోటీల అనంతరం జిల్లా స్థాయిలో ఈ నెల 16 నుండి 21 వరకు 5 రోజులపాటు సీఎం క్రీడా కప్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని,జిల్లా కమిటీ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ,ఎస్పీ వైస్ చైర్మన్ గా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కోవైస్ చైర్మన్ గా ఉంటారని, స్పెషల్ ఆఫీసర్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, డిఈఓ, జిఎం ఇండస్ట్రీస్, మున్సిపల్ కమిషనర్, ఎస్జీఎఫ్ డిస్టిక్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, డిపిఆర్ఓ, సీఈవో, డి ఐ ఓ ఆధ్వర్యంలో ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. అన్నిస్థాయిలో క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రత్యేకించి పోటీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి క్రీడాకారులను ప్రోత్సహించాలని ముఖ్యంగా 2028 లో నిర్వహించనున్న ఒలింపిక్స్ లో రాష్ట్రం నుండి మెడల్స్ సాధించే దిశగా క్రీడాకారులను తయారు చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిఆర్ఓ అమరేందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ ,జిల్లా నూతన స్పోర్ట్స్ అధికారి నర్సీరెడ్డి తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## ప్రజా విజయోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి
### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి) ప్రజా పాలన ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా డిసెంబర్ 3వ తేదీ మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని డా బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానం నుండి డా బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న 2 కే రన్ లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు, యువతీ, యువకులు ప్రతి ఒక్కరు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. డిసెంబర్ 3వ తేదీన 2 కే రన్ నిర్వహణపై సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 3వ తేదీన 2కే రన్ నిర్వహించాల్సి ఉన్నదని తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రతి ఒక్కరు డా బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానికి చేరుకోవాలని, అక్కడి నుండి ప్రధాన రహదారిలోని డా బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు 2 కే రన్ నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 1వ తేదీ నుండి 9వ తేదీ వరకు చేయాల్సిన కార్యక్రమాలపై ప్రతి శాఖకు షెడ్యూల్ ఇచ్చారని, అట్టి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దాసరి కనకమ్మ కుటుంబానికి పద్మశాలి సంఘం అండ ...

- ఐదు వేల ఆర్థిక సాయం
- కరెంటు మీటర్, నల్ల కలెక్షన్ కోసం తక్షణ హామీ.



ఎల్కతుర్తి డిసెంబర్ 2(వుదయం ప్రతి నిది) హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామానికి చెందిన దాసరి కనకమ్మ అనే వృద్ధురాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినది. కడు నిరుపేద కుటుంబానికి చెందిన పద్మశాలి మహిళ చనిపోవడంతో ఒక్కగానొక్క కుమార్తె సమ్మక్క ఒంటరైనది. నిరుపేద కుటుంబానికి చెందడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కుటుంబానికి అఖిల భారత పద్మశాలి హనుమకొండ జిల్లా కమిటీ ముందుకు వచ్చి అండగా నిలిచింది. కుటుంబానికి 5 వేల నగతు రూపాయల ఆర్థిక సాయంతో పాటు, చీకట్లో మగ్గుతున్న కుటుంబానికి కరెంటు మీటర్ ఏర్పాటుతో పాటు, నల్లా నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు తక్షణ హామీ ఇచ్చింది. పద్మశాలి సమస్యల సాధన కోసం జిల్లా కమిటీ ఎల్లప్పుడూ ముందు నిలుస్తుందని జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు సత్యూరి సంతోష్, కార్యదర్శి గైనీ సత్యనారాయణ, దేవసాని సదానందం,వేముల సమ్మయ్య, దాసరి నాగభూషణం, దాసరి రాజయ్య, శ్రీనివాసు, బిట్ల రవి, వేముల శివ, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

## : ఎఫ్ఆర్ఓ సుష్మారావు





జన్నారం,డిసెంబర్ 2(వుదయం విలేకరి) అడవిలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరు కృషి చేయాలని జన్నారం ఇంచార్జ్ రేంజ్ అధికారి వి.సుష్మారావు అన్నారు.సోమవారం రోజున జన్నారం,తాళ్లపేట రేంజ్ పరిధిలో ఉన్న పలు ఆదివాసి గ్రామాలలోని ప్రజలకు అటవీ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అడవులలో నిప్పు పెట్టడం వల్ల చెట్లు,వన్యప్రాణులు చనిపోయే అవకాశం ఉందని వాటిని దూరంగా ఉంచాలన్నారు.

ఈ కార్యక్రమంలో అటవీ అధికారులు,సిబ్బందగ్రామస్తులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన



జన్నారం,డిసెంబర్ 2(వుదయం విలేఖరి) సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జన్నారం పోలీసులు సూచించారు.సోమవారం ఉదయం జన్నారం పట్టణంలోని స్థానిక బస్టాండ్ వద్ద సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వాటి మోసాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు.ఓటీపీలు, బ్యాంకుకు సంబంధించిన వివరాలు,కుల గణన సర్వే డేటా ఎంట్రీలకు ఓటీపీలు లాంటి పేర్లతో సైబర్ నేరగాల ఉచ్చులో పడద్దని పేర్కొన్నారు.అలాంటి వివరాలు ఎవరు అడగరని ఏమైనా అనుమానాస్పదంగా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు,ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ అవార్డుకు ఎంపికైనా సాయి తేజ



జన్నారం,డిసెంబర్ 2(వుదయం విలేఖరి) జన్నారం పట్టణంలోని జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థి బోయిని సాయితేజ ప్రదర్శించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ అవార్డుకు ఎంపికైందని ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు.ఒక ప్రాజెక్టులో వరదనీరు అధికంగా చేరి గేట్లు తెరుచుకోని సందర్భంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో డ్యాం ప్రమాదకరంగా మారినప్పుడు నీటిని తొడివేయడం ఎలా అనే ప్రదర్శన జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎంపికైంది.ఈ సందర్భంగా సాయి తేజను ఎంఈఓ విజయ్ కుమార్,ఉపాధ్యాయులు అభినందించారు.

# పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



జన్నారం,డిసెంబర్ 2(వుదయం విలేఖరి) పౌష్టికాహారంతో విద్యార్థులలో రక్తహీనతను నివారించవచ్చని జన్నారం ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది అన్నారు.సోమవారం జన్నారం పట్టణ శివారులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వ వైద్య సిబ్బంది సికిల్ సెల్ ఎనీమియా వైద్య పరీక్షలు నిర్వహించారు.అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.విద్యార్థులకు పౌష్టికాహారం పెడితే రక్తహీనత బారిన పడకుండా ఉంటారని వైద్య సిబ్బంది అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా కేంద్రంలో వీఆర్ఏల ఆందోళన

జనగామ, డిసెంబర్02(వుదయం ప్రతినిధి): జనగామ జిల్లా కేంద్రంలో జీవో నెంబర్ 81 ప్రకారం ప్రభుత్వం మిగిలిన 3797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. 61 సంవత్సరాలు పై బడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో జిల్లాకు చెందిన పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

# కోదాడ ప్రాంత సర్వతో ముఖాభివృద్ధి మా లక్ష్యం

## మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



కోదాడ, డిసెంబర్ 2(వుదయం) కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతేలో 25 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న డబల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులకు రాష్ట్ర భారీ నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కోదాడ శాసనసభ్యురాలు ఉత్తం పద్మావతి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ అభివృద్ధి మా లక్ష్యం అని అన్నారు. నియోజకవర్గంలో 100 కోట్ల రూపాయలతో రోడ్లను అభివృద్ధి చేస్తామని, కోదాడ పట్టణానికి వంద పడకల హాస్పిటల్లో ప్రజల సౌకర్యార్థం సిటీ స్కాన్ ఏర్పాటు చేశామని రైతులకు సాగునీరు అందించేందుకు లిఫ్ట్ లను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపిస్తున్నామని అన్నారు. కాళేశ్వరం నుంచి నీరు చుక్క రాకపోయినా వానాకాలం 66.7 లక్షల ఎకరాలలో 1503 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతులు తెలంగాణా రాష్ట్రం లో పండించారని అన్నారు.

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, సంక్రాంతి తర్వాత రైతులకు రైతు భరోసా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి,జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్,మాజీ శాసన సభ్యులు వెనేపల్లి చంద్రరావు,జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్, ఏ సి పి నాగేశ్వరావు, ఆర్ అండ్ బి ఈ ఈ సీతారామయ్య, మోతే తహసీల్దార్ సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 40 ఫిర్యాదులు



గద్వాల డిసెంబర్02(వుదయం ప్రతినిధి) ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావులతో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి మొత్తం 40 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రజావాణి అనంతరం ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రచురించబడిన మాదక ద్రవ్యాల నిర్మూలన గోడపత్రికలను సంబంధిత జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజ్ తో కలిసి ఆవిష్కరించారు. ఇట్టి గోడ పత్రికలన జిల్లాలోని అన్ని కళాశాలలో అతికించారు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## కృత్యాధార విద్యాబోధనతో విద్యా సామార్థ్యాల పెంపుదల



ముధోల్, డిసెంబర్2 (వుదయం ప్రతినిధి)ముధోల్ మండల కేంద్రములోని ఎల్వత్ - ధర్మా బాద్ రోడ్ లోగల శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 6.వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల పోషకుల సమావేశం ఏర్పాటు చేయనైనది. ఈ సమావేశానికి 80 మంది పోషకులకు గాను 50 మంది పోషకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో విద్యార్థులు పోషకుల ముందు అనేక కృత్యాలను ప్రత్యక్షంగా చేసి చూయించారు.ఈ సందర్భంగా పోషకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. వారి అభిప్రాయాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ విభాగ్ సహ కార్యదర్శి సరుకొండ దామోదర్ , నిర్మల్ జిల్లా కోశాధికారి ధర్మపురి సుదర్శన్ , పాఠశాల కార్యదర్శి కంది మానాజీ , ప్రధానాచార్యులు సారథి రాజు అకాడమిక్ ఇంచార్జీ దేవేందర్ చారి గారు, ఆచార్యులు పాల్గొని పోషకులకు అవగాహన కల్పించారు.

# కురుమూర్తి బ్రహ్మోత్సవాలలో భక్తుల రద్దీ

దేవరకద్ర, డిసెంబర్02(వుదయం ప్రతినిధి): మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో పెదల తిరుపతిగా పేరొందిన కురుమూర్తి స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. కురుమర్తి బ్రహ్మోత్సవాల చివరి రోజు, అమావాస్య కావడంతో భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. స్వామివారి సన్నిధిలో నిద్రాహారాలు చేశారు. సోమవారం తెల్లవారుజామున కోనేరులో స్నానాలు ఆచరించి భక్తశ్రద్ధలతో కురుమూర్తి రాయుడుని దర్శించుకున్నారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## గ్రీవెన్స్ డే లో ఫిర్యాదులను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ రాములు నాయక్



నల్లగొండ డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి): సోమవారం గ్రీవెన్స్ డే లో ఫిర్యాదులను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 30 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.

# ఉత్సాహభరితంగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

## తరలి వచ్చిన క్రీడాభిమానులు



నల్లగొండ డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి): నల్గొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల ఆవరణలో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. మొత్తం 64 టీంలు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి. సోమవారం 6 జట్లు పాల్గొనగా మూడు మ్యాచ్లు నిర్వహించారు. నల్గొండ తాసిల్దార్ శ్రీనివాస్ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.అనంతరం మొదటి మ్యాచ్ ను ప్రారంభించారు. క్రికెట్ పోటీలను తిలకించడానికి యువత పెద్ద సంఖ్యలో ఎన్జీ కళాశాలకు తరలివచ్చారు. నల్లగొండ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ తో పాటు పలువురు క్రీడాకారులు క్రికెట్ కామెంట్రీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ కేసాని వేణుగోపాల్ రెడ్డి, బోనగిరి ప్రభాకర్, ఆంగోతు ప్రదీప్ నాయక్, ముత్తినేని నాగేశ్వరరావు, ఏర్పుల రవి, ఏర్పుల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# లైట్లున్న వెలగని దుస్థితి..



పినపాక నియోజకవర్గం డిసెంబర్02(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సందెల్ల రామాపురంఅడ్డరోడ్డు ప్రాంతం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది ఇటు పాల్వంచ మణుగూరు, భద్రాచలం చతిస్గడ్ తదితర ప్రాంతాలకు ఈ రహదారి ప్రధాన నేషనల్ హైవేగా కొనసాగుతోంది రహదారి నిర్మాణం సమయంలో ఒక హైమాక్స్ లైట్స్ స్తంభాన్ని ఏర్పాటు చేసి నామకే వస్తే కొన్ని రోజులు మాత్రమే ఆ లైట్స్ వెలిగించి తరువాత మరిచిన అధికారులు.గ్రామపంచాయతీ అధికారులు మాకు ఆ లైట్స్ లకి సంబంధం లేదు మాకు తెలియదు ఎవరు దానికి బాధ్యులు తెలుసుకొని చెబుతామంటూ చేతులు దులుపుకుంటున్న పరిస్థితి.అసలే అటవీ ప్రాంతం నిత్యం వాహనాలతో రద్దీగా కొనసాగుతూ ఉంటుంది ఆ ప్రాంతంలో ఆ లైట్లు వెలిగితే ప్రమాదాలు జరగకుండా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉండేవి కానీ ప్రస్తుతం ఆ లైట్లు వెలగక చాలా సంవత్సరాలు అయింది అందుకు కారణం ఏమిటో తెలియదు.ఏదైనా పెను ప్రమాదం జరిగి ప్రాణాలు పోతే అప్పుడు ఆ లైట్లు వేస్తారా అప్పటివరకు ఆ లైట్లు వెలిగించరా అనే ప్రశ్నలు ఈ ప్రాంతంలో ప్రయాణాలు చేసే వాహనదారుల ద్వారా వినిపిస్తున్న ప్రశ్నలు.అన్నిటికీ ప్రధాన రహదారిగా మూల కేంద్రంగా ఉండే అడ్డరోడ్డు ప్రాంతంలో లైట్లు లేకపోతే చెమ్మ చీకటిగా ఉంటూ ఉంది. తీవ్ర ఇబ్బందులు వాహనదారులు ఎదుర్కొంటూ ఉన్నారు.

గతంలో అనేక ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. ఆ ప్రాంతంలో అన్ని డబ్బులు వెచ్చించి ఖర్చు చేసి లైట్లు వెలగని పరిస్థితి ఎందుకు ఏర్పడింది అందుకు అధికారులు నిర్లక్ష్యమా అది ఉన్నతాధికారులే తేల్చాల్సిన పరిస్థితి.ఏది ఏమైనా సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి ఆ లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు వాహనదారులు కోరుతున్నారు

# ఉపాధి అవకాశాలు కల్పించాలి



జన్నారం,డిసెంబర్ 2(వుదయం విలేఖరి) కుట్టు శిక్షణ పూర్తి చేసిన తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జన్నారం పట్టణంలోని న్యాక్ శిక్షణా కేంద్రం శిక్షణార్థులు కోరారు.పట్టణంలోని రాంనగర్ లో న్యాక్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రంలో శిక్షణను పూర్తి చేశామన్నారు. అయితే తమకు ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల డ్రెస్సులను కుట్టే అవకాశం ఇవ్వాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో శశికళకు వారు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు ముల్కల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## ఫుడ్ పాయిజన్ కు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కుట్ర

## కెసిఆర్ వంచన చేరి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బధనం చేసేందుకు ప్రయత్నం

## డిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్



నల్లగొండ డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి): రాష్ట్రంలో గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజకీయ కుట్ర అని డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ విమర్శించారు. సోమవారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధి చేస్తుందని అన్నారు. దీనిని జీర్ణించుకోలేక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కెసిఆర్ వంచన చేరి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కుట్ర చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం సంక్షేమ హాస్టల గురించి ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు 40% కాస్మోటిక్ చార్జీలను పెంచిందని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో గురుకుల పాఠశాల కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నామినేషన్ పద్ధతిలో గురుకుల హాస్టల్లో ఎంతోమందిని నియమించుకొని తన వ్యక్తిగత బలాన్ని పెంచుకున్నాడని అన్నారు. వాళ్లంతా ఇప్పుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాటలు వింటూ ఫుడ్ పాయిజన్ గా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. కెసిఆర్ కు ఊడిగం చేస్తూ గురుకుల హాస్టల్లలో ఫుడ్ పాయిజన్ కుట్రకు తెర లేపుతున్నాడని ధ్వజమెత్తారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బహుజన సమాజ్ పార్టీలో చేరి ఆట్టర్ ఫ్లాప్ కావడంతో కెసిఆర్ వంచన చేరి రాజకీయ కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. గతంలో ఐపిఎస్ అధికారిగా, దళిత బిడ్డగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను అందరూ గౌరవించే వాళ్ళని, ఇప్పుడు ఆయన చేస్తున్న కుట్రలతో తనకున్న గౌరవాన్ని పోగొట్టుకున్నాడని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నాడని స్పష్టం చేశారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్రంలో రుణమాఫీ చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తూ అన్ని వర్గాల విద్యార్థులకు ఒకే చోట విద్యను అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ ముందుకు పోతుందన్నారు. గత ప్రభుత్వంలో బడులు, గుడులు, ఏది కట్టిన ఆ పార్టీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి దండుకునేవారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజకీయ కుట్టలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కుట్రలన్నింటినీ పార్టీ శ్రేణులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కత్తుల కోటి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్ రెడ్డి, రేగట్ట లింగస్వామి గౌడ్, చింతపల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ ఫేర్ లో రాష్ట్రస్థాయి కి ఎంపిక అయిన విద్యార్థి



లక్సెట్టిపేట డిసెంబర్ 2 :( వుదయం ప్రతినిధి ):- పట్టణానికి చెందిన విద్యార్థులు మంచిర్యాలలో రెండు రోజులపాటు నిర్వహించిన సైన్స్ ఫెర్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఒకరు రాష్ట్రస్థాయిలో ఎంపిక ఇంకొకరు జిల్లా స్థాయిలో రెండవ బహుమతి పొందాడు. నేషనల్ ఇన్నోవేషన్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇన్స్పైర్ మనక్ 2023- 24 లో మదర్ తెరిసా విద్యాలయం కు చెందిన జింజంపల్లి అనుదీప్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. అలాగే బాల వైజ్ఞానిక ప్రదర్శనలో వేస్ట్ మేనేజ్మెంట్ థీమ్ కు గాను ఆకారపు సుశ్విక్ సాయి రెండవ బహుమతి పొందాడు. వీరికి గైడ్స్ గా రాచర్ల సునీత వాణి, అక్కల దేవేంద్ర లు వ్యవహరించారు. వీరిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# తాటి చెట్టు నుండి పడి గాయపడ్డ వ్యక్తిని పరామర్శించిన మాజీ ఎంపీపీ



పెద్దపల్లి జిల్లా: డిసెంబర్, 2 (వుదయం) ప్రతినిధిబీ శ్రీరాంపూర్ మండలంలోని అంకంపల్లి గ్రామానికి చెందిన జక్కుల ఓదెలు గౌడ్ తాటి చెట్టుపై నుండి కిందపడడంతో తీవ్ర గాయాలు పొందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వ్యక్తికి తక్షణ వైద్య సహాయం అందించాలని అధికారులను కోరారు. ఈ యనతో మాజీ ఎంపీటీసీ పొత్తూరి మొండయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు. తాటి చెట్లపై పనిచేసే వారందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు. సామాజిక సేవలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తాయని, ఇలాంటి చర్యలు గోపగోని సారయ్యగౌడ్ కు మరింత ప్రజాధరణను కలిగిస్తాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

ఈ సేవల ద్వారా ఆయన రాజకీయ భవిష్యత్తు పటిష్టమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు.

# సిఎమ్ఆర్ఎఫ్ తో నిరుపేదలకు వరం

## నూనె కుమార్



కొండపాక డిసెంబర్02(వుదయం ప్రతినిధి): సిఎమ్ఆర్ఎఫ్ తో నిరుపేదలకు మేలు జరుగుతుందని అన్నారు బిఆరెస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షులు నూనె కుమార్ అన్నారు. సోమవారం కొండపాక మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో పుట్ట మల్లేశం యాదవ్ అనే లబ్ధిదారుడికి 37500 రూపాయల ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయినా చెక్ ను అందజేసిన సందర్భంగా అయన మాట్లాడుతూ నిరుపేద, మధ్య తరగతి ప్రజలు అనారోగ్యల బాధలో ఉండి, ఆర్థిక పరిస్థితి బాగా లేని వారికి ఈ సిఎమ్ఆర్ఎఫ్ ఆపద్బంధులాగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సహాయ నిధులు మంజూరు చేయడానికి సహకరించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు నూనె కుమార్ యాదవ్. ఈ కార్యక్రమంలో బారాస యువజన విభాగం అధ్యక్షులు చిక్కుడు భాను, నాయకులు పుట్ట చంద్రం, బసవరాజు నవీన్, చందు , పబ్బోజు శ్రీధర్, చిక్కుడు సాయికిరణ్, తిరుపతి, సాయి ముదిరాజ్, గాధగోని రాకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# వర్ష సూచనతో రైతులు అప్రమత్తంగా ఉండాలి.

### వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహసిల్దార్ కిరణ్ కుమార్.



ఖానాపురం డిసెంబర్ 2 వుదయం ప్రతినిధి. వాతావరణ ప్రభావంతో వర్షం ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి ఉన్నందున రైతులందరూ వరి ధాన్యం కల్లాల వద్ద అప్రమత్తంగా ఉండాలని తాహసిల్దార్ పీ కిరణ్ కుమార్, ఏడిఏ దామోదర్ రెడ్డి రైతులకు తెలిపారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలోని ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాహసిల్దార్, ఏడిఏ సందర్శించి కల్లాల వద్ద వరి ధాన్యం తడవకుండా టార్పాలిన్ కప్పాలని రైతులకు తెలుపుతూ, రైతులు వర్షం పడుతుందని వరి ధాన్యం పరిస్థితి ఏమిటని అధైర్య పడగొద్దని రైతులకు మనోధైర్యం కల్పిస్తూ అనుకోకుండా వర్షం పడ్డ ధాన్యం తడవకుండా పలు విషయాలను రైతులకు తెలిపారు. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యమును త్వరగా కొనుగోలు చేయాలని కొనుగోలు ఇన్చార్జిలను తాసిల్దార్, ఏడీఏ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి భోగ శ్రీనివాస్, విస్తరణ అధికారి అంకుష్ వలి, రికార్డు అసిస్టెంట్ బైరబోయిన ఐలేష్, కొనుగోలు ఇన్చార్జిలు వినయ్, వీరేష్ రైతులు హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన విజయోత్సవాల అధికారిక లోగోను అన్ని ప్రింట్, డిజిటల్ ప్లాట్ఫామ్స్ లో ఉపయోగించాలి

### అన్నీ ప్రభుత్వ కార్యాలయాలలో, ఛాంబర్లలో నెంబర్ వన్ లోగో స్టాండీస్ ఏర్పాటు చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 9 వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలి

### ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా డిసెంబర్ 1న ఆదివారం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుండి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాల్లో భాగంగా అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం ఆమోదించిన ప్రజా పాలన విజయోత్సవాల అధికారిక లోగోను అన్ని ప్రింట్, డిజిటల్ ప్లాట్ఫామ్స్ లో ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ప్రజా పాలనపై సమీక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన "తెలంగాణ రైజింగ్ నంబర్ వన్" లోగోను అన్నిచోట్ల, అందరికీ బాగా కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. అన్నీ ప్రభుత్వ కార్యాలయాలలో, ఛాంబర్లలో నెంబర్ వన్ లోగో స్టాండీస్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 9 వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని చెప్పారు .ఆయా శాఖల వారిగా గత సంవత్సర కాలంలో సాధించిన అభివృద్ధిపై విజయ గాథలను రూపొందించి సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని, పోస్టర్లు, కరపత్రాల రూపంలో ప్రచారం చేయాలని చెప్పారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న ప్రజా విజయోత్సవాలను జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, మండల స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రజలను ,అధికారులను భాగస్వామ్యం చేస్తూ విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాల్సిందిగా ఆమె ఆదేశించారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా డిసెంబర్ 1న ఆదివారం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని, అంతేకాక 2 కె రన్ లను నిర్వహించడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారని, అలాగే 213 కొత్త అంబులెన్సును, 33 ట్రాన్సజెండర్ క్లినిక్లను జిల్లాకు ఒకటి చొప్పున ప్రారంభించనున్నారని తెలిపారు. డిసెంబర్ 3నమున్సిప ల్ అడ్మినిస్ట్రేషన్ డెవలప్మెంట్ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన, పట్టణ ప్రాంతాలలో అన్ని కార్యాలయాల్లో విద్యుత్ దీపాల అలంకరణ, వైద్య శిబిరాల నిర్వహణ ,పారిశుధ్య కార్మికులకు కిట్ల పంపిణీ ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 4న అమృత్ పనుల ఫౌండేషన్, పెద్దపల్లిలో 9007 మంది ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేత కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. డిసెంబర్ 5న పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్, సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలు, అదేవిధంగా నల్గొండ తో పాటు ,మేడ్చల్, మల్లేపల్లిలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాల ప్రారంభం ఉంటుందని తెలియజేశారు. డిసెంబర్ 6 న యాదాద్రి పవర్ స్టేషన్ కమిషనింగ్, 2004 సబ్ స్టేషన్ లో శంకుస్థాపన కార్యక్రమాలు ఉంటాయని, డిసెంబర్ 7న హైదరాబాదులో రాష్ట్ర విపత్తు నిర్వహణ రెస్పాన్స్ ఫోర్స్ ప్రారంభం ,పోలీస్ బ్యాండ్ ప్రదర్శన, ప్రజా పాలన గ్రాండ్ ఫినాలే ఉంటాయని తెలిపోయారు. డిసెంబర్ 8 న హైదరాబాదులో పారిశ్రామిక శాఖకు సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయని, డిసెంబర్ 9న హైదరాబాద్లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, డ్రోన్ షో, ఫైర్ షో ఉంటాయని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఆర్ఓ అమరెందర్, జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు.

# గ్రీవెన్స్ డే లో జిల్లా ఎస్పీ కి తమ సమస్యలను తెలుపుకున్న భాదితులు

### భాధితుల సమస్యల పట్ల విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కారించాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్



భద్రాద్రి కొత్తగూడెం డిసెంబర్ 02 (వుదయం ప్రతినిధి)గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ గారు ఎస్పీ కార్యాలయానికి వివిధ రకాల సమస్యలతో వచ్చిన భాదితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భాధితుల సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల విచారణలో జాప్యం జరగకుండా వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూర్చాలని అధికారులకు ఆదేశించారు.

# ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి.

### జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు.



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్02(వుదయం ప్రతినిధి): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్.పి.డివి శ్రీనివాస్ రావు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ మరియు సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనెల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్.పి. డివి శ్రీనివాస్ రావు తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

# రాజపేటలో హరే రామ నామ జప యజ్ఞం

### ప్రసాద దాత దాచేపల్లి రాజు స్వరూప దంపతులు



యాదాద్రి భువనగిరి/రాజాపేట, డిసెంబర్ 2 వుదయం ప్రతినిధి : రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో శ్రీశ్రీశ్రీ యతివర భావానంద విశ్వనాథ సద్గురువుల అనుగ్రహంతో శ్రీ పాండురంగాశ్రమము సంకల్పించిన శతకోటి హరే రామ నామ జప యజ్ఞంలో భాగంగా సోమవారం రాజపేట శాఖ అధ్యక్షులు నంగునూరు రాజు ఆధ్వర్యంలో చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ సమక్షంలో అదరాశి పల్లి శ్రీధర్ శర్మ పర్యవేక్షణలో హరే రామ నామ సంకీర్తన జరిగింది. ప్రసాద దాతలు రాజాపేటకు చెందిన దాచేపల్లి శ్రీనివాసులు స్వరూప దంపతులు కుమార్తె వైభవి పుట్టినరోజు సందర్భంగా ప్రసాదం అందజేశారు. దాతలకు నిర్వాహకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు తదితరులున్నారు.

# ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

బోథ్, డిసెంబర్02(వుదయం ప్రతినిధి): బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న భౌతిక దాడులను నిరసిస్తూ శాంతియుతంగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్డీవో ఆఫీస్ ఎదురుగా ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. బంగ్లాదేశ్లో హిందువులపై దాడిని ఖండిస్తున్నామని, ప్రతి ఒక్కరు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# అస్తమా నిరోధక ఉచిత యోగ శిబిరం

గజ్వేల్, డిసెంబర్02(వుదయం ప్రతినిధి):సిద్దిపేటలోని మోహినిపురా వేంకటేశ్వర ఆలయంలోని శ్రీనివాస ధ్యాన మందిరంలో నేటి నుంచి 8వ తేదీ వరకు వ్యాసమహర్షి యోగా సొసైటీ, భారత్ స్వాభిమాన్ ట్రస్టు, ఆలయ సంయుక్తాధ్వర్యంలో అస్తమా నిరోధక ఉచిత యోగ శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అమరేశ్ విష్ణు, ఈవో విశ్వనాథశర్మ బీఎస్టీ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, వ్యాసమహర్షి యోగా సొసైటీ జిల్లా అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు చేయాలి

## -సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్



బెల్లంపల్లి, డిసెంబర్02 (వుదయం ప్రతినిధి) రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిన సందర్భంగా ఈనెల 4న సింగరేణి కార్మిక ప్రాంతమైన పెద్దపెల్లి జిల్లాకు వస్తున్న సందర్భంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి పట్టణంలో సింగరేణి ఐక్య వేదిక నాయకులు తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి చాంద్ పాషా, హెచ్ ఎం ఎస్ నాయకులు రాజబాబు, టీఎస్టీయుసి మని రామ్ సింగ్, ఎస్ జి కె ఎస్ మహేందర్, ఏఐఎఫ్టీయూ పోచమల్లు, టీఎస్యూఎస్ రాజన్న, టియూసిఐ శంకర్ లు మాట్లాడుతూ. సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికల సందర్భంగా సింగరేణి ప్రాంతాలు తిరిగినప్పుడు మీరు ఇచ్చిన హామీలు గుర్తుచేసుకొని వాటిని అమలు చేయాల్సిన బాధ్యత మీకుందని అలా కాకుండాఏ ఒక్క హామీను కూడా మీరు అమలు చేయలేదని విమర్శించారు.

సింగరేణి లో కొత్త ప్రాజెక్టులు తీసుకోస్తామని కార్మికుల ఇన్కమ్ టాక్స్ సింగరేణి సంస్థ కట్టే విధంగా చేస్తామని మారు పేర్లు సరిచేస్తామని తదితర సమస్యలు సింగరేణి సంబంధించినటువంటి అనేక సమస్యలు నెరవేస్తానని హామీఇచ్చారని ఏ ఒక్క సమస్యను పరిష్కారించిన దాకాలు లేవని మండిపడ్డారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల మంది అసంఘటిత కార్మిక వర్గం ఉందనివాళ్లకు 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెరిగినటువంటి కనీస వేతనాలు తప్ప పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈనాటి వరకు కనీస వేతనాలు అమలుకాలేదని ఆరోపించారు. కోటిల 20 లక్షల మంది కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీవోలు విడుదల గెజిట్ అమలు చేయాలని కోరారు. కార్మిక డిక్లరేషన్ ఏదైతే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందో ఆ కార్మిక డిక్లరేషన్ పరిష్కరించలేదని, సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్దపెల్లి బహిరంగ సభలో సీఎం ఒక స్పష్టమైన ప్రకటన చేయాలనీ కోరారు. సీఎం పర్యాటనకు రెండురోజులు ముందే సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక హెచ్ఎంఎస్ నాయకులు రియాజ్ అహ్మద్ ని అదుపులోకి తీసుకోవడం సరైనది కాదనీ దీన్ని కార్మిక సంఘాల ఐక్యవేదిక తరపున తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రులు, మినిస్టర్లు, ఈ ప్రాంతాల పర్యటించినప్పుడు ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్టులు చేసినటువంటి పరిస్థితి ఇది ఒక నియంతృత్వ ధోరణి అవలంబిస్తున్నరని అని కార్మికులు ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛను హరించడం అవుతుందని అన్నారు. గత ప్రభుత్వ నియంతృత్వ ధోరణి ని అనుసరించడం వల్లనే ప్రభుత్వాల మీద వ్యతిరేకత వచ్చింది. మీ ప్రజా పాలనలోను నిర్బంధ విధానాన్ని కొనసాగిస్తున్నరని వారికి పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరించారు.

# బిజెపి నేతలు వాస్తవాలు మాట్లాడాలి : సుప్రభాత రావు



మెదక్, ( 2024 డిసెంబర్ 02 వుదయం ప్రతినిధి : మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు ఆధ్వర్యంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బిజెపి పార్టీ దేశ ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన అన్నారు. మెదక్ ఎమ్మెల్యే సమక్షంలో రామాయంపేట పట్టణంలో ప్రతి కుల సంఘానికి కమ్యూనిటీ హాల్, ప్రతివాడలో సిసి రోడ్డు నిర్మాణానికి ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. బిజెపి నేతలు ఎమ్మెల్యేలు విమర్శించడం మానుకోవాలన్నారు. ఇకనైనా ఆరోపణలు మాని అభివృద్ధికి సహకరించాలని బిజెపి నాయకులకు చురకలాంటించారు.

# అభివృద్ధి హామీల అమలుపై ప్రత్యేక శ్రద్ధ. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



కరీంనగర్,డిసెంబర్02(వుదయం ప్రతినిధి):నియోజకవర్గం అభివృద్ధికి ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ముందుకు సాగుతున్నామని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం బెజ్జంకి మండల కేంద్రంలో 90 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. అనంతరం అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించి పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బెజ్జంకి మండల అభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడుతున్నానని, గతంలో ఇచ్చిన హామీల మేరకు ఇప్పటికే వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పుడు మరో 90 లక్షలతో పనులు చేపడతామని, రెండు,మూడు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.గత వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థ శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ పనులు పూర్తయితే బెజ్జంకి వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు తీరుతాయని, అదనపు సౌకర్యాలు సమకూరుతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదని, ప్రజలు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఈ నెల 7 నుంచి సీఎం కప్ క్రీడోత్సవాలు : జిల్లా కలెక్టర్

మెదక్, ( 2024 డిసెంబర్ 02 వుదయం ప్రతినిధి : ఈ నెల 7, 8 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7, 8వ తేదీల్లో మొదటగా గ్రామ స్థాయిలో పోటీలు, 10 – 12వ తేదీల్లో మండల స్థాయి పోటీలు, 16 – 21 తేదీల్లో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. ఆన్లైన్లో ద్వారా పేరు నమోదు చేసుకోవాలని క్రీడాకారులకు విజ్ఞప్తి చేశారు.

# ఖనిజ లవణ మిశ్రమాన్ని ఖచ్చితంగా వాడాలి

## డా జి వి రమేష్,జిల్లా పశు వైద్య మరియు పశుసంవర్ధక అధికారి



కల్వకుర్తి డిసెంబర్ 2 (వుద యం ప్రతినిధి )పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వ విద్యాలయం పశు వైద్య కళాశాల రాజేంద్రనగర్, పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ,విజయ డెయిరీ ఆధ్వర్యం కొట్ర,తాండ్ర,జూపల్లి,తిమ్మనోనిపల్లి గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల కు విచ్చేసి రైతులను ఉద్దేశించి డా రమేష్ మాట్లాడుతూ ఈ శిబిరాల్లో ఎద కు కూడా రాని పశువులకు, చూడి నిలవని పశువులకు,గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు,దీర్ఘకాల వ్యాధులు ఉన్న పశువులకు, శస్త్ర చికిత్సలు అవసరమైన పశువులకు నిపుణులైన అధ్యాపకులచే పరీక్షించి చికిత్సలు చేస్తున్నారని తెలియచేసారు. ఈ ప్రాంతంలో పశువులతో ఎక్కువగా ఖనిజ లవణాల లోపం ఎక్కువగా ఉంది కాబట్టి ప్రతి పశువులు కనీసం 50 గ్రాముల ఖనిజ లవణ మిశ్రమాన్ని అందించినట్లైతే పశువు లు ఆరోగ్యం గా వుండి,త్వరగా ఏడకువచ్చి చూడి కడతాయి,పలదిగుబడి పెరుగుతుంది అని తెలియ చేశారు. ,పశు వైద్య కళాశాల ఆచార్యులు డా %ఖజూ% రెడ్డి మాట్లాడుతూ పశువులతో ఈతల మధ్యకాలం తగ్గించినట్లైతే పశువు జీవిత కాలంలో ఎక్కువ పాల దిగుబడి పొందవచ్చని తెలియచేసారు . ఈ కార్యక్రమంలో NSS ఇంచార్జీ డా రమణ,,విజయ డెయిరీ DD

ధనరాజ్ డా రాజేష్,నాగరాజ్,శివ, శ్యామ్, వెంకటేష్, ప్రవీణ్ పశు వైద్య కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు, విజయ డెయిరీ సిబ్బంది,అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ శిబిరాల్లో 534 పశువులకు గర్భకోస వ్యాధులకు చికిత్స, 92 పశువుల కు ఇతర అనారోగ్యాలకు చికిత్సలు,రక్త పరీక్షలు, పేడ పరీక్షలు నిర్వహించారు.

# విద్యార్థినిని పరామర్శించిన డిఐఈఓ, ప్రిన్సిపల్



పాపన్నపేట, డిసెంబర్02(వుదయం ప్రతినిధి): సోమవారం ఉదయం మండల పరిధిలోని నార్సింగి చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్ర గాయాల పాలైన ఉప్పరి విజయలక్ష్మి మెదక్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి, కళాశాల ప్రిన్సిపల్ నర్సింలు ఆసుపత్రికి చేరుకొని పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట లెక్చరర్లు గాండ్ల శ్రీనివాస్, ప్రవీణ్ ఉన్నారు. కాగా మరో విద్యార్థిని అఖిల కాలు నుజ్జవగా హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుంది.

# అయ్యప్ప కాపాడయ్యా నీ సన్నిధానానికి వస్తున్నాం..

## వెన్నారం గ్రామంలో కన్నుల పండగ ఇరుముడి కార్యక్రమం..



మహబూబాబాద్ డోర్నకల్/( వుదయం ప్రతినిధి) డోర్నకల్ మండలం వెన్నారం గ్రామంలో వెంకటేశ్వర్లు స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమం గురు స్వామి సతీష్ స్వామి, ఆధ్వర్యంలో కనుల పండుగగా జరిగింది... ఇరుముడి తో అయ్యప్పస్వాములు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.. అయ్యప్పస్వామి నామంతో గ్రామ మారు మోగింది.. గ్రామంలో పండుగ వాతావరణం ఏర్పడిందిఈ సందర్భంగా సతీష్ గురు స్వామి మాట్లాడుతూ.. వెన్నారం గ్రామంలో 65, మంది స్వాములు అయ్యప్ప మాలధారణ దరించి 41, రోజుల పాటు అయ్యప్పస్వామిని తలుచుకుంటూ కటారో దీక్షతో పూజలు నిర్వహించి శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిధికి బయలుదేరామన్నారు.. గత 12, సంవత్సరాల పాటు గ్రామంలో యువకులు అయ్యప్ప మాలతో పూజలు నిర్వహిస్తామన్నారు.. అయ్యప్పస్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులతో సిరిసంపదలతో ఆనందంగా ఉండాలన్నారు ..ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురు స్వాములు, కత్తి స్వాములు, కన్య స్వాములు, గద స్వాములు, తదితరులు పాల్గొన్నారు..

# పేటలో 'దర్గాగా రోడ్డు కబ్జా'



మెదక్, ( 2024 డిసెంబర్ 02 వుదయం ప్రతినిధి : రామాయంపేట పట్టణంలోని ఎంపీడీవో కాంప్లెక్స్ రోడ్డు యథేచ్ఛగా ఆక్రమణకు గురైంది. దుకాణాలకు వచ్చే కస్టమర్లకు, వాహనాల కోసం ఏర్పాటుచేసిన రోడ్డును యథేచ్ఛగా ఆక్రమించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. బలవంతుల రాజ్యం అన్న చందంగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని నెలవారీగా వేలాది రూపాయలు అద్దె రూపంలో అక్రమార్కులు దిగమింగుతున్నారు. ఒకవైపు రోడ్డు గుంత పడింది, మరోవైపు రోడ్డును ఆక్రమించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# ఆర్టీసి బస్సు ఢీ, ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

- డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం
- పి.ఎస్ లో ఫిర్యాదు చేసిన కుటుంబీకులు

పాపన్నపేట, డిసెంబర్02(వుదయం ప్రతినిధి): ఆర్టీసి బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ సంగన్న, స్థానికుల కథనం మేరకు... నార్సింగి గ్రామానికి చెందిన అఖిల, విజయ అనే ఇద్దరు విద్యార్థులు రోజూ లాగే సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లేందుకు ఇంటి నుండి బయలుదేరారు. నార్సింగి ఎక్స్ రోడ్డు వద్ద బస్సు ఎక్కేందుకు వేచి ఉన్న క్రమంలో బొడ్మట్ పల్లి నుండి మెదక్ వైపు వెళ్తున్న ఆర్టీసి బస్సు వీరిని ఢీ కొట్టింది. దీంతో అఖిల కాలుకు నుజ్జయి తీవ్ర రక్త స్రావమైంది. మరో విద్యార్థి విజయకు సైతం తీవ్ర గాయాలయ్యాయి.అక్కడే ఉన్న స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే 108లో మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును ఠాణాకు తరలించారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగిందని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మరోవైపు గాయపడిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తోటి విద్యార్థులు రహదారిపై ధర్నాకు దిగారు. కళాశాలకు వెళ్లే సమయంలో ఒకే బస్సు నడపడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం..



రాయపర్తి డిసెంబర్ 2 (వుదయం ప్రతినిధి ) : కౌలు రైతు కసరబోయిన రాజు కి ఒక లక్ష అరవై వేల రూపాయల బోనస్ జమ చేయబడింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం బోనస్ ఇచ్చి మా రైతు కుటుంబాలను ఆదుకున్నందుకు పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం మండలంలో తీర్మాలయపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి చిత్రపటాలకు రైతులు పాలభిషేకం చేశారు.

ఈ సందర్భంగా ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్ర బోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే ఎన్ని అవాంతరాలు వచ్చిన అమలు చేసి తీరుతుంది .రైతు భరోసా కూడా అమలు చేస్తుందని రైతులు ఎవరి మాయమాటలు నమ్మి మోసపోవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పాశం నరోత్తం రెడ్డి ,మచ్చ కుమారస్వామి ,గజవెల్లి రామశేఖర్ పారుపల్లి మధుసూదన్ రెడ్డి ,శిలా ఎల్లారెడ్డి, కొంక శీను, ముద్రబోయిన రమేష్ ,శిలా మధుసూదన్ రెడ్డి ఐకెపి సెంటర్ నిర్వాహకులు, గ్రామ రైతులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు




కరీంనగర్,డిసెంబర్02(వుదయం ప్రతినిధి) ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్ ఆధ్వర్యంలో వెలిచాల గ్రామం లోని ప్రశాంతి బాల బాలికల కేర్ గృహం ను సందర్శించి ఎయిడ్స్ వ్యాది కి గురైన బాల బాలికల కు భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుల గురించి, మరియు పిల్లలు బాల్యం నుంచే మంచి నడవడిక ను అలవర్చుకోవాలని, చక్కగా చదువుకొని క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని, వ్యాధిగ్రస్తులమని నిరుత్సాహపడకుండా ధైర్యంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిల్లలకి తెలిపారు ఈ సందర్భంగా వసతి గృహం లో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు ఇట్టి కార్యక్రమంలో ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు ఇట్టి కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్ తో పాటు వసతి గృహం నిర్వాహకులు సిరిల్ పాల్గొన్నారు

# ఘనంగా ఆరోగ్య ఉత్సవాలు,

## ప్రజాపాలన

### – ప్రజా విజయోత్సవాలు భాగంగా పాల్గొన్న నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ,



నాగర్ కర్నూల్ డిసెంబర్ 02(వుదయం ప్రతినిధి)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు,అందులో భాగంగా ఈ రోజు ఆరోగ్య దినోత్సవం కార్యక్రమం ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, హైదరాబాద్ నుండి వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ కాలేజీలు ప్రారంభించినారు.

నాగర్ కర్నూల్ ఉయ్యాలవాడ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ , మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాదేవి, నాగర్ కర్నూల్ డిఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, నాగర్ కర్నూల్ జర్నల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, వైద్య, నర్సింగ్ విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లాలో పారామెడికల్ కోర్సులను అందుబాటులోకి తేవడంతో జిల్లాలో విద్యార్థులకు లాభ సాటిగా ఉంటుందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంతగానో తోడ్పాటు అందుతుందని తెలిపారు.

ప్రజా విజయవత్సవాల్లో భాగంగా సోమవారం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగానే నాగర్ కర్నూల్ ప్రభుత్వ జర్నల్ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ట్రాన్స్ జెండర్లకు క్లినిక్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

# ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభను విజయవంతం చేయండి

## నూతన మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్ పిలుపు



కల్వకుర్తి నియోజకవర్గం డిసెంబర్02(వుదయం ప్రతినిధి): ఈనెల 4న బుధవారం రోజున ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆమనగల్లు మార్కెట్ కమిటీ యార్డులో ఉదయం 9.30 నిమిషాలకు కార్యక్రమం ప్రారంభం లిహాజరుకానున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు జూపల్లి కృష్ణారావు ఇన్చార్జి మినిస్టర్ దామోదర రాజనర్సింహ పార్లమెంట్ సభ్యులు మల్లురవి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులుముఖ్య అతిథులుగా సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్ల వంశీ చంద్ రెడ్డి పాల్గొననున్నారు నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల శ్రేణులు హాజరుకావాలని పిలుపుఆమనగల్లు ప్రభుత్వ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఈనెల 4న బుధవారం ఉదయం 9.30లకు ఆమనగల్లు మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పాటు చేస్తున్నట్లు నూతన మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్ తెలిపారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ యార్డులో ఉదయం 9.30లకు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామని ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు ఇంచార్జ్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పార్లమెంట్ సభ్యులు మల్లురవి %జఔజ% ప్రత్యేక ఆహ్వానితులు చల్ల వంశీ చంద్ రెడ్డి తదితర ప్రముఖులు, అధికారులు హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయా విభాగాల వారు పెద్ద ఎత్తున హాజరుకావాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఇదే ఆహ్వానంగా భావించి, కార్యకర్తలు నాయకులు పార్టీ శ్రేణులు రైతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అజీమ్ పిలుపునిచ్చారు.

స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాలతో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు..లిఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కిసాన్ సెల్ నాయకులు మోహన్ రెడ్డి డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్ టౌన్ అధ్యక్షులు రమేష్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు

# షబ్బీర్ అలీని కలిసిన పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్



నిజాంసాగర్, డిసెంబర్ 02 (వుదయం ప్రతినిధి): పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చీకోటి మనోజ్ కుమార్ సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలి ని కలిశారు. ఈ సందర్భంగా ఆయన షబ్బీర్ అలీని శాల్వా పుష్పగుచ్ఛంతో సన్మానించి పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ బాధ్యతలు తనకు వచ్చేలా సహకరించి ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు లక్షణంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.



# బిజినెస్



## ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీల చెలగాటం

దేశంలోని ప్రయివేటు వైద్య బీమా కంపెనీలు పాలసీదారులతో చెలగాటం అడుతోన్నాయి. బీమా ఇచ్చే సమయంలో క్యాష్‌లెస్, మొత్తం మేమే భరిస్తామని చెప్పుతూ పాలసీలు చేపిస్తున్నాయి. ఆ తర్వాత అనుకోని పరిస్థితుల్లో పాలసీదారు అనారోగ్యంతో హాస్పిటల్ పాలు అయితే చెల్లింపుల్లో కొసర్లు, కోతలు పెడుతున్నాయి. మొత్తం బిల్లింగ్‌లో 80 శాతం లోపే భరిస్తున్నాయి. మిగితా మొత్తం భారం పాలసీదారులపై పడేస్తున్నాయి. దేశంలోని 20 ప్రయివేటు వైద్య బీమా కంపెనీలు 2023లో 80 శాతం లోపే క్లయిమ్ మొత్తం చెల్లింపులు చేశాయి. అంటే హాస్పిటల్‌లో రూ.1 లక్ష బిల్లు అయితే కేవలం రూ.80వేలు మాత్రమే చెల్లించాయి. మిగితా రూ.20వేలు పాలసీదారు చెల్లించాల్సి వచ్చింది. వైద్య బీమా చెల్లింపులు, పరిష్కారాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు మెరుగైన పనితీరును కనబర్చాయి. గరిష్టంగా 98 శాతం మేర చెల్లింపులు చేసిన సంస్థలు ఉన్నాయి. ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబిఎఐ) రిపోర్ట్ ప్రకారం.. ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ మాత్రం ఏకంగా 98.74 శాతం మొత్తం చెల్లిస్తూ టాప్‌లో ఉండటం విశేషం. మరో పిఎస్‌యు ఓరియంటల్ ఇన్సూరెన్స్ కూడా సగటున 97.35 శాతం మొత్తాన్ని చెల్లించింది. ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో సగటున 71.35 శాతం మొత్తం క్లెయిమ్ చెల్లింపులు చేసింది. ఐసిఐసిఐ లంబార్డ్ 63.98 శాతం చెల్లించగా.. ఈ రంగంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న స్టార్ హెల్త్ మాత్రం 54.61 శాతం క్లెయిమ్ చెల్లింపులు చేయడం గమనార్హం. ఆరోగ్య బీమా వ్యాపారంలోని 29 బీమా సంస్థలలో కేవలం నాలుగు బీమా కంపెనీలు మాత్రమే 2023 సంవత్సరంలో 90 శాతం కంటే ఎక్కువ క్లెయిమ్ చెల్లింపు నిష్పత్తిని (క్లెయిమ్‌ల సంఖ్యపై) కలిగి ఉన్నాయి. దాదాపు పది బీమా సంస్థలు 80 శాతం కంటే తక్కువ క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లను కలిగి ఉన్నాయి.ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ క్లెయిమ్ చెల్లింపుల నిష్పత్తిలో 95.04 శాతంతో ముందంజలో ఉంది. ఆదిత్య బిర్లా హెల్త్ 94.52 శాతం, ఇఫ్కో టోకియో 91.70 శాతం, బజాజ్ అలియాంజ్ 90.29 శాతంతో క్లెయిమ్ చెల్లింపు నిష్పత్తులతో ముందు వరుసలో ఉన్నాయి. ప్రయివేటు బీమా కంపెనీలు క్లెయిమ్ చెల్లింపుల్లో 5-18 శాతం వరకు నిరాకరిస్తున్నాయి. 2022-23లో సాధారణ, ఆరోగ్య బీమా సంస్థలు 2.36 కోట్ల ఆరోగ్య బీమా క్లెయిమ్‌లను పరిష్కరించాయి.



## తాకట్టు చెరలో స్వర్ణం



ఎన్నో ఆశలు, సంతోషాలతో కొనుక్కునే స్వర్ణం తాకట్టు పడుతోంది. దేశంలో తగ్గిన ఆదాయాలు, భారీగా పెరిగిన ఖర్చులు పసిడి తనఖాకు దారితీస్తున్నాయి. ఏడాది కాలంలో అమాంతం పెరుగుతోన్న వ్యయాలను తట్టుకోవడానికి ప్రజలు ఉన్న బంగారాన్ని భారీగా కుదువ పెట్టేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గణాంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో పసిడి అప్పులు ఏకంగా 50.4 శాతం ఎగిసి రూ.1,54,282 కోట్లకు చేరాయి. 2024 మార్చి ముగింపు నాటికి ఈ రుణాల విలువ రూ.1,02,562 కోట్లుగా ఉంది. విద్య, వైద్యం, వ్యక్తిగత, వ్యవసాయ అవసరాలు తీర్చుకోవడానికి ప్రజలు బంగారం రుణాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీంతో బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సి)లు అన్ సెక్యూర్డ్ రుణాల కంటే సెక్యూర్డ్ రుణాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. పసిడి రుణాలకు డిమాండ్ పెరగడానికి ప్రజలు ఆర్థికంగా దెబ్బతినడమే ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఏడు నెలల్లో వ్యక్తిగత రుణాలు 5.6 శాతం పెరిగాయి. గృహ రుణాలు 12.1 శాతం పెరిగి రూ.28.7 లక్షల కోట్లకు చేరాయి. క్రెడిట్ కార్డులపై రుణాలు 9.2 శాతం పెరిగి రూ.2.81 లక్షల కోట్లకు చేరాయి. అన్‌సెక్యూర్డ్ రుణాలు 3.3 శాతం తగ్గాయి. తొలి ఏడు నెలల్లో బ్యాంక్ రుణాల జారీ 4.9 శాతం పెరిగి రూ.172.4 లక్షల కోట్లుగా నమోదైంది. రుణగ్రహీతలను కుదువ సంస్థలు మోసానికి గురిచేస్తుండటం, పసిడి విలువ నిర్ధారణలో లోపాలు, వేలంలో పారదర్శకత లేకపోవడం వంటి అంశాలు ఆర్‌బిఐ దృష్టికి వెళ్లాయి.

## నవంబర్‌లో రూపాయి అత్యంత పేలవం




తమ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. రూపాయి విలువను అమాంతం పెంచుతామని.. డాలర్‌కు సమానంగా రూపాయి విలువ చేస్తామని.. రూపాయి కరెన్సీల కోసం విదేశాలు లైన్ కట్టాలని నరేంద్ర మోడీ 2013లో చేసిన ప్రచార అర్భాటాలకు ప్రస్తుత పరిస్థితికి పొంతన లేకుండా పోయింది. ప్రస్తుత ఏడాది నవంబర్‌లో అయితే రూపాయి విలువ అత్యంత పేలవంగా నమోదయ్యింది.

ఈ ఒక్క నెలలోనే 0.5 శాతం విలువ కోల్పోయింది. అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం తర్వాత డాలర్ విలువ మరింత పెరగడం, భారత మార్కెట్ల నుంచి భారీగా విదేశీ పోర్ట్‌ఫోలియో నిధులు తరలిపోవడంతో గడిచిన ఎనిమిది నెలల్లో ఎప్పుడూ లేని స్థాయిలో రూపాయి విలువ పడిపోయింది. శుక్రవారం నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.48కు పరిమితమయ్యింది.

అక్టోబర్ ముగింపు నాటికి రూపాయి విలువ 82.71గా ఉంది. నరేంద్ర మోడీ ప్రధాని కాకముందు 2014లో డాలర్‌తో రూపాయి విలువ 60లోపే ఉండటం విశేషం.

## భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్




ధ్యాన్ చంద్ (1905, ఆగస్టు 29 %-% 1979, డిసెంబరు 3) సాటిలేని భారతీయ హాకీ ఆటగాడు. హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకడు. గోల్స్ చేయడంలో అద్భుత ప్రతిభ కనబరిచేవారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందిం చడంతో పాటు, ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. భారత దేశానికి హాకీలో స్వర్ణ యుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టారు. క్రీడారంగంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి ఖేల్ రత్న అవార్డు ఇస్తారని చాలా మందికి తెలుసు. ఈ ఖేల్ రత్న అవార్డు నిన్నటి దాకా రాజీవ్ ఖేల్ రత్నగా పిలవబడగా.. ధ్యాన్ చంద్ సేవలకు, దేశ భక్తికి గుర్తింపుగా దాని పేరు ధ్యాన్ చంద్ ఖేల్ రత్నగా కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మార్చింది.హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ పుట్టిన రోజునే దేశంలో జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపు కుంటు న్నారు. దేశానికి మూడు ఒలంపిక్స్ పతకాలు అందించిన ధ్యాన్ చంద్ గురించి నేటి తరానికి పెద్దగా తెలియక పోవచ్చు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి 1905 ఆగస్టు 29న ధ్యాన్‌చంద్ జన్మించారు. మెరుపు వేగంతో గేల్స్ చేయగల మాంత్రికుడిగా ఆయన క్రీడా చరిత్రలో సుస్థిర స్థానం సాధించారు. మైదానంలో పాదరసంలా కదిలిపోతూ బంతిని పూర్తిగా తన నియంత్రణలో ఉంచుకోవడంలో ఆయనకు ఎవరూ సాటిరారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందించడంతో పాటు,ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. 29 ఆగస్ట్ 1922న తన 17వ పుట్టినరోజున చంద్ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సిపాయిగా చేరాడు. ధ్యాన్‌చంద్ నేతృత్వంలో భారత పురుషుల హాకీ జట్టు మూడు సార్లు ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ పతకాలు సాధించింది. 1928 ఆమ్‌స్టర్ డామ్,1932 లాస్ ఏంజిలెస్,1936 బెర్లిన్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత్‌కు బంగారు పతకాలు అందించిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కింది. చంద్రుడి వెలుతురు లోనూ ఆయన ప్రాక్టీస్ చేసేవారు. అందుకే ఆయన్ను ముద్దుగా చంద్‌గా పిలిచేవారు.

1936నాటి ఒలంపిక్స్ సందర్భంగా బెర్లిన్‌లో పెద్ద ఎత్తున ధ్యాన్ చంద్ పోస్టర్లు వెలిశాయి. ధ్యాన్ చంద్ ఆట చూసేందుకు స్టేడియంకు రావాలంటూ ఆయన ఫ్యాన్స్ ఈ పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఆ ఒలంపిక్స్ హాకీ ఫైనల్ మ్యాచ్ లో భారత్ జర్మనీతో తలపడింది. ఆ ఫైనల్ మ్యాచ్ లో భారత్ 16-1 తేడాతో జర్మనీని మట్టి కరిపించింది. భారత్ పక్షాన ధ్యాన్ చంద్ 15 గోల్స్ చేసి చరిత్ర సృష్టించాడు. ఫైనల్స్‌లో ద్వితీయార్థంలో ధ్యాన్ చంద్..తన షూ, సాక్స్‌ను తీసేసి మ్యాచ్ ఆడారు. అయినా మూడు గోల్స్ సాధించి ఔరా అనిపించే ఆట ప్రదర్శించారు. ఆ సమయంలో స్టేడియంలో దాదాపుగా 25 వేల మంది ప్రేక్షకులతో పాటు గొప్ప నియంతగా పేరొందిన ఎడల్ఫ్ హిట్లర్ కూడా ఆ మ్యాచ్ ని తిలకించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం ధ్యాన్ చంద్ వద్దకి వచ్చిన హిట్లర్ తన సహచరులతో "అతడి హాకీ స్టిక్ విరగ్గొట్టి చూడండి.. అందులో తప్పకుండా ఏదో అయస్కాంతం ఉండి ఉంటుంది లేకపోతే ఇలా ఎలా ఆడతాడు" అని హాకీ స్టిక్ విరగ కొట్టగా ఎలాంటి అయస్కాంతమూ దొరకలేదు. దాంతో కంగుతిన్న హిట్లర్ అదేరోజు రాత్రి ధ్యాన్ చంద్ ని తన వద్దకు పిలిపించుకొని హాకీ ఆట కాకుండా నువ్వు ఏమేమి చేస్తావని ధ్యాన్ చంద్ ని అడగగా "నేను ఆర్మీలో సుబేదార్ గా పని చేస్తున్నానని సమాధానం ఇచ్చాడు. హిట్లర్ "ధ్యాన్ చంద్, నీ దేశము నీకేమిచ్చింది..? ఈరోజుకు నువ్వు కేవలం సుబేదార్ వి. జర్మనీ హాకీ జట్టు తరపున ఆడితే తక్షణమే నిన్ను ఎయిర్ ఫీల్డ్ మార్షల్ గా నియమిస్తానని చెప్తూతుండగా...తమరు ఎన్ని పదవులు ఇచ్చినా, ఎంత డబ్బు ఇచ్చిన నేను నా దేశానికి మాత్రమే ఆడుతాను. పరాయి దేశాలకోసం ఆడను.." అని తెగేసి చెప్పగానే హిట్లర్ నిర్ఘాంతపోయి తలదించు కున్నట్లు చెపుతారు.

ఒకసారి తను గోల్ వేసిన తరువాత అది పడకపోతే తను గోల్ వేసిన విధానం చూసి గోల్పోస్ట్ కొలతలు సరిచూడ వలసిందిగా అంపైర్ ను కోరగా అది సరియైన గుర్తింపుగా అందరి మన్ననలు పొందారు.

ఓ మ్యాచ్ సందర్భంగా ధ్యాన్ చంద్ ప్రత్యర్థులపై ఒక్క గోల్ కూడా చేయలేక పోయారు. గోల్ పోస్ట్ విషయంలో రిఫరీకి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పరిశీలనలో గోల్ పోస్ట్ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లు రుజువు అయింది. 1926 నుండి ఆయన 185 మ్యాచ్ ల్లో 570 గోల్స్ చేసి 1949 వరకు అంతర్జాతీయంగా ఆడారు. 2002లో ఢిల్లీలోని నేషనల్ స్టేడియంకు ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంగా నామకరణం చేశారు. అలాగే అలిఘడ్ ముస్లిం యూని వర్సిటీలోని ఓ హాస్టల్‌కు ఆయన పేరు పెట్టారు. లండన్‌లోని ఇండి యన్ జింకానా క్లబ్‌కు ధ్యాన్ చంద్ పేరు పెట్టారు. ధ్యాన్ చంద్ పేరిట పోస్టల్ స్టాంప్ విడుదల చేసి భారత ప్రభుత్వం గౌరవించింది. ఇప్పటి వరకు ఆ గౌరవాన్ని పొందిన ఏకైక భారత హాకీ క్రీడాకారుడు ఆయనే. 34 సంవత్సరాల సేవ తర్వాత, ఆయన 29 ఆగస్టు 1956న భారత సైన్యం నుండి లెఫ్టినెంట్ (యాక్టింగ్ కెప్టెన్ ) గా పదవీ విరమణ చేశారు . భారత ప్రభుత్వం అదే సంవత్సరం ధ్యాన్ చంద్ కు భారతదేశ మూడవ అత్యున్నత పౌర పురస్కా రమైన పద్మ భూషణ్‌తో సత్కరించింది.

## కూచిపూడి నాట్యానికి బందా ఎనలేని సేవలు



తెలుగు టాకీ తొలి తరానికి చెందిన సినిమా నటుడు బందా కనక లింగేశ్వరరావు. సుప్రసిద్ధ రంగస్థల, సినిమా నటుడు, ఆకాశవాణి, నాటక ప్రయోక్త, నాట్యకళా పోషకుడు, కూచిపూడి కళాక్షేత్ర వ్యవస్థాపకుడు అయిన బందా కనకలింగేశ్వరరావు (జనవరి 20, 1907- డిసెంబరు 3, 1968 కృష్ణా జిల్లాలోని ఆటపాక గ్రామంలో జన్మించాడు. ఆటపాకలో ప్రాథమిక విద్యాభ్యాసం, అనంతరం బందరు నోబుల్ కళాశాలలో చదివి, మద్రాసు లా కళాశాల నుండి 1932 లో బి.ఎల్. పట్టా పుచ్చు కున్నాడు. 1934లో మొదట న్యాయవాదిగా పనిచేసి, తరువాతి కాలంలో నాటక ప్రదర్శనమే వృత్తిగా చేసుకున్నారు. నాటకాలలో తనకు అత్యంత ఇష్టమైన బాహుకుడు, బిల్వమంగళుడు లతో పాటు, అనేక పాత్రలు పోషించాడు. అయన ఏలూరులో 1938లో నాటక కళాశాలను స్థాపించి పలువురు నటులకు శిక్షణ ఇచ్చాడు. ప్రభాత్ థియేటర్ అనే సంస్థను స్థాపించి నాటక ప్రయోక్తగా నూతన ప్రదర్శన రీతులను ప్రవేశపెట్టాడు. తెలుగు సినిమా ప్రపంచంలో మొదటి తరం సినిమాలైన...సారంగధర (1937 సినిమా), బాల నాగమ్మ, ద్రౌపదీ మాన సంరక్షణం, పాదుకా పట్టాభిషేకం (1945 సినిమా) తదితర సినిమాలలో నటించాడు. కూచిపూడి నాట్యకళకు ఎనలేని సేవచేశాడు. ప్రభుత్వ సాయంతో కూచిపూడి గ్రామంలో సిద్ధేంద్ర కళాక్షేత్రం నెలకొల్పి నిర్వహించాడు. కూచిపూడి నాట్య కళ గురించి ప్రముఖ పత్రికలలో వ్యాసాలు రాసి దాని ప్రాధాన్యాన్ని అందరికీ తెలియ జేశాడు.1956 లో ఆకాశవాణిలో నాటక ప్రయోక్తగా పనిచేసి వివిధ నాటకాలను, నాటికలను ప్రసారం చేశాడు. ఆటపాక గ్రామంలో ఒక శివాలయాన్ని, ఒక చెరువును తవ్వించడమే కాకుండా ఒక వేద పాఠశాలను కూడా స్థాపించాడు. ఆయన 1964 లో "కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు"ను పొందాడు. ఉత్తమ నటనకు "రాష్ట్రపతి అవార్డు" లభించింది. ఆయనకు ఏడుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన జన్మ శతాబ్ది ఉత్సవాలను హైదరాబాదులో 2006-07 సంవత్సరాలలో ఘనంగా నిర్వహించారు.

## దారితప్పిన సరోగసీ

సరోగసీ ఒక వ్యాపారంగా విస్తరిస్తోందన్నది బహిరంగ రహస్యమే. ఆధునిక జీవనశైలిలో అనేక మార్పులు రావడం, ఒత్తిళ్లు పెరగడంతో ఆ ప్రభావం యువతను అనేక విధాలుగా వేధిస్తోంది. సంపాదనలో భార్యాభర్తలు ఇద్దరూ నిమగ్నం కావడంతో అప్పుడే సంతానం అక్కరలేదని సరిపెట్టుకొంటున్నారు. కొన్నేళ్ల తరువాత సంతానం పొందాలనుకొనే ఆకాంక్ష కలిగినా సంతాన సాఫల్యం కలగని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దాంతో సంతాన రహితులైన స్వదేశీయులే కాదు విదేశాల్లో ఉన్న ప్రవాస భారతీయులు కూడా కొన్ని లక్షల రూపాయల పెట్టుబడితో ప్రత్యామ్నాయంగా అద్దె గర్భాలను కుదుర్చుకుని సంతానం పొందడానికి తాపత్రయపడడం పరిపాటి అయింది. అయితే ఇది ఫక్కా వాణిజ్యంగా రూపాంతరం చెందుతోంది. ఎన్ని నిబంధనలున్నా దీనిని నియంత్రించడం కష్టసాధ్యమవుతోంది. ఈ చాటుమాటు వ్యవహారాలు, విషాద సంఘటనలు దేశంలో అక్కడక్కడ జరుగుతున్నా అంతగా బయటపడడం లేదు. రెండు రోజుల క్రితం తెలంగాణలోని రాయదుర్గంలో సరోగసీ గర్భధారిణి నిర్బంధానికి గురై, లైంగిక వేధింపులు భరించలేక తొమ్మిదో అంతస్థు నుంచి దూకి బలవన్మరణానికి బలైపోవడం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. సరోగసీ తెలంగాణలో చాపకింద నీరులా సాగుతోందనడానికి ఈ విషాద సంఘటన సాక్షమవుతోంది. సరోగసీలో నిబంధనల ప్రకారం సమీప బంధువుల నుంచి మాత్రమే అద్దెగర్భం ప్రక్రియలో సంతానాన్ని పొందవలసి ఉంటుంది. కానీ నిబంధనలు ఏవీ పాటించకుండా నిరుపేద మహిళలకు కొంత నగదు ముట్టజెప్పి పిల్లలను ప్రసవింప చేసుకోగలుగుతున్నారు. కొన్ని సాఫల్య కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులు ఈ అద్దెగర్భాల ప్రక్రియను భారీ వాణిజ్య రాకెట్‌గా సాగిస్తున్నాయి. సరోగసీ ద్వారా సంతానం పొందాలనుకుంటే కొన్ని నిబంధనలు చట్టంలో రూపొందించారు. దంపతులకు పెళ్లయి ఐదేళ్లు నిండాలి. వీరికి గతంలో పిల్లలు కానీ, దత్తత తీసుకున్న సంతానం కానీ ఉండకూడదు. భర్తకు 26 55, భార్యకు 25 50 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. దంపతుల్లో ఒకరికి సంతాన వైఫల్యం సమస్య ఉన్నట్టు జిల్లా మెడికల్ బోర్డు ధ్రువపత్రం అవసరం. జన్మించిన బిడ్డ సంరక్షణ హక్కులకు మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోవాలి. గర్భాన్ని అద్దెకిచ్చే మహిళ వివాహితురాలై ఉండడమే కాదు, ఒక బిడ్డకు జన్మనిచ్చి ఉండాలి. ఒకసారి మాత్రమే అద్దెగర్భం పొందే అవకాశం ఉంటుంది. అదీ సమీప బంధువులకు మాత్రమే ఇవ్వాలి. ప్రసవానంతరం ఆ మహిళకు 16 నెలల బీమా సౌకర్యం కల్పించాలి. ఇన్ని నిబంధనలు ఉన్నా ఇవేవీ పట్టించుకోకుండా దళారీ వ్యవస్థ ద్వారా అద్దె గర్భాలను కుదుర్చుకుంటున్నారు. ఒకప్పుడు హైదరాబాద్, విజయవాడ కేంద్రాలుగా సాగిన సరోగసీ వ్యవహారం రానురాను తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు కూడా ప్రాకింది. ఐదేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో సరోగసీ దందా వెలుగు చూసింది. పేద గిరిజన మహిళలకు లక్షల రూపాయలు ఆశ చూపి వారిని పావులుగా వాడుకున్నారు. భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సరోగసీ కోసం సుమారు 100 మంది మహిళలను గుట్టుగా ఉంచగా, ఓ మహిళ బయటపడడంతో ఆ వ్యవహారమంతా వెలుగులోకి వచ్చింది. చిన్న వయసులో వివాహాలు జరిగి పిల్లలు పుట్టిన యువతులను సరోగసీకి ఎంపిక చేసుకుంటున్నారు. వారికి తొలుత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆ తర్వాత సరోగసీకి బలవంతంగా ఒప్పిస్తున్నారు. అయితే ఇది వికటించి కొందరు మహిళలు అనారోగ్యానికి గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. బలవంతంగా వివాహితలను ఈ రొంపిలోకి లాగినట్టు కొన్ని కేసులు కూడా పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయి. థాయ్‌లాండ్, నేపాల్, మెక్సికో, కంబోడియాలతోపాటు భారత దేశం కూడా సరోగసీని నిషేధించిన తరువాత ఉక్రెయిన్, జార్జియా, లావోస్, మలేసియా, అర్జెంటీనా, కొలంబియా, నైజీరియా, కెన్యా, దక్షిణాఫ్రికా వంటి దేశాలకు సరోగసీ మార్కెట్ విస్తరించింది. భారత దేశంలో 2010లో సరోగసీ నియంత్రణ ముసాయిదా బిల్లు తయారైంది. 2019 లో సరోగసీ నిషేధ చట్టాన్ని లోక్‌సభ ఆమోదించింది. 2021లో సరోగసీ (నియంత్రణ) చట్టం ఆమోదం పొందింది. అంతవరకు భారతదేశం ప్రముఖ సరోగసీ గమ్యస్థానంగా ఉండేది. అనైతిక విధానాలు సాగేవి. అద్దె తల్లుల ఒప్పందాలు తక్కువ ఖర్చుతో సులువుగా జరిగేవి. విదేశాల్లో ఉండే సంతాన యోగం లేని వారు భారత దేశానికి వచ్చి అద్దె తల్లుల ద్వారా సంతానాన్ని సులువుగా పొందగలిగే వారు. 2009లో గుజరాత్‌లో 45 మంది సరోగసీ తల్లులను అధ్యయనం చేయగా, సంతానం పొందాలనుకున్న తల్లిదండ్రుల్లో 41% మంది విదేశాల నుంచి వచ్చారని తేలింది. అద్దె తల్లులు కావాలనుకునే మహిళలు తాము తీసుకునే రిస్కుకు తగినట్టు పారితోషికం చెల్లించాలన్న డిమాండ్ ఆయా కుటుంబాల నుంచి ఎక్కువగా తెరపైకి వచ్చింది. ఈ విషయంలో స్వదేశీయులు కన్నా విదేశాల నుంచి వచ్చిన తల్లిదండ్రులే ఎక్కువగా చెల్లిస్తున్నారు.ప్రస్తుతం భారత ప్రభుత్వం పరోపకార సరోగసీని మాత్రమే నిబంధనల ప్రకారం అనుమతిస్తుంది. ఇందులో వాణిజ్యపరంగా ఆర్థిక లావాదేవీలు వంటివి ఉండకూడదు. ఇది చట్టబద్ధంగా వివాహం చేసుకున్న సంతానం లేని దంపతులకు మాత్రమే పరిమితం చేయబడింది. కానీ ఇప్పుడు కేవలం ధనార్జనే ధ్యేయంగా అమాయకులైన యువతులను పావులుగా దళారులు వాడుకుంటున్నారు. అందుకనే ఈ సరోగసీ రాకెట్‌లో ఇరుక్కున్న మహిళలకు స్వేచ్ఛలేక, ఆరోగ్య భద్రత లేక వారి భవిష్యత్ విషాద గాథలుగా మిగిలిపోతున్నాయి.

# జాతీయం - అంతర్జాతీయం

## ఆదివాసీల హక్కులపై ముప్పేట దాడి



న్యూఢిల్లీ: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వినాశకర విధానాలతో ఆదివాసీల హక్కులపై ముప్పేట దాడి జరుగుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ, రిజర్వేషన్ల కుదింపు, మినహాయింపు చర్యల వల్ల ఆదివాసీలు, ఇతర అణగారిన తరగతులకు చెందిన ప్రజలు ఉద్యోగాలకు, ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారని చెప్పారు. ఆదివారం స్థానిక హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం), సెంటర్ ఫర్ ఆదివాసీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. ఆదివాసులను ఉద్యోగాల నుండి దూరం చేస్తున్నారన్న అంశంపై ఎఎఆర్ఎం ఛైర్మన్ జితేంద్ర చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి వందలాది మంది గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బృందాకరత్ మాట్లాడుతూ మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచి ఆదివాసీ హక్కులు, ఉద్యోగాలపై దాడికి పూనుకుందని విమర్శించారు. అలాగే ఆదివాసుల భూములను అక్రమంగా గుంజుకొని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. దీంతో అటవీ సంపదపైనా కార్పొరేట్ కంపెనీలు పెత్తనం సాగిస్తున్నాయని చెప్పారు. వీటిపై ఎఎఆర్ఎం పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.


కేంద్రంలోని బిజెపి విధానాల వల్ల ఆదివాసీ యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాలకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాల ప్రయివేటీకరణ, వివిధ మినహాయింపులతో ప్రభుత్వ ఉద్యోగాల నుంచి ఆదివాసీలను దూరం చేస్తున్న తీరుపై సదస్సులో డేటాను ప్రదర్శించారు.

ఈ డేటాను ప్రస్తావిస్తూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల హక్కును కూడా మోడీ సర్కార్ నీరుగారుస్తోందని తెలిపారు.

## మోడీ హయాంలో మైనార్టీలపై పెరిగిన దాడులు



న్యూఢిల్లీ: భారత్‌లో నరేంద్ర మోడీ పాలనలో మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని జర్మనీ మాజీ చాన్సలర్ ఏంజెలా మెర్కెల్ విమర్శించారు. ఇటీవల విడుదల చేసిన ఫ్రీడమ్ మెమరీస్ (1951–2021) పుస్తకంలో మెర్కెల్ ఈ విషయాన్ని పేర్కొన్నారు. హిందూత్వ మూకలు ఇతర మతాలకు చెందిన వారిని మరీ ముఖ్యంగా క్రైస్తవులను, ముస్లింలను టార్గెట్‌గా పెట్టుకుని దాడులకు దిగడాన్ని ఆమె ప్రస్తావించారు. 2015 ఏప్రిల్‌లో జర్మనీ పర్యటనకు వచ్చిన మోడీతో జరిపిన సమావేశంలో ఇదే అంశాన్ని తాను లేవనెత్తానని, అయితే, మోడీ దానిని తీవ్రంగా తోసిపుచ్చారని అన్నారు. . తన ఆరోపణలను మోడీ తోసిపుచ్చినప్పటికీ వాస్తవ పరిస్థితి వేరుగా ఉందన్నారు. భారత్‌లో మత స్వేచ్ఛపై తన ఆందోళనలు అలాగే మిగిలిపోయాయని మెర్కెల్ పేర్కొన్నారు. ఏ ప్రజాస్వామ్యానికైనా కీలకం మత స్వేచ్ఛ అని ఆమె నొక్కిచెప్పారు. 2015 ఏప్రిల్‌లో జర్మనీలో మోడీతో తన మొదటి సమావేశాన్ని మెర్కెల్ వివరిస్తూ, 'ఆయనకు.(మోడీకి) విజువల్ ఎఫెక్టు అంటే మోజు ఎక్కువ ' అని పేర్కొన్నారు. మోడీ తన ఎన్నికల ప్రచారం గురించి ఆమెతో మాట్లాడుతూ, 'తాను స్టూడియోలో మాట్లాడిన విషయాన్ని, తన చిత్రాన్ని 50కిపైగా ప్రదేశాల్లో 'హెూలోగ్రామ్' గా ప్రదర్శించారు. 2014 సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో మోడీ హెూలోగ్రామ్‌ను ఎక్కువగా ఉపయోగించారని ఆమె పేర్కొన్నారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో తన సమావేశాన్ని గురించి మెర్కెల్ వివరించారు. విస్తృత స్థాయి ప్రపంచ అనుభవం కలిగిన ఆర్థిక వేత్త భారత దేశ ' మొట్టమొదటి హిందువేతర ప్రధాని ' అంటూ మన్మోహన్ సింగ్‌ను ఆమె అభివర్ణించారు. భారత దేశంలో అప్పటికి ఉన్న 120 కోట్ల జనాభాలో మూడింట రెండొంతుల మంది జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వీటి గురించే ఆయన ఎక్కువగా మాట్లాడారు.



## తైవాన్‌కు ఆయుధాలిస్తే ప్రతిఘటన తప్పదు

బీజింగ్: తైవాన్ ప్రాంతానికి 38,5 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలను అమ్మాలన్న అమెరికా నిర్ణయంపై చైనా తీవ్రంగా స్పందించింది. తైవాన్‌కు ఆయుధాలిస్తే తాము గట్టి ప్రతిఘటన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి ఆదివారం స్పష్టం చేశారు. తైవాన్‌కు ఎఫ్–16 యుద్ధ విమానాలు, ఎలక్ట్రానికల్ స్కాన్డ్ ఎరే రాడార్లు, వాటి విడి భాగాలు, ఇతర ఆయుధాలను విక్రయించాలని నిర్ణయించినట్లు అమెరికా రక్షణ శాఖ గత శుక్రవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం ఒకే చైనా అన్న సూత్రాన్ని, అలాగే అమెరికా– చైనా సంయుక్త ప్రకటనలను మరీ ముఖ్యంగా 1982 ఆగస్టు17 నాటి ప్రకటనను బాహాటంగా ఉల్లంఘించడమేనని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి విమర్శించారు. అంతేకాదు, అంతర్జాతీయ చట్టాన్ని కూడా అతిక్రమించడమేనని అన్నారు. తైవాన్ స్వాతంత్ర్యాన్ని సమర్థించబోమన్న ప్రకటిత వైఖరికి అమెరికా కట్టుబడకుండా అవకాశవాదంతో వ్యవహరిస్తోందని చైనా ఆరోపించింది. తైవాన్‌కు ఆయుధాల అమ్మకాన్ని తక్షణమే ఆపేయాలని చైనా కోరింది.

## యువతులు, బాలికల్లో అధికంగా హెచ్ఐవి ఇన్ఫెక్షన్లు !

న్యూయార్క్ : యువతులు, బాలికల్లో గతేడాది అత్యధికంగా హెచ్ఐవి ఇన్ఫెక్షన్లు సోకడం పట్ల ఐక్యరాజ్య సమితి బాలల నిధి (యునిసెఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. వారికి చికిత్స అందుబాటులో వుండడం లేదని, పైగా ఈ ఇన్ఫెక్షన్లు సోకకుండా ముందస్తు నివారణ చర్యలు కూడా లేవని హెచ్చరించింది. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యునిసెఫ్ ఒక నివేదికను విడుదల చేసింది. 2023లో 15 నుండి 19ఏళ్ళ లోపు వయస్సు గల వారిలో 96 వేల మంది బాలికలకు, 41 వేల మంది బాలురకు హెచ్ఐవి సోకిందని ఆ నివేదిక పేర్కొంది. అంటే యుక్త వయస్సుకు వచ్చిన బాలికల్లో ప్రతి 10 మందిలో ఏడుగురు ఈ మహమ్మారి బారిన పడుతున్నారని ఆందోళన వెలిబుచ్చింది. సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలో, ఈ సంఖ్య ప్రతి పది మందిలో 9గా వుంది. 2023లో దాదాపు 13 లక్షల మంది ఈ వ్యాధి బారిన పడ్డారని యుఎన్ఎయిడ్స్ సంస్థ ఒక నివేదికలో పేర్కొంది. వారిలో ఎయిడ్స్ కారణాలతో 6.3 లక్షల మంది మరణించారని తెలిపింది. 2030 కల్లా ప్రజారోగ్యానికి ముప్పుగా వున్న ఎయిడ్స్‌ను నిర్మూలించాలన్న ఐక్యరాజ్య సమితి లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన దాని కన్నా మూడు రెట్లు ఎక్కువ మంది ఈ వ్యాధి బారిన పడ్డారని యునిసెఫ్ అసోసియేట్ డైరెక్టర్ అనురిత బెయిన్స్ తెలిపారు.

## గాజాలో మారణహెూమం

ఇజ్రాయిల్ మాజీ రక్షణ మంత్రి జెరూసలేం : గాజాలో ఇజ్రాయిల్ చర్యలను యుద్ధ నేరాలు, మారణహెూమంగా ఇజ్రాయిల్ మాజీ రక్షణ మంత్రి మోషే యాలోన్ పేర్కొన్నారు. మోషే యాలోన్ ఇజ్రాయెల్ మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తర గాజా నుండి పాలస్తీనియన్లను బహిష్కరించాలని, అక్కడ యూదుల స్థావరాలను పునరుద్ధరించాలని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరియు తీవ్రవాదులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మోషే యాలోన్ 2013–16 నుండి నెతన్యాహు ఆధ్వర్యంలో రక్షణ మంత్రిగా పనిచేశారు. యాలోన్ అప్పటి నుంచి నెతన్యాహుపై తీవ్ర విమర్శకుడిగా ఉన్నారు. గత నెలలో, నెతన్యాహు, అతని మాజీ డిఫెన్స్ చీఫ్ యోవ్ గాలంట్‌లకు గాజా వివాదంలో యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాల ఆరోపణలపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ (ఐసిసి) అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఏడాదికి పైగా గాజాలో ఇజ్రాయిల్ తీవ్ర మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోంది. మహిళలు, పిల్లలను చంపడం, గాజా నివాసులకు ఆహారాన్ని అందించే వరల్డ్ సెంట్రల్ కిచెన్ కార్మికులపై బాంబులు వేయడం వంటి అనేక యుద్ధ నేరాలకు ఇజ్రాయిల్ పాల్పడుతోంది.

## భోపాల్ విషాదంపై ముందే హెచ్చరించిన న్యాయవాది !




భోఫాల్ : నలభై ఏళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లో జరిగిన దుర్ఘటన గురించి ఒక న్యాయవాది ముందే హెచ్చరించారు. భోపాల్‌ని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుంచి వెలువడిన విషవాయువులు పెను విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. అయితే, ఆ ఘటనకు సంబంధించిన పలు కీలక విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఫ్యాక్టరీ నుంచి విషవాయువులు వెలువడుతున్నాయని, దాన్ని మూసివేయాలని ఘటనకు ముందే నోటీసులు పంపినట్లు షానవాజ్ ఖాన్ (75) అనే న్యాయవాది తెలిపారు. అయితే, ఈ హెచ్చరికలను ఫ్యాక్టరీ యాజమాన్యం కొట్టిపారేసిందని వెల్లడించారు. 1983 మార్చి 4న యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెట్‌కు షానవాజ్ లీగల్ నోటీసులు పంపారట. 'ప్లాంట్ జనావాసాల మధ్య ఉంది. దీని నుంచి వెలువడుతున్న విషపూరిత వాయువులు, రసాయనాల నిల్వలతో సమీప కాలనీలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే 50 వేల మంది ప్రాణాలకు హాని కలుగుతుంది.


15 రోజుల్లోపు మీ ఫ్యాక్టరీలో విషవాయువులు, ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని నిలిపివేయాలి.

లేని పక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి ఉంటుంది' అని తాను నోటీసులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. 1981లో ఆ ఫ్యాక్టరీలో పనిచేసే ఓ కార్మికుడు విషవాయువు లీకవడంతో మృది చెందారని ఖాన్ తెలిపారు. ఆ తర్వాత అక్కడ పలు మార్లు ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంతో స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని వెల్లడించారు.

ఈ క్రమంలోనే తాను యూసీఐఎల్‌కి లీగల్ నోటీసులు పంపించానన్నారు. అయితే, వాటిని యూసీఐఎల్ కొట్టిపారేసిందని ఖాన్ తెలిపారు.

భోపాల్‌లో 1984 డిసెంబర్ 2న అర్ధరాత్రి విష వాయువులు లీక్అయిన దుర్ఘటనలో 3,787 మంది ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 5లక్షల మంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దాని బాధితులు ఇంకా న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారు.

## ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ తన సన్నిహితుడు కాష్ పటేల్ (కశ్యప్ పటేల్)ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్‌గా శనివారం ఎంపిక చేశారు. తన యంత్రాంగంలో పలువురు భారత సంతతికి చెందిన వ్యక్తులకు కీలక పదవులను కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. "ఎఫ్‌బిఐ తదుపరి డైరెక్టర్‌గా కాష్ (కశ్యప్) పటేల్‌ను ఎంపిక చేసినందుకు నేను గర్విస్తున్నాను. గొప్ప న్యాయవాది, పరిశోధకులు, అమెరికా మొదటి పోరాట యోధుడు. అమెరికా ప్రజల కోసం తన వృత్తిని అంకితం చేశారు" అని ట్రంప్ సొంత సోషల్‌మీడియా 'ట్రూత్'లో పోస్ట్ చేశారు. గతంలో ట్రంప్ ప్రభుత్వంలో అమెరికా తాత్కాలిక రక్షణ కార్యదర్శి చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశారు. నేషనల్ ఇంటెలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఉగ్రవాదం) సీనియర్ డైరెక్టర్‌గా పనిచేశారు. న్యూయార్క్‌లో జన్మించిన కశ్యప్‌కు గుజరాత్ మూలాలున్నాయి. ఆయనతల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాకు చెందినవారు. తల్లి టాంజానియా, తండ్రి ఉగాండాకు చెందినవారు. 1970లో కెనడా నుండి అమెరికాకు వలస వచ్చారు. న్యూయార్క్‌లో జన్మించిన కశ్యప్ యూనివర్శిటీ ఆఫ్ రిచ్‌మాండ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, యూనివర్శిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. మియామీ కోర్టులో పబ్లిక్ డిఫెండర్‌గా పనిచేసి వివిధ హెూదాల్లో సేవలందించారు.

## ఫుట్‌బాల్ మ్యాచ్‌లో అభిమానుల మధ్య ఘర్షణ..



పశ్చిమాఫ్రికా దేశం గినియాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. గినియాలోని రెండవ అతిపెద్ద నగరమైన ఎన్‌జెరెకోర్‌లో ఆదివారం ఫుట్‌బాల్ మ్యాచ్‌లో అభిమానుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాల అభిమానులు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో దాదాపు 100 మందికి పైగా మరణించినట్లు తెలుస్తోంది. రిఫరీ వివాదాస్పద నిర్ణయంతో ఇరువర్గాల ఫ్యాన్స్ రెచ్చిపోయారు. అనంతరం స్టేడియం బయటకు వచ్చి కొట్టుకున్నారు. దీంతో వీధుల్లో మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అంతేకాదు.. స్థానిక పోలీస్ స్టేషన్ కు నిప్పు పెట్టారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో భారీగా రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ దాడుల్లో మందలమంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఇక, మృతదేహాలతో ఆస్పత్రి నిండిపోయిందని ఓ డాక్టర్ మీడియాకు వెల్లడించాడు. అభిమానులు దాడులు చేసుకున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన స్థానిక పోలీసులు రద్యాప్తు చేపట్టారు.

## భారత్ సహా బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

అంతర్జాతీయ వర్తకంలో డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. డాలర్‌ను దూరం పెట్టే ప్రయత్నాలు చేసే దేశాలు అమెరికాతో వర్తకానికి కూడా దూరం కావలిందేనని ట్రంప్ 'ట్రూత్ స్పెషల్' పోస్ట్‌లో హెచ్చరించారు. ట్రంప్ ఈ మేరకు బ్రిక్స్ దేశాలు భారత్, బ్రెజిల్, చైనా, రష్యా. దక్షిణాఫ్రికాలకు నేరుగా హెచ్చరిక జారీ చేశారు. అంతర్జాతీయ లావాదేవీలకు డాలర్ స్థానంలో మరొక కరెన్సీ ఉపయోగించాలని బ్రిక్స్ దేశాలు ఇటీవల నిర్ణయించాయి.దీనిపై ట్రంప్ స్పందిస్తూ, డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు. డాలర్ స్థానంలో వేరే కరెన్సీ ఉపయోగించే దేశాలపై పన్నులు పెంచుతామని ఆయన తెలిపారు. అమెరికాకు ఆయా దేశాలు ఉత్పత్తి చేసే వస్తువులపై 100 శాతం పన్నులు పెంచుతామని ట్రంప్ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాల యత్నాలను తాము ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటామని, డాలర్‌కు దూరంగా జరిగే దేశాలకు అమెరికా ఆర్థిక వ్యవస్థలో చోటు ఉండదని ఆయన హెచ్చరించారు. అమెరికాకు ఎగుమతుల విషయం మరచిపోవలసి వస్తుందని ట్రంప్ సూచించారు. కాగా, అక్టోబర్ రష్యాలోని కజన్‌లో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సులో అంతర్జాతీయ లావాదేవీల్లో డాలర్‌కు బదులు స్థానిక కరెన్సీ ఉపయోగించాలని అవి నిర్ణయించాయి. దీని వల్ల స్థానిక కరెన్సీ బలోపేతం అవుతుందని అవి అభిప్రాయం వ్యక్తం చేశాయి.

## మెషిన్ ఫ్రీక్వెన్సీ మార్పుతో ఇవిఎంల హ్యాక్

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం)లను మెషిన్ ఫ్రీక్వెన్సీలను సవరించడం ద్వారా హ్యాక్ చేయవచ్చునని ముంబయికి చెందిన సయ్యద్ షుజా అనే వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం ఇటీవల తీవ్ర కలకలం రేపింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇవింఎలను హ్యాక్ చేయడంతో పాటు తాను ట్యాంపరింగ్ కూడా చేయగలనని సయ్యద్ పోస్టు చేసిన వీడియోలో పేర్కొన్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇవిఎంలపై తప్పుడు వాదనలు చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు చేయడంతో ముంబయి సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారని ఇసి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 2019లోనూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అతడిపై ఢిల్లీలో కేసు నమోదైనట్లు పేర్కొంది. ప్రస్తుతం అతడు విదేశాల్లో ఉన్నట్లు తెలిపింది.




## ఇటలీలో కార్మికవర్గం కన్నెర్ర

రోమ్: ఇటలీలో కార్మిక వర్గం అపూర్వమైన సమ్మె చేసింది. పచ్చి మితవాది మెలోనియా ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా ఇటలీలోని కార్మిక సంఘాలన్నీ కలసి శుక్రవారం 8 గంటల సార్వత్రిక సమ్మె చేశాయి. వేలాది మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె వల్ల దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు స్తంభించిపోయాయి. స్కూల్స్, ఆస్పత్రులు, స్థానిక రవాణాకు తీవ్ర అంతరాయమేర్పడింది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుండడం, తక్కువ వేతనాలు, ప్రజా సేవలను నిర్వీర్యం చేయడం వంటి చర్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. దేశంలో వేతనాలు తక్కువగా ఉండడం వల్ల చాలా మంది ఇతర దేశాలకు వెళ్లిపోతున్నారని, దీని వల్ల హెల్త్ కేర్ సెక్టార్‌లో నర్సుల కొరత తీవ్రంగా ఉందని రోమ్‌కు చెందిన కార్యకర్త అన్నా సల్సా చెప్పారు. సిబ్బంది తక్కువగా ఉన్నారని ఒకరికి రోజుకు రెండు మూడు షిఫ్టులు వేస్తున్నారని అన్నారు.



# చక్కని ఆరోగ్యం



## చలికాలంలో రోజుకెన్ని గ్లాసుల నీళ్లు తాగాలి?

శీతాకాలంలో చల్లని వాతావరణం కారణంగా దాహంగా అనిపించదు. దీంతో చాలా మంది తగినంతగా నీళ్ల తాగరు. ఇలా చేయడం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. చలిగాలుల కారణంగా దాహంగా అనిపించదు. దీంతో చాలా మంది నీళ్లు తాగాల్సిన అవసరం లేదని అనుకుంటారు. కానీ శీతాకాలంలో కూడా శరీరానికి నీరు చాలా అవసరం. శరీరంలో నీటిశాతం తగ్గిపోతే ఏదో ఒక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అందుచేత చలి కాలంలో తీసుకునే ఆహారం నుంచి మనం తాగే నీటి పరిమాణం వరకు ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. ఉదయం నుంచి రాత్రి వరకు రోజంతా నీళ్ల తాగడం అలవాటు చేసుకోవాలి. చలికాలంలో దాహం వేయకపోయినా రోజుకు కనీసం 8 నుండి 10 గ్లాసుల నీరు తాగాలి. శారీరక శ్రమ ఎక్కువగా ఉండే పురుషులు రోజుకు 10 నుంచి 14 గ్లాసుల నీరు, మహిళలు 8 నుంచి 12 గ్లాసుల నీరు తాగాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా నీళ్లకు బదులు జ్యూస్, పాలు, టీ, కొబ్బరి నీళ్లు కూడా తాగవచ్చు. దీని వల్ల శరీరం డీహైడ్రేషన్ కు గురికాకుండా ఉంటుందని, తద్వారా రకరకాల అనారోగ్య సమస్యలు దరిచేరవని వైద్యులు చెబుతున్నారు. ఊబకాయం సమస్య తక్కువ నీరు తాగడం వల్ల ఊబకాయం వచ్చే ప్రమాదం ఉంది. మనం రోజుకు ఎంత ఆహారం తీసుకుంటామో.. దానిని బట్టి శరీరానికి అవసరమైనంత నీరు తాగాలి. లేదంటే తినే ఆహారం జీర్ణం కాదు. ఇది స్థూలకాయానికి దారితీస్తుంది.

## విటమిన్ డీ..
### తక్కువే కాదు, ఎక్కువైనా ప్రమాదమే



శరీరానికి సరిపడ విటమిన్ డీ లభించకపోతే ఇబ్బందులు తప్పవని తెలిసిందే. అందుకే కచ్చితంగా శరీరానికి సరిపడ విటమిన్ అందేలా చూసుకోవాలని సూచిస్తుంటారు. అయితే విటమిన్ డీ లభించకపోతే నష్టాలు ఉన్నాయన్నదాంట్లో ఎంత వరకు నిజం ఉందో.. విటమిన్ ఎక్కువైనా ఇబ్బందులు తప్పవని నిపుణులు చెబుతున్నారు. శరీరానికి సహజంగా లభించే విటమిన్స్‌లో విటమిన్ డీ ఒకటి. ఎక్కువ సమయం ఏసీల్లో గడపడం, సూర్యరశ్మి ఇంట్లోకి రాని అగ్గిపెట్టెల్లాంటి అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తుండడం వల్ల చాలా మంది విటమిన్ డీ లోపంతో బాధపడుతున్నారు. దీంతో కీళ్ల నొప్పులు మొదలు, హృదయ సంబంధిత సమస్యలు చివరికి మానసిక సమస్యలకు సైతం విటమిన్ డీ లోపం కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల విటమిన్‌డి లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే విటమిన్ డీ లోపం ఉందని నిర్ధారించుకోకుండానే కొందరు సప్లిమెంటరీ ట్యాబ్‌లెట్స్‌ను వాడుతున్నారు. అయితే శరీరంలో విటమిన్ డీ తక్కువైతే సమస్యలు ఉంటాయన్నదాంట్లో ఎంత వరకు నిజం ఉందో విటమిన్ డీ ఎక్కువైనే అదే స్థాయిలో సమస్యలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. వెనకా ముందు ఆలోచించకుండా ట్యాబ్లెట్స్ వాడితే పలు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ఇంతకీ విటమిన్ డీ ఎక్కువైన విషయాన్ని ఎలా తెలుసుకోవాలి.? ఎలాంటి లక్షణాల ఆధారంగా విటమిన్ డీ ఎక్కువైన విషయాన్ని కనుగొనవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. శరీరంలో విటమిన్ డీ స్థాయిలు ఎక్కువైతే.. కడుపులో వికారంగా ఉంటుంది. వాంతులు వేధిస్తుంటాయి. ఇక మలబద్ధకం సమస్య కూడా తప్పదని నిపుణులు అంటున్నారు. విటమిన్ డీ ఎక్కువైతే.. ఆకలి తగ్గిపోతుందుఇ. అదే విధంగా మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. నిత్యం గందరగోళం, నిరాశ, మానసిక ఆరోగ్యం దెబ్బతినడం వంటి సమస్యలు వస్తాయి.

వైద్యుల సూచనలు, వైద్య పరీక్షలతో సంబంధం లేకుండా ఎట్టి పరిస్థితుల్లో విటమిన్ డీ ట్యాబ్లెట్స్‌ను ఉపయోగించకూడదని నిపుణులు చెబుతున్నారు. సహజంగానే విటమిన్ డీ పందే ప్రయత్నం చేయాలి.

ఇందుకోసం ఉదయాన్నే వచ్చే లేలేత సూర్య కిరణాలు చర్మంపై పడేలా చూసుకోవాలి. వారానికి రెండు నుంచి మూడు రోజుల పాటు ఎండలో ఉంటే సరిపోతుంది. అది కూడా రోజుకు 15 నుంచి 20 నిమిషాలు ఉండాలి. ఇక తీసుకునే ఆహారం ద్వారా కూడా విటమిన్ డీ పొందొచ్చు. ముఖ్యంగా చేపలు, పాలు, పప్పులు, ఆరెంజ్ జ్యూస్ వంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలి.

## చలికాలంలో తినాల్సిన సూపర్ పండు

జామ పండు చలికాలంలో వచ్చే సీజనల్ ఫ్రూట్. ఈ సీజన్లో జామ పండ్లను తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. జామ పండులో బోలెడు పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా జామ పంటలో



విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది చలికాలంలో మన శరీరాన్ని ఇన్ఫెక్షన్ల బారి నుంచి కాపాడుతుంది. మన రోగనిరోధక శక్తిని పెంచి మనం ఆరోగ్యంగా ఉండడానికి జామపండు ఎంతగానో దోహదం చేస్తుంది. జామపండుతో ఆరోగ్య ప్రయోజనాలు జామపండును తినడం వల్ల మన జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ మన జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి ఎంతగానో సహకరిస్తుంది. జామ పండులో విటమిన్ సి మన శరీరంలో కొలాజిన్ ఉత్పత్తిని పెంచుతుంది. జామపండును ప్రతిరోజు తినడం వల్ల చర్మం యవ్వనంగా మారుతుంది. ఇది చర్మ సౌందర్యాన్ని పెంచేలా చేస్తుంది. జామ పండులో మెగ్నీషియం ఉంటుంది. ఇది మన మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. "రాత్రిపూట ఇలాంటి ఫుడ్ తిన్నారో ముప్పతిప్పలు పడాల్సిందే!" బరువుకు, మధుమేహానికి జామపండుతో చెక్ జామ పండులో ఉండే ఫైబర్ మనం తినడం వల్ల మన కడుపు నిండుగా ఉన్నట్టుగా చేస్తుంది. దీనివల్ల మనం అదనంగా ఎక్కువగా తినకుండా ఉంటాము. ఫలితంగా బరువు తగ్గడానికి జామపండు ఎంతో బాగా దోహదం చేస్తుంది. జామ పండ్లలో గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది మధుమేహం బారినపడి బాధపడుతున్న వారికి అద్భుతమైన సేఫెస్ట్ పండుగా చెప్పవచ్చు. మధుమేహ బాధితులు ఎలాంటి అనుమానాలు లేకుండా జామపండును తినవచ్చు. జామపండుతో ఈ లాభాలు కూడా ఇక జామపండును తినడం వల్ల మన ఎముకల పుష్టి పెరుగుతుంది. మన మెదడు ఆరోగ్యాన్ని జామ పండు మెరుగుపరుస్తుంది. జామ పండులో ఉండే పోషకాలు మన కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ఫోలేట్ మన పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

నరాల బలహీనతతో బాధపడేవారు జామ పండ్లు తినడం ఎంతో మంచిది. జామ పండ్లు మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. హైబీపీతో పాటు గుండె ఆరోగ్యానికి జామపండు అధిక రక్తపోటుతో బాధపడే వారికి, హై బీపీని తగ్గించడానికి జామపండు ఎంతో బాగా ఉపయోగపడుతుంది. జామపండు మన గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన జామపండు శీతాకాలంలో మనకు వచ్చే అనేక అనారోగ్య సమస్యలను రాకుండా అడ్డుకుంటుంది. కనుక ఈ సీజన్ లో సూపర్ ఫ్రూట్ జామపండును ప్రతి ఒక్కరు ఎంచక్కా తినేయొచ్చు.

## చలికాలంలో పైనాపిల్ తింటున్నారా?



పైనాపిల్ ఆరోగ్యానికి ఎంతో మంచి చేస్తుంది. పైనాపిల్ లో ఉండే పోషకాలు మన శరీరానికి కావలసిన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తాయి. ఇది ఉష్ణ మండల ప్రాంతాలకు చెందిన ఒక రుచికరమైన పండు .తియ్యటి రుచి, వాసన తో ఉండే ఈ పైనాపిల్ లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అయితే పైనాపిల్ చలికాలంలో తినక పోవడమే మంచిది అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీళ్ళు పైనాపిల్ తినొద్దు చలికాలంలో పైనాపిల్ ఎక్కువగా తినొద్దని, ఇది తినడం వల్ల నోరు కొట్టుకుపోయే ప్రమాదం వస్తుందని చెబుతున్నారు. గర్భిణీలు కూడా ప్రెగ్నెన్సీ వచ్చిన తొలి రోజుల్లో పైనాపిల్ ని తినడం మంచిది కాదని, ఇది గర్భస్రావాన్ని పెంచే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. చలికాలంలో చాలా మంది అలర్జీ సమస్యలతో బాధపడుతూ ఉంటారు. అటువంటివారు పైనాపిల్ తినడం మంచిది కాదని చెబుతున్నారు.

"ప్రతిరోజూ భోజనం తర్వాత మజ్జిగ తాగుతున్నారా? గుండె ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది?" ఈ నొప్పులతో పైనాపిల్ తినొద్దు పైనాపిల్ అలర్జీని మరింత పెంచుతుందని ఇందులో ఉండే ఎంజైమ్ లు పెదవులు మందంగా మారడం, నోరు కొట్టుకుపోవడం వంటి దుష్ప్రభావాలకు కారణం అవుతుందని చెబుతున్నారు. ఇక ఆర్థరైటిస్ తో బాధపడేవారు పైనాపిల్ ను శీతాకాలంలో పొరపాటున కూడా తినకూడదు. ఇది కీళ్లనొప్పులను, ఒళ్ళు నొప్పులను తీవ్రతరం చేస్తుంది. ఈ సమస్యలు ఉన్నవారు పైనాపిల్ జోలికి పోకండి సైనస్ సమస్యలు శీతాకాలంలోనే ఎక్కువ వేధిస్తాయి. ముక్కు మూసుకుపోవడం, గొంతు నొప్పి రావడం, కఫం సమస్యలు చోటు చేసుకోవడం, పొడి దగ్గు రావడం వంటి ఇబ్బందులు శీతాకాలంలోనే వస్తాయి. ఈ సమస్యలతో బాధపడేవారు పైనాపిల్ అస్సలు తినకూడదు. తింటే సమస్య మరింత జటిలం అవుతుంది. పైనాపిల్ లో ఎక్కువ మొత్తంలో సుక్రోజ్ షుగర్ ఉంటుంది. ఇది త్వరగా జీర్ణం కాదు.

## వారానికి ఎంత బీరు తాగితే ఆరోగ్యం?

బీరు, ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన పానీయం. కేవలం రుచి కోసం మాత్రమే కాకుండా, సరదాగాను, విశ్రాంతి కోసం కూడా చాలా మంది బీరును ఇష్టపడతారు. దీనిని తాగడం సరదాగా



అనిపించినప్పటికీ, దీన్ని మితంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. మితమైంది అంటే ఎంత అనే విషయం వ్యక్తిగత ఆరోగ్యం, జీవనశైలి, వ్యతిరేక పరిమాణాలను బట్టి మారుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇతర ఆరోగ్య నిపుణుల ప్రకారం, మితమైన మద్యం సేవించడం ప్రతి రోజుకి లేదా వారానికి నిర్దిష్ట పరిమితిలో మాత్రమే చేయాలి. వారానికి ఎంత బీరు తాగొచ్చు ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలు: ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం, మహిళలు సుమారు 5శాతం ఆల్కహాల్‌తో రోజుకు 330 మిల్లీలీటర్ల బీర్ తాగాలని చెబుతోంది. అదే పురుషులు అయితే, 660 మిల్లీ లీటర్ల వరకు తాగొచ్చని అంటుంది. మహిళలు వారానికి 7-14 యూనిట్ల ఆల్కహాల్ కంటే తక్కువగా తాగడం సురక్షితంగా పరిగణించబడుతుంది. ఒక యూనిట్ అంటే సుమారుగా ఒక గ్లాస్ వైన్ లేదా ఒక బీర్ క్యాన్. పురుషులైతే వారానికి 14-21 యూనిట్ల ఆల్కహాల్ కంటే తక్కువగా తాగడం సురక్షితంగా పరిగణించబడుతుంది. "ఊపిరితిత్తులు తేడా రాకుండా ఉండాలంటే ఇలా చేయండి" బీర్ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు: గుండె ఆరోగ్యం: తక్కువ మోతాదులో బీర్ తాగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు వివరించారు. బీర్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.

శరీరానికి కావాల్సిన ఫైబర్ కంటెంట్ బీర్లో 20శాతం ఉంటుంది. బీర్‌లో పొటాషియం, మెగ్నీషియం పుష్కలంగాఉండి, కిడ్నీలో రాళ్ళ కరిగించడానికిసహాయపడతాయి. బీర్ తాగడం వల్ల కలిగే అనర్థాలు: బరువు పెరుగుదల: బీర్ అధికంగా తాగితే బరువు త్వరగా పెరిగిపోతారు. దీనివల్ల ఊబకాయం బారిన పడతారు. రాత్రి సమయాల్లో నిద్ర పట్టదు. ఉదయానికి హ్యాంగోవర్ గా ఉంటుంది. రోజూ బీరు తాగటం వల్ల దీర్ఘకాలంలో నిద్రలేమి సమస్యతోపాటు కిడ్నీ, లివర్ డ్యామేజ్ అవుతుంది. బ్లడ్ ప్రెజర్ పెరుగుతుంది. రోజూ బీరు తాగడం వల్ల కిడ్నీలపై ఎఫెక్ట్ పడుతుంది. ఈ కారణంగా కిడ్నీ స్టోన్ లేదా కిడ్నీ ఫెయిల్యూర్ అయ్యే ప్రమాదం ఉంటుంది.

## జ్వరం వచ్చినప్పుడు మటన్ తింటున్నారా..?

జ్వరం వచ్చినప్పుడు ఏం తినాలి, ఏం తినకూడదు అన్నది చాలామందికి సందేహం. మటన్ లాంటి మాంసాహారం తినడం వల్ల లాభాలు, నష్టాలు ఏంటో చాలామందికి తెలియదు. సాధారణంగా జ్వరం వచ్చినప్పుడు తేలికగా జీర్ణమయ్యే ఆహారాలను తీసుకోవడం మంచిది. మటన్ లాంటి మాంసాహారం జీర్ణం కావడానికి కాస్త ఎక్కువ సమయం పడుతుంది. అంతేకాకుండా, జ్వరం వల్ల శరీరం బలహీనంగా ఉన్నప్పుడు మాంసం జీర్ణం కావడం కష్టమవుతుంది. ఇది జీర్ణ సంబంధిత సమస్యలకు దారితీయవచ్చు. కానీ, ఈ విషయంలో ఒక నిర్దిష్ట నియమం లేదు. కొంతమంది వైద్య నిపుణులు జ్వరం తీవ్రత, వ్యక్తి ఆరోగ్య పరిస్థితులు బట్టి మాంసాహారం తీసుకోవడం




గురించి వేర్వేరు సలహాలు ఇస్తారు. ప్రయోజనాలు: మటన్‌లో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. జ్వరం వల్ల శరీరం బలహీనపడినప్పుడు, ఈ ప్రోటీన్లు శరీరాన్ని తిరిగి బలోపేతం చేయడానికి సహాయపడతాయి. మటన్‌లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. జ్వరం వల్ల రక్తహీనత వచ్చే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో ఐరన్ శరీరానికి చాలా అవసరం. మటన్‌లో విటమిన్ బి12, జింక్ వంటి ఇతర ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. ఇవి శరీర రోగ నిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. "చికెన్: కోడి మాంసాన్ని షాపు నుంచి తెచ్చాక కడగకూడదా? వాష్ చేస్తే ప్రమాదమా? మరి ఎలా వండాలి?" నష్టాలు: జ్వరం వచ్చినప్పుడు జీర్ణ వ్యవస్థ బలహీనంగా ఉంటుంది. మటన్ లాంటి భారీ ఆహారాన్ని జీర్ణించుకోవడం కష్టం కావచ్చు. ఇది జీర్ణ సమస్యలకు దారి తీయవచ్చు. కొంతమందికి మటన్ తినడం వల్ల జ్వరం మరింత పెరగవచ్చు. ఎందుకంటే మటన్ శరీర ఉష్ణోగ్రతను పెంచే గుణం కలిగి ఉంటుంది. మటన్‌లో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది.


జ్వరం వచ్చినప్పుడు కొవ్వు శాతం ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడం మంచిది కాదు. ముగింపు: జ్వరం వచ్చినప్పుడు మటన్ తినాలా వద్దా అనే నిర్ణయం వ్యక్తి ఆరోగ్య పరిస్థితులు, జ్వరం తీవ్రత, వైద్యుని సలహా ఆధారంగా తీసుకోవాలి. సాధారణంగా తేలికపాటి ఆహారాలను తీసుకోవడం మంచిది.



# సినిమా



## 'క' ఫ్లాప్ అయితే సినిమాలు వదిలేసి వెళ్లేవాడిని



తెలుగు ఇండస్ట్రీలో చిన్న సినిమాగా వచ్చి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది 'క' చిత్రం. టాలీవుడ్ యువ నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు సుజీత్, సందీప్ ఇద్దరు దర్శకులు సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. కిరణ్ అబ్బవరం సోంత బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమాను చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మించారు. నయన్ సారిక కథానాయికగా నటించింది. దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలవడమే కాకుండా.. రూ.50 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చి సందడి చేస్తున్న విషయం తెలిసిందే. ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో 'క' ప్రస్తుతం రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇదిలావుంటే ఈ సినిమాకు ఓటీటీలో వస్తున్న రెస్పాన్స్ సందర్భంగా చిత్రయూనిట్ తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ ప్రెస్ మీట్‌లో కిరణ్ మాట్లాడూతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ సినిమా ఇంతటి విజయం సాధించినందుకు చాలా హ్యాపీగా ఉంది. థియేటర్‌తో పాటు ఓటీటీలో కూడా మంచి టాక్‌తో ఈ సినిమా నడుస్తుంది అని తెలిపారు. ఈ సినిమా సక్సెస్ కాకపోతే సినిమాలు మానేస్తా అన్నారు. నిజంగానే అదే చేసేవారా? అని రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు కిరణ్ సమాధానమిస్తూ.. నేను మాట మీద నిలబడే మనిషిని. ఈ సినిమా ఫ్లాప్ అయ్యి ఉంటే కచ్చితంగా సినిమాలు వదిలేసి వెళ్లేవాడిని అంటూ కిరణ్ చెప్పుకోచ్చాడు.





## నా డ్రెస్సు అమ్ముతున్నాను..

### ధర రూ.3 కోట్ల 66 లక్షలు.. ఉర్ఫీ జావేద్ పోస్ట్..

సాధారణంగా సినీతారల ఉపయోగించిన వస్తువులు, దుస్తులు వేలం వేస్తుంటారు. అయితే వాటిని లక్షల్లో, కోట్లలో కొనుగోలు చేస్తుంటారు. గతంలో నిషా కళ్ల చిన్నది సిల్క్ స్మిత సగం తిన్న ఆపిల్ పండును సైతం వేలం వేశారు. తాజాగా బాలీవుడ్ బ్యూటీ ఉర్ఫీ జావేద్ తన కొత్త డ్రెస్సును అమ్ముతాను అంటూ పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఆ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. బిగ్ బాస్, సోషల్ మీడియాతోపాటు, పలు టెలివిజన్ షోలలో పాపులారిటీని సొంతం చేసుకున్న ఉర్ఫీ జావేద్.. బోల్డ్ గా కనిపిస్తూ.. కొత్త కొత్త వెరైటీ డ్రస్సులతో హాట్ హాట్ ఫోటోలతో నెట్టింట రచ్చ చేస్తుంటుంది. అయితే ఈ అమ్మడు క్రేజీ ఫోటోషూట్స్, డ్రెస్సింగ్ పై నిత్యం చాలా మంది విమర్శలు గుప్పిస్తుంటారు. కానీ ఓ డ్రెస్సు విషయంలో మాత్రం ఈ బ్యూటీ పై ప్రశంసలు కురిపించారు. అదే బ్లాక్ అండ్ గ్రీన్ బట్టర్ ఫ్లై డ్రెస్. బ్లాక్ కలర్ లాంగ్ ఫ్రాక్ టైప్ డ్రెస్ ను వేసుకుని ఉర్ఫీ గతంలో ఫోటోస్ దిగిన సంగతి తెలిసిందే. ఆ డ్రెస్ పై పువ్వులు, ఆకులతోపాటు బట్టర్ ఫ్లైస్ కనిపిస్తూ చూడడానికి ఎంతో అందంగా కనిపించింది. ఇప్పుడు అదే డ్రెస్సును అమ్ముతున్నట్లు ప్రకటించింది ఉర్ఫీ. ఆ డ్రెస్ ధర కేవలం రూ.3 కోట్ల 66 లక్షల 99 వేలు మాత్రమే. ఎవరికైనా ఇంట్రెస్ట్ ఉంటే నాకు మెసేజ్ చేయండి అంటూ పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఉర్ఫీ చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. అయితే ఉర్ఫీ పెట్టిన పోస్ట్ చూసి షాకవుతున్నారు నెటిజన్స్. ఒక్క డ్రెస్ ఏకంగా రూ.3 కోట్లకు పైన ధర ఉంటుందా ? అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇక ఈ విషయంలో మాత్రం కొందరు ఉర్ఫీని ట్రోల్ చేస్తున్నారు. అయితే ఉర్ఫీ మాత్రం తన డ్రెస్ అమ్మడానికి గల రీజన్ మాత్రం వెల్లడించలేదు.

## బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నా..

### పెళ్లి గురించి ఐశ్వర కీలక వ్యాఖ్యలు

మలయాళ ఇండస్ట్రీ ద్వారా వెండి తెరకు ఎంట్రీ ఇచ్చింది అందాల తార ఐశ్వర్య లక్ష్మీ. ఆ తర్వాత గాడ్సే చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈ చిన్నది పొన్నియన్ సెల్వన్ ద్వారా పాన్ ఇండియా స్థాయిలో నటిగా మంచి గుర్తింపు సంపాదించుకుంది. భాషతో సంబంధం లేకుండా వరుస అవకాశాలు సంపాదించుకుంటున్న ఈ చిన్నది తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి మాట్లాడుతూ.. మొదటి తాను డాక్టర్ అవ్వాలనుకున్నాని, ఎంబీబీఎస్ చదవడానికి కొచ్చి వెళ్లాలనని, కానీ అనుకోకుండా యాక్టర్ అయ్యానని చెప్పుకొచ్చింది. ఫైనల్ ఇయర్ ఎగ్జామ్ రిజల్ట్ రావడానికి రెండు రోజుల ముందు, హీరోయిన్ కోసం ఓ పేపర్‌లో ప్రకటన చూశాను. నా ఫోటోను ఆ చిరునామాకు పంపాను. అలా మొదటి అవకాశం వచ్చిందని ఐశ్వర్య తెలిపింది. ఇక క్రికెటర్ యువరాజ్ సింగ్ తన మొదటి క్రష్ అని తెలిపిన ఐశ్వర్య.. టీనేజ్‌లో యువరాజ్ అంటే చాలా ఇష్టపడేదానని, ఆ తర్వాత క్రికెట్ చూసే సమయం లేదని తెలిపింది. సినిమాల్లో అభిషేక్ బచ్చన్, విజయ్ దళపతి అంటే ఇష్టమని చెప్పుకొచ్చింది. ఇక పెళ్లి గురించి తన అభిప్రాయాన్ని తెలిపిన ఐశ్వర్య.. జీవితంలో ఎప్పటికీ పెండ్లి చేసుకోనని తేల్చి చెప్పేసింది. తాను ఈ నిర్ణయాన్ని ఎంతో ఆలోచించి తీసుకున్నానని తెలిపింది. అయితే ఒకప్పుడు.. గురువాయూర్ గుడిలో జరిగే పెళ్లిళ్లు చూసి తనకు కూడా పెళ్లి చేసుకోవాలని అనిపించిందంటా. ఇందులో భాగంగాన గతంలో తన ప్రొఫైల్ ఓ మ్యాట్రిమోనీలో కూడా పెట్టానని తెలిపింది. అయితే ఇప్పుడు తనకు తెలిసిన చాలామందిలో ఒకటి రెండు జంటలు తప్పితే అందరూ రాజీపడి బతుకుతున్నారని ఐశ్వర్య చెప్పుకొచ్చింది. చాలా మంది వివాహం వల్ల వ్యక్తిగతంగా ఎదగలేకపోతున్నారని, వివాహంపై తన అభిప్రాయం మారిందన్న ఐశ్వర్య, అందుకే నేను ఎప్పటికీ చేసుకోకూడదని నిర్ణయించుకున్నాని తేల్చి చెప్పింది. మరి ఐశ్వర్య ఇదే మాటపై ఉంటుందా.? పెళ్లి గురించి తన అభిప్రాయాన్ని మార్చుకుంటుందా చూడాలి.






## మరో సినిమాతో వస్తోన్న ధృవ సర్జా..

### కోర ఫస్ట్ లుక్‌తో సూపర్ హైప్

కన్నడలో సూపర్ ఫాలోయింగ్ ఉన్న యాక్టర్లలో ఒకడు ధృవ సర్జా ఇటీవలే మార్టిన్ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ టాలెంటెడ్ యాక్టర్ తాజాగా మరో సినిమాతో అందరినీ పలుకరించేందుకు రెడీ అవుతున్నాడు. అయితే ఈ సారి మాత్రం హీరోగా కాకుండా నిర్మాతగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వస్తున్నాడు. ధృవ సర్జా సమర్పిస్తున్న తాజా ప్రాజెక్ట్ కోర. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ మూవీలో సునామీ కిట్టి, చరిష్మా, పి మూర్తి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ మూవీ ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. హీరో ముఖంపై గాట్లతో సీరియస్‌గా కనిపిస్తూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు. ఒరటాశ్రీ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ మరియు రత్నమ్మ మూవీస్ పతాకాలపై డాక్టర్ ఎబి నందిని, ఎఎన్ బాలాజీ, పి మూర్తి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ఎంకే మాత, మునిరాజు, నీనాసం అశ్వత్‌లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి బిఆర్ హేమంత్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం కన్నడ, తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

# జనవరి 11నే అయోధ్య వార్షికోత్సవం

**లక్నో :** భారత దేశం లోనే కాదు ప్రపంచంలో ఉన్న హిందువుల స్వప్నం అయోధ్యలో రామాలయ నిర్మాణం. 500 ఏళ్లుగా రామాలయ నిర్మాణం కోసం జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఎట్టకేలకు అయోధ్యలో రామ మందిర నిర్మాణంపై సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించడంతో రెండేళ్ల క్రితం ఆలయ నిర్మాణం ప్రారంభించారు. 2022 డిసెంబర్ నాటికి మొదటి దశ నిర్మాణం పూర్తయింది. దీంతో 2023, జనవరి 22న ఆలయలో బాలరాముడి విగ్రహం ప్రతిష్టాపనోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేశంలోని ప్రముఖులతోపాటు విదేశాల నుంచి కూడా ప్రముఖులు తరలివచ్చారు. బాల రాముడిని దర్శించుకుని తరించారు. పూర్తిగా విరాళాలతో ఈ ఆలయం నిర్మించారు. ప్రధాని నరేంద్రమోదీ బాలరాముని ప్రాణప్రతిష్ట నిర్వహించారు. అప్పటి నుంచి నిత్యం వేల మంది భక్తులు అయోధ్య వెళ్లి రామయ్యను దర్శించుకుంటున్నారు. ఆలయం ప్రారంభించి మరో రెండు నెలల్లో ఏడాదది పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో వార్షికోత్సవం నిర్వహణ కోసం శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అధ్యక్షతన ఇటీవల సమావేశం నిర్వహించారు. రామాలయ వార్షికోత్సవ వేడుకల నిర్వహణపై నిర్ణయం తీసుకున్నారు. వార్షికోత్సవ వేడుకలను జనవరి 22న కాకుండా జనవరి 11నే నిర్వహించాలని నిర్ణయించారు. పది రోజుల ముందే వేడుకల నిర్వహణ వెనుక కారణం ఉందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో ఏ రోజు ఏ ఉత్సవం నిర్వహించాలో నిర్ణయం తీసుకున్నారు. రామాలయ



వార్షికోత్సవాన్ని హిందూ క్యాలెండర్ ప్రకారం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. పుష్య శుక్ల ద్వాదశి అంటే కూర్మ ద్వాదశి రోజు ఉత్సవం జరుపుకోవాలని పండితులు తెలిపారు. అంటే ఇంగ్లిష్ క్యాలెండర్ 2025, జనవరి 11న ఈ తిథి వస్తుంది. దీని ప్రకారమే అయోధ్యలో నూతన రామాలయ, బాలరాముని ప్రాణ ప్రతిష్ట వార్షికోత్సవం నిర్వహించాలని తీర్మానించారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించారు.

# అలక వీడని షిండే

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి దాదాపు వారం రోజులు గడిచినా మహాయుతి అధికార రహస్యం ఇంకా వీడలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన సమస్య కూడా పెరుగుతోంది. మహారాష్ట్ర సీఎం ఎవరనేది ఇప్పట్లో ఖరారు కానప్పటికీ.. భారతీయ జనతా పార్టీ నుంచి ముఖ్యమంత్రి కావడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. తాత్కాలిక ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రస్తుతం తన స్వగ్రామమైన సతారాలో ఉన్నారు. ఈ సాయంత్రానికి ఆయన ముంబై చేరుకునే అవకాశం ఉంది. ఈ సాయంత్రంలోగా షిండే ముంబైకి రాకపోతే, అది మళ్లీ అతని అసంతృప్తికి ముడిపడి ఉంటుందంటున్నారు విశ్లేషకులు. మహారాష్ట్రలో ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనేది ఒకటి రెండు రోజుల్లో తేలనుంది. ఈ విషయాన్ని షిండే గ్రూప్ లీడర్ సంజయ్ శిర్సత్ వెల్లడించారు. షిండే ఆరోగ్యం కాస్త విషమించిందని, అందుకే స్వగ్రామంలో ఉండిపోయారని శిర్సత్ తెలిపారు. ఈరోజు కొంచెం మెరుగ్గా ఉంది. ఆయన సతారా నుంచి ముంబై వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సాయంత్రం లేదా రేపు మహాయుతి సభ



జరిగే అవకాశం ఉంది. ఈ భేటీలో మంత్రి పదవిపై ఏకాభిప్రాయం కుదరనుంది. షిండే వర్గానికి హోంమంత్రి, ఆర్థిక మంత్రికి సంబంధించిన విషయానికి పరిష్కారం దొరుకుతుందని సంజయ్ శిర్సత్ అభిప్రాయపడ్డారు.
మంత్రివర్గం విషయంలో మహాయుతిలో ఎలాంటి చీలిక లేదంటున్నారు మూడు పార్టీల నేతలు. ఢిల్లీలో సీఎం పదవిపై నిర్ణయం తీసుకోనున్నారు. మరోవైపు దేవేంద్ర ఫడ్నవీస్ ఏకనాథ్ షిండేకు ఫోన్ చేసి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు.
తాత్కాలిక సీఎం షిండే గత 2 రోజులుగా తన స్వగ్రామమైన సతారాలో ఉన్నారు. ఈరోజు మధ్యాహ్నం ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో థానే చేరుకుంటారు. ఇదిలావుంటే, ఏక్‌నాథ్ షిండే శుక్రవారం అకస్మాత్తుగా స్వగ్రామానికి చేరుకున్నారు. షిండే సతారా వెళ్లడం వల్ల మహారాష్ట్రలో ఎన్డీయే ప్రతిపాదిత సమావేశం రద్దయింది. షిండే మంత్రిగా ఆర్థిక, హోం శాఖలను కోరుతున్నారు. గత ప్రభుత్వంలో హోం, ఆర్థిక శాఖలు రెండూ ఉప ముఖ్యమంత్రి వద్ద ఉండేవి. ప్రస్తుతం బీజేపీ నుంచి ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. బీజేపీ ఆయనకు డిప్యూటీ సీఎంతో పాటు పీడబ్ల్యూడీ ఆఫర్ చేసింది. మహారాష్ట్ర సీఎం ఎవరనేది ఇప్పట్లో ఖరారు కానప్పటికీ.. బీజేపీ నుంచి సీఎం అవుతారన్నదీ దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. సీఎం అభ్యర్థి ఖరారు కానప్పటికీ ప్రమాణస్వీకార తేదీ, స్థలం ఖరారయ్యాయి. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం డిసెంబర్ 5 మధ్యాహ్నం 1 గంటలకు జరుగుతుంది. ఈ వేడుకను ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో నిర్వహిస్తారని సమాచారం.

# తీరం దాటిన ఫెంగల్ తుఫాన్

## 16 గంటల తర్వాత తెరచుకున్న చెన్నై ఎయిర్‌పోర్ట్

**చెన్నై:** బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ తీరం దాటింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి మధ్య మహాబలి పురం-కారైకాల్ వద్ద తీరం దాటినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది పశ్చిమ-నైరుతి దిశగా కదులుతూ క్రమంగా బలహీన పడుతుందని, దీంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరిపై తుఫాను విరుచుకుపడింది. భారీ వర్షాలు, వరదలతో ఇరు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. తమిళనాడులో కుండపోతగా వర్షాలు కురుస్తుండటంతో చెన్నై సహా పలు జిల్లాల్లో రాకపోకలు స్తంభించాయి.
గత 34 గంటల్లో చాలా ప్రాంతాల్లో 20 సెంటీ మీటర్ల నుంచి 27 సెంటీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది. చెన్నై నగరవ్యాప్తంగా 134 ప్రాంతాలు నీట మునిగినట్లు అధికారుల అంచనా వేశారు. గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం, కుండపోత వర్షాలతో సహాయక చర్యల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. బలమైన గాలులు వల్ల చాలా ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయని, వాటిని తొలగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కరెంటు షాక్‌తో ముగ్గురు మరణించారు. ఇక 14 గంటల తర్వాత చైన్నై విమానాశ్రయం తెరుచుకున్నది. ఎయిర్‌పోర్టులోకి నీరు చేరడంతో శనివారం మధ్యాహ్నం విమానాశ్రయాన్ని అధికారులు మూసివేశారు. పలు విమానాలను రద్దుచేశారు. అయితే ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఎయిర్‌పోర్టులో తిరిగి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అయితే విమాన సర్వీసులు మాత్రం ఇంకా అందుబాటులోకి రాలేదు.



**ఏపీలో భారీ వర్షాలు..**

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి జిల్లాలో తడ దగ్గర జాతీయ రహదారిపై పెద్దఎత్తున వాన నీరు నిలిచింది. జిల్లాలోని సూళ్లూరుపేట తడ, దొరవారి సత్రం, నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. సూళ్లూరుపేట, ఏర్పేడు, నారాయణవనం, కేవీబీపురం మండలాల పరిధిలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. తుఫాన్ ప్రభావంతో.. గూడూరు, కోట, వాకాడు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో కుండపోతగా వర్షం కురుస్తున్నది. దీంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.

# కారును ఢీకొట్టిన ట్రక్కు.. ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం

ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. రాయ్‌పూర్ నుంచి అంబికాపూర్ వెళ్తున్న కారును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో నలుగురు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సుర్గుజా జిల్లా అంబికాపూర్ %-% బిలాస్‌పూర్ జాతీయ రహదారి 130పై ఉదయపూర్ సమీపంలో ప్రమాదం చోటు చేసుకున్నది. ప్రమాతం తర్వాత ట్రక్కు డ్రైవర్ తప్పించుకునేందుకు కార్‌ని రివర్స్ చేయగా.. కారు మరింత దెబ్బతింది. మృతులను చంగురభతా రాయ్‌పూర్ వాసులుగా గుర్తించారు. జగదల్‌పూర్‌కు కారులో బయలుదేరగా.. ఉదయపూర్ అదానీ గెస్ట్ హౌస్ సమీపంలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాలను కట్టర్ల సహాయంతో తొలగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## భారత జనాభా వృద్ధిరేటుపై ఆందోళన



భారత దేశ జనాభా వృద్ధి రేటు తగ్గుతుండడంపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంతానోత్పత్తి రేటు 2.1 శాతానికి మించి ఉండాలని ఆధునిక జనాభా శాస్త్రం చెబుతోందన్నారు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగించే అంశమని.. సమాజంలో సంతానోత్పత్తి రేటు 2.1 శాతం కంటే తక్కువగా ఉంటే.. ఆ సమాజం ఎలాంటి సంక్షోభం అవసరం లేకుండానే భూమిపై మనుగడ అంతరించిపోయే అంచునకు చేరుకుంటుందని ఆధునిక జనాభా శాస్త్రం చెబుతోందన్నారు. జనాభా తగ్గడం వల్ల అనేక భాషలు, సమాజాలు ఇప్పటికే ఉనికి కోల్పోయాయన్నారు. 1998, 2002లో భారత జనాభా విధానం రూపొందిందని, 2.1 శాతానికి కంటే సంతోనోత్పత్తి పడిపోకుండా చూడాల్సిన అవసరాన్ని గుర్తించిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ పేర్కొన్నారు. సమాజం మనుగడకు ఇద్దరు, ముగ్గురి అవసరం ఉందన్న ఆయన.. ఆధునిక జనాభా శాస్త్రం చెబుతున్నది కూడా ఇదే చెబుతుందన్నారు. ఈ సంఖ్య చాలా కీలకమని లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయన్నారు. జనాభా వృద్ధి రేటు తగ్గుముఖం పట్టడం సమాజానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఇదిలా ఉండగా.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గుతూ వస్తున్నది. 1950 సంవత్సరంలో ఫెర్టిలిటీ రేటు 6.2శాతం కంటే ఎక్కువ ఉండగా.. ప్రస్తుతం అది 2.1శాతానికి తగ్గింది. ఇలా కొనసాగితే 2050 నాటికి సంతానోత్పత్తి రేటు 1.3కి పడిపోయే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు...



గత కొంతకాలంగా బంగ్లాదేశ్ లో అరాచక పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాని పదవి నుంచి షేక్ హసీనా బలవంతంగా తప్పుకోవాల్సి రావడం, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడడం, ఇటీవల హిందువులపై దాడులు జరుగుతుండడం తెలిసిందే. బంగ్లాదేశ్ లో హిందువులపై దాడుల ప్రకంపనలు ఏపీలోని విశాఖలోనూ వినిపించాయి. నేడు ఆంధ్రా యూనివర్సిటీలోని ఇంటర్నేషనల్ హాస్టల్ వద్ద జనజాగరణ్ సమితి, హిందూ ధార్మిక సంఘాలు ఆందోళన చేపట్టాయి. బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులను నిరసిస్తూ... నినాదాలు చేశారు. ఇక్కడి హాస్టళ్లలోని బంగ్లాదేశీ విద్యార్థులు వారి స్వదేశానికి వెళ్లిపోవాలంటూ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో, పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. ఆందోళనకారులను అరెస్ట్ చేశారు.

## వినియోగదారులకు షాక్ ఇచ్చిన
## చమురు కంపెనీలు..
## వరుసగా ఐదోసారి సిలిండర్ ధర పెంపు..



చమురు కంపెనీలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. వాణిజ్య సిలిండర్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.16.50 పెరిగింది. పెరిగిన ధరలు ఆదివారం నుంచి అమలులోకి వచ్చాయి. పెంపు తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1818.50కి పెరిగింది. ధరలు పెరుగడం వరుసగా ఇది ఐదోసారి. అలాగే, ఐదు కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధరపై రూ.4 వరకు పెంచింది. ఇక గృహ వినియోగ 14.2 కిలోల సిలిండర్ ధరలను మాత్రం పెంచలేదు. గత నెలల ప్రారంభంలో కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ లిండర్ ధరను రూ.62 పెంచగా.. అక్టోబర్ 1న రూ.48.5 పెరిగి రూ.1,740కి చేరింది. ఆగస్ట్ 1న సిలిండర్‌పై రూ.6.5 పెరిగింది. సెప్టెంబర్ 1న రూ.39 పెరిగింది. ఇప్పటికే పెరిగిన ధరలతో అందరూ ఇబ్బందులుకు గురవుతున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో సిలిండర్ల ధరల పెంపుదలతో ఎల్‌పీజీపై ఆధారపడే వాణిజ్య సంస్థలు, చిరువ్యాపారులపై భారీగా ప్రభావం పడే అవకాశం ఉన్నది. కమర్షియల్ ఎల్‌పీజీ ధరలు పెరిగినప్పటికీ డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలో మార్పులు చేయకపోవడం స్వల్పంగా ఊరటనిచ్చినట్లయ్యింది. అంతర్జాతీయ చమురు ధరల ట్రెండ్‌కు అనుగుణంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరను ఆదివారం 1.45 శాతం పెంచారు. దేశ రాజధానిలో ఏవియేషన్ టర్బైన్ ఇంధనం (%ూుఖీ%) ధర కిలోలీటర్‌కు రూ.1,318.12 పెరిగి రూ.91,856.84కి చేరింది. తాజాగా పెరిగిన ధరలతో కోల్?కతాలో రూ.1927, ముంబయిలో రూ.1771, చెన్నైలో రూ.1980, హైదరాబాద్‌లో రూ.2066 పలుకుతున్నది. ఇక డొమెస్టిక్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.803 ఉండగా.. ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.603కే అందుబాటులో ఉంది. ముంబయిలో రూ.802.50, చెన్నైలో రూ.818.50, హైదరాబాద్‌లో రూ.855 వద్ద కొనసాగుతున్నది.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : **SIRIKONDA MARIA, RNI No. APTEL/2014/57702.** E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.